

మెట్రో రైల్ సీఎంపీలకు కేంద్రం నిధులు మంజూరు

» శాసన మండలిలో మంత్రి నారాయణ వెల్లడి

అమరావతి, మార్చి 19(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం, విజయవాడ మెట్రో రైలు ప్రాజెక్టుల సీఎంపీ (సమగ్ర మొబిలిటీ ప్లాన్)ల కోసం కేంద్రం నిధులు మంజూరు చేసిందని మంత్రి పి.నారాయణ చెప్పారు. రెండు మెట్రో ప్రాజెక్టులకు ఇచ్చిన సీఎంపీ గడువు ఐదేళ్లు దాటిపోవడంతో తిరిగి మరోసారి ప్లాన్ రూపొందించాలని సెంట్రల్ అర్బన్ ట్రాన్స్‌పోర్ట్ విభాగం కోరిందని బుధవారం శాసన మండలిలో వెల్లడించారు. కేంద్రం ... మిగతా 6వ పేజీలో

ఏప్రిల్ 30న అప్పన్న చందనోత్సవం

రూ.1,500, రూ.1,000, రూ.300 టికెట్ల అమ్మకం

» స్లాట్ల ప్రకారమే దర్శనాలు

» కొండపైకి ప్రైవేటు వాహనాలకు అనుమతి నిషేధం

» కలెక్టర్ హరేంధిరప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిరప్రసాద్, సీపీ శంఖబ్రత బాగ్చీ

విశాఖపట్నం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): సింహాచలం వరాహ లక్ష్మీనృసింహ స్వామి చందనోత్సవం (నిజరూప దర్శనం) వచ్చే నెల 30వ తేదీన జరుగుతుందని కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిరప్రసాద్ తెలిపారు. చందనోత్సవానికి భారీఎత్తున భక్తులు హాజరుకానున్నందున పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్‌లో చందనోత్సవ ఏర్పాట్లపై రెవెన్యూ, పోలీస్, దేవదాయ, ఇతర శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. చందనోత్సవం నేపథ్యంలో ఏప్రిల్ 29వ తేదీ సాయంత్రం ఆరు గంటల నుంచి దర్శనాలు నిలిపివేయాలని, భక్తులకు ఈ విషయం తెలియజేయాలని అధికారులకు సూచించారు. దర్శనం టికెట్ల విక్రయ కేంద్రాలు నగరంలో అనుకూలమైన ప్రాంతాల్లో ఏర్పాటుచేయాలని ... మిగతా 6వ పేజీలో

ఆరోగ్య కేంద్రాల్లో అంతంతమాత్రం సేవలు



స్వర్ణభారతి వద్ద ఉన్న ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో తుప్పు పట్టిన కుర్చీలు

నగర పరిధిలో 66 అర్బన్ హెల్త్ సెంటర్స్...

» పలుచోట్ల అందుబాటులో లేని మందులు



విద్యుత్‌నగర్ పీహెచ్‌సీలో ఖాళీగా ఉన్న వైద్యుడి కుర్చీ

» వైద్య పరీక్షల నిర్వహణకు కెమికల్స్ కొరత

» కొన్నిచోట్ల వైద్యులు, సిబ్బంది సెలవులో ఉండడంతో సేవలపై ప్రభావం

» ఖాళీగా కనిపిస్తున్న కేంద్రాలు

» సెంటర్స్‌పై సరైన అవగాహన లేకపోవడమే కారణం



స్వర్ణభారతి వద్ద గల ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో డాక్టర్ లేకపోవడంతో నర్సు సేవలు

ఆంధ్రజ్యోతి విజిట్

విశాఖపట్నం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): నగరంలోని అర్బన్ హెల్త్ సెంటర్స్ (పట్టణ ఆరోగ్య కేంద్రాలు)లో ప్రజలకు ఆశించిన స్థాయిలో సేవలు అందడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కొన్నిచోట్ల మందులు అందుబాటులో లేవు. మరికొన్నిచోట్ల వైద్య పరీక్షలు నిర్వహించడం లేదు. ఇంకొన్నిచోట్ల మౌలిక సదుపాయాలు లేవు. 'ఆంధ్రజ్యోతి' బృందం బుధవారం నగరంలో కొన్ని పట్టణ ఆరోగ్య కేంద్రాలను సందర్శించి రోగులకు అందుతున్న సేవలు, అక్కడ ఉన్న ఇబ్బందులను తెలుసుకునే ప్రయత్నం చేసింది.



మద్దిలపాలెం ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రంలో రక్త పరీక్షల గది వద్ద సిబ్బంది లేక ఖాళీగా ఉన్న దృశ్యం

అందుబాటులో లేని మందులు

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించే ఉద్దేశంతో నగరంలో 66 చోట్ల పట్టణ ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటుచేశారు. కేంద్రాల్లో సిబ్బంది ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందించాలి. ప్రతి అర్బన్ హెల్త్ సెంటర్‌లో 172 రకాల మందులు ఉండాలి. అయితే, అనేక కేంద్రాల్లో కీలకమైన మందులు లేకపోవడంతో రోగులు బయట కొనుగోలు చేయాల్సి వస్తోంది. రేసపువానిపాలెం అర్బన్ హె ల్త్ సెంటర్‌లో బీపీ, షుగర్ మందులు ఇవ్వడం రోగులు చెప్పారు. సాధారణంగా హెల్త్ సెంటర్స్‌కు వచ్చే రోగుల్లో దాదాపు 30 శాతం మంది షుగర్, బీపీ సంబంధిత సమస్యలతో బాధపడేవారే ఉంటున్నారు. అటువంటి వారికి అవసరమైన మందులే లేకపోవడంతో ఇబ్బంది ఏర్పడుతోంది.

రక్త పరీక్షలకు ఇబ్బంది

ప్రతి ఆరోగ్య కేంద్రంలో 64 రకాల రక్త పరీక్షలు చేయాలి. అయితే, కొన్నిచోట్ల పరీక్షలు నిర్వహించేందుకు అవసరమైన కెమికల్స్, మరికొన్నిచోట్ల పరికరాలు లేవు. దీంతో పరీక్షలు చేయలేని పరిస్థితి. రేసపువానిపాలెంలోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో ఎల్‌ఎఫ్‌టీ పరీక్షలు చేయడం లేదు. మద్దిలపాలెం అర్బన్ హెల్త్ సెంటర్‌లో కొలెస్ట్రాల్ నిర్ధారణ పరీక్షలు చేసేందుకు అవసరమైన కెమికల్స్ (రీ ఏజెంట్స్) లేవని సిబ్బంది చెబుతున్నారు. అల్లిపురం పట్టణ ఆరోగ్య కేంద్రంలో లిపిడ్ ప్రొఫైల్, లివర్ ఫంక్షనింగ్ పరీక్షలు నిర్వహించేందుకు అవసరమైన రీ ఏజెంట్స్ లేకపోవడంతో పరీక్షలు నిర్వహించలేని దుస్థితి ... మిగతా 6వ పేజీలో

సమయపాలన నిల్

» వైద్యులు, సిబ్బంది కోసం రోగుల ఎదురుచూపులు

అక్కయ్యపాలెం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 26, 27, 43 వార్డుల్లోని పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో వైద్య సేవలు సక్రమంగా అందడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. వీటిలో ఒక వైద్యుడు (మెడికల్ ఆఫీసర్), ఇద్దరు స్టాఫ్ నర్సులు, ఒక ల్యాబ్ టెక్నీషియన్, ఒక ఫార్మసిస్ట్, ఒక సహాయకురాలిని నియమించింది.

అంతా ప్రతి రోజూ ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విధులు నిర్వహించాలి. కానీ సమయానికి రావడం లేదని, దాంతో తాము చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పలువురు రోగులు చెబుతున్నారు. ఓపీ చీటీ రాయించుకొని గంటల కొద్దీ వేచి ఉండాల్సి వస్తోందంటున్నారు. అలాగే కేంద్రాల్లో 63 రకాల పరీక్షలు చేయాలి. కానీ కొన్ని మిషన్లు లేకపోవడంతో 40 రకాల పరీక్షలు మాత్రమే చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఆరోగ్య కేంద్రాల్లో సిబ్బంది, వైద్యులు సకాలంలో వచ్చేలా చూడాలని రోగులు కోరుతున్నారు.

మహా నిర్లక్ష్యం

బడ్జెట్ సమావేశం నిర్వహణలో తాత్సారం

» వచ్చే ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్ ఇప్పటికీ కౌన్సిల్ ఆమోదం పొందని వైనం

» మరో పది రోజులే సమయం

» ఆ తరువాత జీవీఎంసీ ఖాతా నుంచి ఒక్క రూపాయి ఖర్చు చేయాలన్నా వీలుకాదంటున్న అధికారులు

» వచ్చే నెల నుంచి నిలిచిపోనున్న అన్నిరకాల చెల్లింపులు

» తక్షణం బడ్జెట్ సమావేశం ఏర్పాటుచేయాలని జిల్లా కలెక్టర్‌కు మేయర్ లేఖ



విశాఖపట్నం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ బడ్జెట్ (2025-26 ఆర్థిక సంవత్సరం) సమావేశం నిర్వహణలో తాత్సారం జరుగుతోంది. సాధారణంగా రాబోయే ఆర్థిక సంవత్సరానికి రెండు నెలల ముందే బడ్జెట్ ముసాయిదాను అధికారులు రూపొందిస్తే దానిని స్టాండింగ్ కమిటీ, కౌన్సిల్ సమావేశాల్లో చర్చించి ఆమోదించాలి. కొత్త ఆర్థిక సంవత్సరం ప్రారంభం కాగానే బడ్జెట్ కేటాయింపుల ప్రకారం నిధులను ఖర్చు పెట్టాలి. అయితే ఈ ఏడాది జీవీఎంసీలో నెలకొన్న ప్రత్యేక పరిస్థితుల కారణంగా ఇంతవరకూ 2025-26 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ కౌన్సిల్ ఆమోదం పొందలేదు.

బడ్జెట్ ముసాయిదాను ఈ ఏడాది జనవరిలోనే స్టాండింగ్ కమిటీ స్వల్ప సవరణలతో ఆమోదించింది. స్టాండింగ్ కమిటీ ఆమోదం పొందిన ముసాయిదాను కౌన్సిల్‌లో చర్చించి ఆమోదించాల్సి ఉండడంతో సమావేశం నిర్వహణకు అధికారులు ఏర్పాట్లుచేశారు. ఇంతలో జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్‌కు బదిలీ అయ్యింది. ఇన్‌చార్జి కమిషనర్‌గా జిల్లా కలెక్టర్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. పూర్తిస్థాయి కమిషనర్‌ను త్వరగానే నియమించేస్తారనే భావనతో ఆయన బడ్జెట్ సమావేశం ఏర్పాటుపై వేచిచూడాలని అధికారులకు సూచించారు. అనంతరం ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో సమావేశం నిర్వహణకు అవకాశం లేకుండా పోయింది. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఈనెల ఆరున ముగియడంతో బడ్జెట్ సమావేశం నిర్వహణకు అధికారులు తిరిగి కసరత్తు ప్రారంభించారు. అయితే మేయర్ పదవీకాలం నాలుగేళ్లు పూర్తయినందున కౌన్సిల్‌లో తమకున్న మెజారిటీ ఆధారంగా అవిశ్వాస తీర్మానం పెట్టాలని కూటమి నేతలు నిర్ణయించారు. అవిశ్వాస తీర్మానం నెగ్గేందుకు అవసరమైన బలాన్ని సంపాదించుకోవడంలో కూటమి నేతలు నిమగ్నమయ్యారు. దీనివల్ల బడ్జెట్ సమావేశం నిర్వహణ అంశం మరుగునపడిపోయింది. మరో పది రోజుల్లో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసి, కొత్త ఆర్థిక సంవత్సరం ప్రారంభం కాబోతోంది. ఆలోగా బడ్జెట్ ఆమోదం పొందని పక్షంలో...తరువాత జీవీఎంసీ ఖాతా నుంచి ఒక్క రూపాయి ఖర్చు పెట్టడానికి కూడా అవకాశం ఉండదు. వచ్చే నెల జీవీఎంసీలో కాంట్రాక్టు, తాత్కాలిక ఉద్యోగులకు ... మిగతా 6వ పేజీలో

గజం రూ.75,560

ఎండాడలో 'రాజీవ్ స్వగృహ' భూమికి ధర నిర్ణయించిన ప్రభుత్వం

» గతంలో గజం రూ.60 వేలకు అమ్మేసిన వైసీపీ పెద్దలు

» ఎమ్మెల్యే వెలగపూడి ఫిర్యాదుతో కమిటీ నియామకం

» కొత్త ధరపైనే విక్రయించాలని నిర్ణయం



ఎండాడలోని రాజీవ్ స్వగృహ లేఅవుట్

విశాఖపట్నం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఎండాడలో రాజీవ్ స్వగృహకు చెందిన భూమికి ప్రభుత్వం కొత్త ధర నిర్ణయించింది. గతంలో వైసీపీ ప్రభుత్వం ఆ భూములు కొనడానికి ఎవరూ ముందుకు రావడం లేదని చెబుతూ గజం రూ.60 వేల ధర నిర్ణయించింది. ఆ ప్రకారం ఎన్నికల ప్రకటన వచ్చే ముందు అంటే 2024 ఫిబ్రవరిలో వేలం నిర్వహించి 32 ప్లాట్లను విక్రయించింది. వేలంపాటలో వైసీపీ వర్గీయులే పాల్గొని గజం రూ.60,500 చొప్పున తీసేసుకున్నారని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ఆరోపించారు. వాటిని వెనక్కి తీసుకోవాలని ఇటీవల అసెంబ్లీలో డిమాండ్ చేశారు. ఇకపై వాటిని విక్రయించాలంటే కొత్త ధర నిర్ణయించాలని కూడా కోరారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. ధర నిర్ణయానికి ఐదుగురితో కమిటీని వేసింది. పురపాలక శాఖ డైరెక్టర్, వీఎంఆర్‌డీఏ కమిషనర్, జీవీఎంసీ కమిషనర్, రిజిస్ట్రేషన్ల శాఖ డీఐజీ, రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ ఎండీలతో కమిటీ వేసింది. వారు క్షేత్రస్థాయి పరిశీలన చేసి గజం ధర రూ.75,560 పెట్టవచ్చునని సూచించారు. దీంతో ప్రభుత్వం ఆ ధరను అప్‌సెట్ ధరగా పెట్టి వేలం నిర్వహించి, అంతకు మించి ఎంత వస్తే అంతకు విక్రయించాలని సూచిస్తూ బుధవారం ఆదేశాలు జారీచేసింది.

గతంలో ఏమి జరిగిందంటే..?

రాజీవ్ స్వగృహ కింద మధ్య తరగతి ప్రజలకు ప్లాట్లు నిర్మించడానికి 2009లో ప్రభుత్వం ఎండాడలోని సర్వే నంబరు 16లో 57.73 ఎకరాలు కేటాయించింది. ఆ పథకం సక్రమంగా సాగకపోవడంతో ప్రాజెక్టు ఆగిపోయింది. అందులో 6.55 ఎకరాలు తిరుమల తిరుపతి దేవస్థానానికి ఇచ్చారు. టీటీడీ వేంకటేశ్వరస్వామి ఆలయం నిర్మించింది. మరో 2.7 ఎకరాలు మాజీ ఎంపీ ఎంవీవీఎస్ మూర్తి స్మృతి వనం నిర్మాణానికి ఇచ్చారు. ఆక్రమణలు కూడా కొన్ని ఉన్నట్టు సమాచారం. ఇవన్నీ పోగా ఇంకా 43.31 ఎకరాలు ఉందని లెక్కలు తేల్చారు. వైసీపీ ప్రభుత్వం ఎక్కడెక్కడ ఉన్న భూములన్నీ అమ్మి సొమ్ము చేసుకునే క్రమంలో వీటిని కూడా అమ్మకానికి పెట్టింది. మొత్తం భూమిని ఏడు ప్లాట్లు (ఒక్కొక్కటి కనీసం ఐదు ఎకరాలు)గా విభజించింది. అంత పెద్ద ప్లాట్లు కొనడానికి ఎవరూ ముందుకు రాలేదు. దాంతో వాటిని 76 ప్లాట్లుగా విభజించారు. ఒక్కో ప్లాటు విస్తీర్ణం మూడు వేల గజాల నుంచి పది వేల ... మిగతా 6వ పేజీలో

జీవీఎంసీలో పనులపై విజిలెన్స్ ఆరా

» 2019-23 మధ్యకాలంలో చేపట్టిన రూ.25 లక్షలకు పైబడిన వాటి వివరాలు ఇవ్వాలని లేఖ

విశాఖపట్నం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీలో 2019-23 మధ్య జరిగిన పనులపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దృష్టిసారించారు. రూ.25 లక్షల కంటే ఎక్కువ విలువైన పనుల వివరాలను అందజేయాలని కోరుతూ ఇంజనీరింగ్ అధికారులకు లేఖ రాశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన పనుల్లో నాణ్యత లేదని, తక్కువ పనిచేసి ఎక్కువ బిల్లులు డ్రా చేశారనే ఆరోపణలు ఉండడంతో విచారణ చేపట్టాలని నిర్ణయించినట్టు తెలిసింది. రూ.25 లక్షల కంటే ఎక్కువ విలువైన పనులు వెయ్యి వరకూ జరిగి ఉంటాయని అధికారులు అంచనా వేస్తున్నారు. జోన్‌ల వారీగా వివరాలను అందజేస్తే విజిలెన్స్ అధికారులు వాటిని పరిశీలించి తమకు అనుమానం ఉన్న పనులను పరిశీలించే అవకాశం ఉంది. ఒకవేళ ఎక్కడైనా అవి నీతి జరిగినట్టు లేదంటే పనుల్లో నాణ్యత లోపించినట్టు గుర్తిస్తే మొత్తం అన్ని పనులను తనిఖీ చేయడం ఖాయమని ఇంజనీరింగ్ అధికారులు అభిప్రాయపడుతున్నారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : 6.11 (గురువారం సాయంత్రం)

సహర్ : 4.43 (శుక్రవారం ఉదయం)

హత్యకు గురైంది ట్రాన్స్‌జెండర్

పోలీసుల అదుపులో ప్రధాన నిందితుడు

» నాలుగేళ్ల నుంచి సహజీవనం

» నాగులాపల్లిలో నివాసం

» సోమవారం అర్ధరాత్రి అక్కడే హత్య

» శరీరాన్ని ముక్కలుగా కోసి మూడుచోట్ల పడవేత

» గంటల వ్యవధిలోనే నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

కశింకోట, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బయ్యవరం సమీపంలో ఒక కల్వర్టు వద్ద మంగళవారం ఒక మహిళకు చెందిన కొన్ని శరీర భాగాలు లభ్యమైన సంఘటనకు సంబంధించి మిస్టరీని పోలీసులు ఛేదించారు. హత్యకు గురైంది మహిళ కాదని, ట్రాన్స్‌జెండర్ అని బుధవారం నిర్ధారించారు. మిగిలిన శరీర భాగాలను మరో రెండుచోట్ల గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ప్రధాన నిందితుడిని గంటల వ్యవధిలోనే అదుపులోకి తీసుకున్నారు. అతను ట్రాన్స్‌జెండర్‌తో నాలుగేళ్ల నుంచి సహజీవనం చేస్తున్నట్టు పోలీస్ వర్గాల ద్వారా తెలిసింది. ఇందుకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి.



పోలీసుల అదుపులో వున్న నిందితుడు బన్నీ (ఫైల్‌ఫొటో)



హత్యకు గురైన ట్రాన్స్‌జెండర్ దీపు (ఫైల్‌ఫొటో)

కశింకోట మండలం బయ్యవరం సమీపంలోని అండర్ బ్రిడ్జి వద్ద మంగళవారం ఉదయం రక్తపు మరకలతో ఒక మూట ఉన్నట్టు సమాచారం అందడంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. క్లూస్ టీమ్‌ను రప్పించి మూటను విప్పగా...మహిళ నడుము నుంచి కింద భాగం, కుడి చెయ్యి మాత్రమే ఉన్నాయి. దీంతో హత్యకు గురైన వ్యక్తి ఎవరో గుర్తు పట్టలేకపోయారు. జిల్లా ఇన్‌చార్జి ఎస్పీ వకుల్ జిందాల్ కూడా సంఘటనా స్థలానికి వచ్చి పరిశీలించారు. ఈ కేసు దర్యాప్తు కోసం ఎనిమిది ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేశారు. మహిళను హత్య చేసి కొన్ని శరీర భాగాలను ... మిగతా 6వ పేజీలో

ఆధార్ ప్రత్యేక క్యాంపులు

డాబాగార్డెన్స్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆధార్ ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ తెలిపారు. బుధవారం నుంచి 22 వరకూ, తిరిగి 25 నుంచి 28వ తేదీ వరకూ ప్రత్యేక క్యాంపులను నిర్వహించనున్నామన్నారు. 121 గ్రామ/ వార్డు సచివాలయాల్లోని ఆధార్ సేవా కేంద్రాలు, 20 కామన్ సర్వీస్ పాయిం ట్లు, 13 పోస్టాఫీస్‌లలో ఈ సేవలు అందించనున్నట్టు పేర్కొన్నారు. విశాఖలో బర్త్ సర్టిఫికెట్ ఉండి ఇంకా బాలాధార్ కార్డుకు దరఖాస్తు చేయని పిల్లల సంఖ్య 4,069పైగా ఉందన్నారు. అదే విధంగా జిల్లాలో లక్షకుపైగా పిల్లల వివరాలు అప్‌డేట్ చేయాల్సి ఉందన్నారు. కొత్తగా ఎన్‌రోల్‌మెంట్, బయోమెట్రిక్, డెమోగ్రాఫిక్ అప్‌డేట్, ఈ ఆధార్, ఆధార్ డాక్యుమెంట్ అప్‌డేషన్ చేయడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని పాఠశాలలు, కాలేజీలు, అంగన్వాడీ కేంద్రాల వారు దగ్గరలో ఉన్న సెంటర్‌లను వినియోగించుకోవాలని సూచించారు.

చలివేంద్రాలు ఏర్పాటు చేయండి

కొమ్మాది, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మార్చి నెల ప్రారంభం నుంచే సూర్యుడు భగభగ మండుతుండడంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. బాటసారుల దాహార్తిని తీర్చటానికి జీవీఎంసీ చలివేంద్రాలు, చలువపందిళ్లు ఏర్పాటు చేయలేదు. కొందరు ప్రైవేటు వ్యక్తులు ఉచితంగా మజ్జిగ చలివేంద్రాలు ప్రారంభించినా రద్దీకి సరిపడా లేవు. వేసవి తీవ్రత దృష్ట్యా రహదారి పక్కన ప్రయాణికులు సేదదీరేందుకు గ్రీన్‌మేట్ టెంట్లు ఏర్పాటు చేయాల్సిన అవసరముంది.

చేనేత కార్పొరేషన్ డైరెక్టర్‌గా దాసరి

కొమ్మాది, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) రాష్ట్ర చేనేత, పద్మశాలి సంక్షేమాభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఆరోవార్డు టీడీపీ అధ్యక్షుడు దాసరి శ్రీనివాస్ బుధవారం విజయవాడలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం బోర్డు సమావేశంలో పాల్గొన్నారు. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావులకు కృతజ్ఞతలు తెలిపారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ

కొమ్మాది, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మారికవలసలో రూ.13 లక్షలతో నిర్మించనున్న రోడ్లు, కాలువలకు ఐదో వార్డు కార్పొరేటర్ మొల్లి హేమలత బుధవారం భూమిపూజ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేరుస్తామన్నారు.

సంగివలస-వలందపేట రహదారి కబ్జా

» భీమిలి రూరల్ రహదారికి అడ్డంకులు

భీమునిపట్నం రూరల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రికార్డులలో రహదారులుగా ఉన్న ప్రాంతాలను కొందరు ఆక్రమించేశారు. అంతేకాకుండా సంగివలస నుంచి వలందపేటకు వెళ్లే మట్టి రహదారి మధ్యలో మట్టి కుప్పలను వేయడం వల్ల ఆ మార్గంలో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. దీంతో మండలంలోని గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే ప్రధాన రహదారి మూసుకుని పోయింది. వలందపేటకి చెందిన మురుగునీటి కాల్వలో మురుగును జీవీఎంసీ అధికారులు ఈ రహదారి నుంచి వెళ్లి తొలగించేవారు. రహదారికి అడ్డంకులు వల్ల ఆ కార్యక్రమం కూడా ఆగిపోయింది. ఈ ప్రాంతంలో నివసిస్తున్న వారి తరఫున సీహెచ్ గంగాధరరావు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. ఈ ప్రాంతంలో 23.9 సర్వేనంబరులో 17 సెంట్లు, 25.6లో 73 సెంట్ల స్థలం సంగివలస నుంచి వలందపేటకు వెళ్లే గ్రామాలకు రహదారిగా ఉంది. అధికారులు తయారుచేసిన మ్యాప్‌లోనూ,



రహదారి మధ్యలో మట్టి కుప్పలు వేసిన దృశ్యం

ఎఫ్ఎంబీ రికార్డులలో కూడా ఈ ప్రాంతమంతా రహదారిగా పేర్కొన్నారు. గత కొన్నేళ్లు దీన్ని రహదారిగా వినియోగిస్తున్నారు. ఈ రోడ్డుకు అవతల ఉన్న స్థలాల్లో అనేకమంది గృహనిర్మాణాలు చేసుకున్నారు. వారు ఈ రహదారినే వినియోగిస్తుంటారు. రహదారి ద్వారానే శ్మశానం, చాకలిగెడ్డ, అల్లూరి సీతారామరాజు కాలనీకి ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. రహదారిని అనుకుని స్థలాలు కొనుగోలుచేసిన కొందరు రియల్ వ్యాపారులు ఈ రహదారి స్థలం తమ



సిమెంటు స్తంభాలతో ఏర్పాటు చేసిన కంచె

దని పేర్కొంటూ మట్టికుప్పలు వేసి చదును చేయడానికి ప్రయత్నిస్తున్నారు. దుర్గాలమ్మగుడి పక్క నుంచి దేవదాయశాఖ స్థలంలో నుంచి అనుసంధాన రహదారి ఉండేది. ఈ అడ్డంకుల వల్ల అక్కడా రాకపోకలు నిలిచిపోయాయి. ఈ విషయాన్ని రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకు వెళ్లగా, గతంలో ఈ రహదారికి సంబంధించి సర్వే నంబర్లున్న స్థలం పట్టాదారు పాసు పుస్తకాలుగా ఇవ్వడం వల్ల ఈ పరిస్థితి వచ్చిందని సవరించాల్సిన అవసరం ఉందన్నారు.

రూ.1.39 కోట్లకు వేములవలస మార్కెట్ ఆశీలు వేలం

ఆనందపురం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేములవలస పంచాయతీ పరిధిలో ఉన్న మహాత్మా గాంధీ రోజువారీ పువ్వులు, కూరగాయలు మార్కెట్‌కు ఆశీలు వసూలుకు బుధవారం వేలం నిర్వహించారు. జిల్లా పంచాయతీ అధికారి ఎంవీపీ శ్రీనివాస్, మండల పంచాయతీ అధికారి బి.సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన వేలం లో వేములవలసకి చెందిన పతివాడ పుష్పలత రూ.1.39 కోట్లకు సీక్రెట్ టెండర్ ద్వారా దక్కించుకున్నారు. వేలంలో వేములవలస గ్రామానికి చెందిన పతివాడ అప్పలరాజు, పతివాడ పుష్పలత, సింహాచలానికి చెందిన లండ అప్పలనాయుడు పాల్గొన్నారు. ముందుగా సీల్డు కవరు టెండరు వేసిన అనంతరం బహిరంగ వేలం నిర్వహించారు. పతివాడ అప్పలరాజు అత్యధికంగా కోటి ముప్పై ఏడు లక్షల అయిదు వేల రూపాయలకు పాట పాడారు. అనంతరం సీల్డు కవరు టెండర్లు ఓపెన్ చేసి చూడగా పతివాడ పుష్పలత రూ.1.39 కోట్లకు కోట్ చేయడంతో పాటను పుష్పలతకు అధికారులు ఖరారు చేశారు. అయితే గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది తక్కువకు ఖరారు కావడం గమనార్హం. 2022-23లో రూ.1.54 కోట్లకు, , 2023-24లో తొమ్మిది నెలలకు గాను రూ.1.27 కోట్లు వచ్చింది.

సుజల స్రవంతి బ్రాంచి కెనాల్ నిర్మాణానికి భూసేకరణ

పద్మనాభం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు నుంచి ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పథకం ద్వారా సాగునీరు అందించడానికి మండలంలోని నాలుగు గ్రామాల్లో భూసేకరణ కార్యక్రమం చేపట్టారు. అనకాపల్లి నుంచి శ్రీకాకుళం వరకు వెళ్లే మెయిన్ కెనాల్‌కు అనుబంధంగా బ్రాంచి కెనాల్‌ను కొవ్వాడ, గంధవరం, పెంట, అనంతవరం గ్రామాల్లో నిర్మిస్తారు. ఈ నిర్మాణం జరిగితే ఆయా గ్రామాలలోని వ్యవసాయ భూములకు సాగునీరు అందుతుంది. ఈమేరకు కెనాల్‌కు అవసరమైన 58 ఎకరాల భూసేకరణకు ఇప్పటికే ప్రాథమిక సర్వే పూర్తయినట్లు ప్రాజెక్టు డీఈఈ సుహాసిని చెప్పారు.

నేడు రుషికొండ వెంకన్న ఆలయ వార్షికోత్సవం

సాగర్‌నగర్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): శ్రీమహాలక్ష్మి గోదాదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ తృతీయ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పా ట్లు చేస్తున్నట్లు ఆలయ ఏఈఓ జగన్మోహనాచార్యులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 5 గంటల నుంచి సేవలు ప్రారంభమవుతాయన్నారు. సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు మాడవీధుల్లో తిరుచ్చి ఉత్సవం నిర్వహిస్తామని తెలిపారు.



రుషికొండ వేంకటేశ్వరస్వామి ఆలయం

అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు

సింహాచలం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): వరాహలక్ష్మీనృసింహస్వామికి బుధవారం పలు ఆర్జిత సేవలు వైభవంగా నిర్వహించారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని భూదేవి, నీలాదేవి సమేతంగా సకలాభరణాలతో అలంకరించి ప్రత్యేక వేదికపై నారసింహ సహస్ర నామావళి పఠిస్తూ పవిత్ర తులసీ దళాలతో అర్చన చేశారు.



తులసి దళాలతో అర్చన చేస్తున్న దృశ్యం

నూకాలమ్మ ఉత్సవాలకు భీమిలి ముస్తాబు



తీరంలో ఏర్పాటు చేస్తున్న జెయింట్ వీల్, వినోద సామగ్రి

భీమునిపట్నం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): గ్రామదేవత నూకాలమ్మ ఉత్సవాలకు పట్టణంలో భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలో విద్యుద్దీపాలతో అలంకరించారు. ఈ నెల 27 నుంచి 30వ తేదీ వరకూ ఈ ఉత్సవాలు జరుగనున్నాయి. ఈ నేపథ్యంలో అమ్మవారి ఆలయం, గంటస్తంభం, పాత బస్టాండ్, చిన్న బజార్, తోటవీధి, నేరేళ్లవలస తదితర జంక్షన్లలో భారీగా విద్యుత్ దీపాలతో అలంకరించారు. సాగరతీరంలో బీచ్ ఇసుకలో జెయంట్ వీల్, క్రాస్ వీల్, డిస్కో వీల్ తదితర వినోద సామగ్రిని కూడా ఫిట్ చేస్తున్నారు. పట్టణంలోని రోడ్లన్నీ సీరియల్ లైటింగ్స్‌తో అందంగా తీర్చిదిద్దుతున్నారు. ఉత్సవ కమిటీ అధ్యక్షులు అల్లిపిల్లి వేణుబాబు, కమిటీ కార్యవర్గం హరి, ఎర్రయ్యరెడ్డి, వినోద్‌కుమార్, సన్యాసిరావులు ఘనంగా ఉత్సవాలు చేయడానికి కృషి చేస్తున్నారు.

జోన్-2లో భారీగా పన్ను బకాయిల వసూలు



సాగర్‌నగర్‌లోని నిర్మాణంలోని భవనం వద్ద అధికారులు

కొమ్మాది, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఆస్తిపన్ను బకాయిదారులపై జీవీఎంసీ జోన్-2 అధికారులు కొరడా ఝుళిపించారు. బుధవారం జెడ్సీ కనకమహాలక్ష్మి పర్యవేక్షణలో మొండి బకాయిదారుల నుంచి పన్నులు రాబట్టారు. సాగర్‌నగర్‌లో కె.వి.ఆర్.డెవలపర్స్ నుంచి రూ.4.37 లక్షలు, నిర్మాణంలో ఉన్న బూరుగుపల్లి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వి.ఎల్.టి నిమిత్తం రూ.13.11 లక్షలు వసూలు చేసినట్లు జోన్-2 కమిషనర్ కె.కనకమహాలక్ష్మి తెలిపారు. ఎండాడలో బకాయి చెల్లించని వ్యక్తి ఇంటి కుళాయి కనక్షన్‌ను కట్‌చేశారు. ఎల్అండ్‌టీ రియాల్టీ ప్రైవేటు లిమిటెడ్ ఖాళీ జాగాపై పన్నుకు జప్తు నోటీసు జారీ చేశారు. ఎండాడలో మరో ఇద్దరి వద్ద నుంచి రూ.90,262, రూ.57,806 వసూలు చేసినట్లు తెలిపారు. అడ్మిన్‌లు ఈశ్వరరావు, నారాయణమూర్తి, శ్రీధర్, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు నిత్యావసర సరకుల పంపిణీ

తగరపువలస, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఎటువంటి ఆధారం లేని నిరుపేద కుటుంబీకులు నలుగురికి నెలకు సరిపడా నిత్యావసర సరకులను బుధవారం దాతలు అందించారు. తగరపువలసకు చెందిన మణికంఠ మిఠాయి దుకాణం యజమానులు ఎ.నాగరాజు తన పిల్లల పుట్టినరోజు సందర్భంగా ఈ వితరణ చేశారు. అనారోగ్యంతో బాధపడుతున్నవారు, ఆధారం లేని ఒంటరి మహిళలను గుర్తించి బియ్యం, పప్పులు, నూనెలను శ్రీనివాసరెడ్డి ద్వారా అందించారు.

భారీ దోపిడీకి స్కెచ్ వేసిన బ్యాంకు ఉద్యోగి

» చాకచక్యంగా పట్టుకున్న కాకినాడ పోలీసులు

» రెండు పిస్టల్స్, 17 బుల్లెట్లు స్వాధీనం

కాకినాడ, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): అతడో బ్యాంకు ఉద్యోగి. ఆన్‌లైన్ బెట్టింగ్, చెడు వ్యసనాల కారణంగా పని చేసే బ్యాంకులో బంగారు ఆభరణాలు చోరీ చేశాడు. అప్పులు తీర్చేందుకు సులువుగా డబ్బులు సంపాదించేలా చోరీల బాటను ఎంచుకున్నాడు. బ్యాంకు, ఏటీఎం దోపిడీ చేస్తే సెటిల్ అయిపోవచ్చనే భావంతో బిహార్‌లో రెండు పిస్టల్స్ కొనుగోలు చేశాడు. మంగళవారం రాత్రి కాజులూరులో రెక్కీ చేస్తుండగా కాకినాడ జిల్లా పోలీసులు పట్టుకున్నారు. అతడి నుంచి రెండు పిస్టల్స్, 17 బుల్లెట్లు స్వాధీనం చేసుకున్నారు. వివరాలను బుధవారం వెల్లడించారు. విశాఖ నగరంలోని మద్దిలపాలెం ఫిష్‌మార్కెట్ సమీపంలో ఉండే చిటికెల నాగేశ్వరరావు పశ్చిమ గోదావరి జిల్లా నిడమర్రు చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకులో ప్రొబేషనరీ ఆఫీసర్‌గా పనిచేసేవాడు. బ్యాంకు నుంచి 900 గ్రాముల బంగారాన్ని సొంత అవసరాలకు వాడుకోవడంతో సస్పెండ్ చేశారు. దీంతో సుమారు రూ.40లక్షలు బ్యాంకుకి కట్టేశాడు. అప్పులు తీర్చలేక చోరీల బాట పట్టాడు. బీహార్ ముంగర్ ప్రాంతానికి వెళ్లి పిస్టల్స్ 17 బుల్లెట్లు కొనుగోలు చేశాడు. బ్యాంకు, ఏటీఎంల దోపిడీకి విశాఖ సిటీ, రూరల్, నర్సీపట్నం, ఆంధ్ర, తమిళనాడు బోర్డర్‌లలో రెక్కీ నిర్వహించాడు. కాజులూరులో పట్టుకున్నట్టు ఎస్పీ బిందు మాధవ్ తెలిపారు. నిందితుడిపై నర్సీపట్నంలో మూడు, అన్నవరం, నక్కపల్లి, తాడేపల్లిగూడెం, ఏలేశ్వరంలో కేసులున్నాయన్నారు. సమావేశంలో ఏఎస్పీ మనీష్ దేవరాజ్‌పాటిల్, ఎస్ఐలు రవీంద్రబాబు, మోహన్‌కుమార్ పాల్గొన్నారు.

రేపటి నుంచి అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ

పద్మనాభం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కార్యకర్తలకు పోషణ, విద్యపై స్థానిక వెలుగు కార్యాలయంలో శిక్షణ ఇస్తామని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జానకి తెలిపారు. ఈనెల 20 నుంచి 22 వరకు జరిగే శిక్షణలో 48 మంది పాల్గొంటారన్నారు. అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి పూర్వ ప్రాథమిక విద్య అభ్యసించే వరకు అందించే పోషకాహారం ప్రాముఖ్యతతో పాటు, పాఠ్యప్రణాళిక తయారీపై అవగాహన, కిశోర బాలికల ఆరోగ్య సంరక్షణ తదితర అంశాలపై అవగాహన కల్పిస్తామన్నారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని ఆకళింపుచేసుకోవాలి

సాగర్‌నగర్, మార్చి19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సాంకేతిక విజ్ఞానాన్ని ఆకళింపు చేసుకోవాలని ఫైటెక్ టెక్నికల్ మేనేజర్ పి.గోపాలకృష్ణ సూచించారు. రుషికొండ గాయత్రి విద్యాపరిషత్‌లో జరిగిన టెక్‌ట్రానిక్స్ సీజన్ 2 కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ వీఎల్ఎస్ఐ అండ్ ఎంబెడెడ్ సిస్టమ్స్‌లో సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యం సాధిస్తే ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోవచ్చునన్నారు. డి.దక్షిణామూర్తి, పి.రాజగణపతి, కె.ఎస్.బోస్ పీవీ వినయ్, గిరిధర్, డి.శరిత, పీఏ నాగేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

భీమిలి మండలంలో తీవ్ర నీటి ఎద్దడి

» మరమ్మతులకు గురైన బోర్లు

» బావుల వద్ద జనం పడిగాపులు

భీమునిపట్నం (రూరల్) మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో వేసవి రాకముందు నుంచి తాగునీటి సమస్య ఏర్పడింది. చాలా గ్రామాల్లో గొట్టపుబావులు ఎండిపోవడంతో గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన గ్రామాల్లో రక్షిత మంచినీటి పథకాలు ఏర్పాటు చేసి కొళాయిల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. కానీ గ్రామ పంచాయతీలకు శివారులో ఉన్న చిన్న గ్రామాల ప్రజలు మాత్రం ఇంకా గొట్టపుబావులపైనే ఆధారపడుతున్నారు. మూలకుద్దు పంచాయతీ కేంద్రంలోనే తీవ్ర నీటి ఎద్దడి ఏర్పడింది. దాకమర్రి శివారులో ఉన్న ముద్దాడపేట, అల్లుపేట గ్రామాలలో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. అలాగే లక్ష్మీపురం, సింగనబంద పంచాయతీలకు శివారులో ఉన్న దొకరపేట, గొల్లలపాలెం మెట్టపాలెం ప్రాంతాలలో ప్రజలూ తాగునీటి కోసం ఇబ్బంది పడుతున్నారు. రేఖవానిపాలెం, తాళ్లవలస, మజ్జివలస, తాటితూరు, నగరపాలెం అమనాం తదితర గ్రామ పంచాయతీలకు శివారులో ఉన్న గ్రామాల్లో నీటి సమస్య ఏర్పడింది. అక్కడ గొట్టపుబావులు ఉన్నా అలంకారప్రాయంగా మారాయి. గతంలో పాడైన బావులను మరమ్మతులు చేయడానికి మండల పరిషత్ కార్యాలయం ఆధీనంలో నీటి సరఫరా విభాగంలో సిబ్బంది ఉండేవారు. గొట్టపు బావులకు ఎక్కడ ఏ సమస్య వచ్చినా వారు వెంటనే వెళ్లి మరమ్మతులు చేసే వారు. ఇప్పుడు గొట్టపుబావుల నిర్మాణం బాగా తగ్గిపోవడం వల్ల ఉన్న బావుల విషయం కూడా పట్టించుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. గత వారం జరిగిన మండల పరిషత్ సమావేశంలో పలువురు సర్పంచులు నీటి ఎద్దడి విషయాన్ని ప్రస్తావించారు. అదనపు గొట్టపుబావుల్ని తవ్వించాలని కోరారు.



మెట్టపాలెంలో బావి వద్ద గ్రామస్థుల పడిగాపులు, దొకరపేటలో బోరుకు మరమ్మతులు

ఆరోగ్య కేంద్రాల్లో అంతంతమాత్రం సేవలు

... 5వ పేజీ తరువాయి

నెలకొంది. రెల్లివీధిలోని జాలారిపేట ప్రాంతంలో ఉన్న అర్బన్ హెల్త్ సెంటర్‌లోనూ ఇదే పరిస్థితి. అర్బన్ హెల్త్ సెంటర్‌లలో కొన్నిచోట్ల మినహా ఒక వైద్యుడు, ఇద్దరు స్టాఫ్ నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మసిస్టు, ఒక హెల్పర్ ఉంటారు. ఒక్క డాక్టరే ఉన్నచోట.. సెలవు పెడితే ఇబ్బంది ఎదురవుతోంది. బుధవారం రేసపువానిపాలెం, మద్దిలపాలెం అర్బన్ హెల్త్ సెంటర్స్‌లోని వైద్యులు సెలవులో ఉన్నారు. రేసపువానిపాలెంలో స్టాఫ్ నర్సే రోగులను పరీక్షిస్తున్నారు. మద్దిలపాలెంలోనూ అదే పరిస్థితి. ఈ సెంటర్‌లో ల్యాబ్ టెక్నీషియన్ కూడా సెలవులో ఉండడంతో రోగులకు అందించే సేవలపై తీవ్ర ప్రభావం పడింది.

మరికొన్ని ఇబ్బందులు..

కొన్ని అర్బన్ హెల్త్ సెంటర్స్‌లో మంచి నీటి సదుపాయం కల్పించేందుకు వాటర్ ట్యాంకులు ఏర్పాటుచేశారు. కొన్నిచోట్ల పనిచేయడం లేదు. దీంతో రోగులకు ఇబ్బందులు తప్పడం లేదు. చినవాల్తేరులో వాటర్ ప్యూరిఫైర్ యంత్రాలు మూలకు చేరాయి. వేసవిలో ప్రత్యేకంగా ఓఆర్ఎస్ కార్నర్స్ ఏర్పాటు చేయాలి. అనేకచోట్ల ఓఆర్ఎస్ కార్నర్ వద్ద బాటిల్ నీరు, ప్యాకెట్లు పెట్టి వదిలేశారు.

అవగాహన ఏదీ.?

ఇదిలావుంటే అవగాహన లేక ప్రజలు కూడా స్థానికంగా ఉన్న అర్బన్ హెల్త్ సెంటర్స్‌కు వెళ్లడం లేదు. ఒక్కో సెంటర్ పరిధిలో దాదాపు 20 వేల మందికిపైగా ఉంటారు. బుధవారం మధ్యాహ్నం 12 గంటల వరకూ చాలాచోట్ల 20 మంది కూడా సేవలను వినియోగించుకోలేదు. ఒకవైపు అర్బన్ హెల్త్ సెంటర్స్ వెలవెలబోతుంటే.. కేజీహెచ్, విమ్స్ రోగులతో కిటకిటలాడుతున్నాయి. పెద్దాస్పత్రులకు తాకిడి తగ్గాలంటే స్థానికంగా ఆరోగ్య కేంద్రాల్లో అందించే వైద్య సేవలపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించడంతోపాటు సిబ్బంది నిత్యం అందుబాటులో ఉండేలా ఉన్నతాధికారులు చూడాలి.

మహా నిర్లక్ష్యం

... 5వ పేజీ తరువాయి

వేతనాలు, జీవీఎంసీ కార్యాలయాలకు విద్యుత్ బిల్లులు, అధికారుల వాహనాలు, ప్రజారోగ్య వాహనాలకు డీజిల్ కొనుగోలు వంటివి నిలిచిపోతాయి. వీటన్నింటి కోసం ప్రతినెలా సుమారు రూ.30 కోట్ల వరకు జీవీఎంసీ వెచ్చిస్తోంది. కొత్త ఆర్థిక సంవత్సరం ఆరంభం నాటికి బడ్జెట్ ఆమోదం పొందకపోతే జీవీఎంసీ కార్యకలాపాలు నిలిచిపోతాయని, అందువల్ల తక్షణం సమావేశం ఏర్పాటుచేయాలనే డిమాండ్ మొదలైంది. బడ్జెట్ సమావేశం ఏర్పాటుచేయాలని కోరుతూ మేయర్ గొలగాని హరివెంకటకుమారి ఇటీవల జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్, జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్‌కు లేఖ రాశారు. మరోవైపు సీపీఎం కార్పొరేటర్ బి.గంగారావు కూడా తక్షణం బడ్జెట్ సమావేశం ఏర్పాటుచేయాలని కోరుతూ మేయర్ గొలగాని హరివెంకటకుమారికి లేఖ అందజేశారు. అలాగే జనసేనకు చెందిన 22వ వార్డు కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ కూడా జీవీఎంసీ బడ్జెట్ సమావేశం ఏర్పాటులో అధికారులు తాత్సారం చేస్తున్నారంటూ రాష్ట్ర మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్‌కుమార్‌కు లేఖ రాశారు.

ఏప్రిల్ 30న అప్పన్న చందనోత్సవం

... 5వ పేజీ తరువాయి

ఆదేశించారు. దర్శనం కోసం రూ.1,500, రూ.1,000, రూ.300 టికెట్లు అమ్మకం ప్రణాళికాయుతంగా చేపట్టాలన్నారు. రూ.1,500 టికెట్ కొన్న భక్తులకు నీలాద్రిగుమ్మం వరకూ అనుమతిస్తామన్నారు. ఏప్రిల్ 30వ తేదీ తెల్లవారుజామున 3.30 గంటల నుంచి 4.30 గంటల వరకూ అనువంశిక ధర్మకర్త, సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తులకు అంతరాలయ దర్శనాలు ఉంటాయన్నారు. వీఐపీలకు అంతరాయల దర్శనాలపై ప్రభుత్వ అధికారులతో మాట్లాడిన తరువాత నిర్ణయం తీసుకుంటామన్నారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని కొండపైకి వచ్చే వాహనాలను గణనీయంగా తగ్గించాలని పోలీసులకు సూచించారు. పరిమిత సంఖ్యలో మాత్రమే వాహనాల పాస్‌లు ఇవ్వాలని, ప్రైవేటు వాహనాలను కొండపైకి అనుమతించవద్దన్నారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా కింద నుంచి కొండపైకి, దర్శనం తరువాత కొండ పైనుంచి కిందకు బస్సులు ఏర్పాటుచేయాలన్నారు. సీపీ శంఖబ్రాత్రబాగ్చి మాట్లాడుతూ కొండపై అదనపు పార్కింగ్ ప్రదేశం ఏర్పాటుచేయాలని, శాశ్వత అవుట్ పోస్టు నెలకొల్పాలని సూచించగా, ఆ మేరకు సంబంధిత అధికారులకు కలెక్టర్ ఆదేశాలు ఇచ్చారు. ఇంకా ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సీపీ చెప్పారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ అన్ని శాఖలతో దేవదాయ శాఖ అధికారులు సమన్వయం చేసుకోవాలన్నారు. సమావేశంలో డీఆర్వో భవానీశంకర్, భీమిలి ఆర్డీవో సంగీత్ మాథుర్, సింహాచలం ఇన్‌చార్జి ఈవో కె.సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

మెట్రో రైల్ సీఎంపీలకు కేంద్రం నిధులు మంజూరు

... 5వ పేజీ తరువాయి

సూచనలతో సీఎంపీ కోసం కన్సల్టెన్సీ సంస్థను టెండర్ల ద్వారా ఏపీ మెట్రో రైలు కార్పొరేషన్ ఎంపిక చేసిందని తెలిపారు. రెండు నగరాల్లో సీఎంపీ రూపకల్పన కోసం సిస్ట్ర ఎంవీఏ సంస్థను ఎంపిక చేశామన్నారు. విశాఖలో రూ.87.47 లక్షలు, విజయవాడలో రూ.81.68 లక్షలతో ప్లాన్ రూపొందించనున్నట్టు తెలిపారు. ఆయా పనుల కోసం ఏపీ మెట్రో రైల్ కార్పొరేషన్‌కు సెంట్రల్ అర్బన్ ట్రాన్స్‌పోర్ట్ విభాగం నిధులు మంజూరు చేసిందన్నారు.

హత్యకు గురైంది ట్రాన్స్‌జెండర్

... 5వ పేజీ తరువాయి

బయ్యవరం వద్ద పడేశారనే వార్త ఈ ప్రాంతంలో దావానలంలా వ్యాపించింది. ఈ నేపథ్యంలో మునగపాక మండలం నాగులాపల్లిలో ట్రాన్స్‌జెండర్ ఒకరు అద్దెకు వుంటున్న ఇంటి వెలుపల రక్తపు మరకలు చూసిన స్థానికులు ఈ విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. మంగళవారం అర్ధరాత్రి క్లూస్ టీమ్ అక్కడకు వెళ్లి ఇంటిలో పరిశీలించారు. ఇంటిలో ఎవరెవరు వుంటున్నారో పోలీసులు ఆరా తీశారు. బన్నీ అనే 30 ఏళ్ల యువకుడు, ట్రాన్స్‌జెండర్ కలిసి వుంటున్నట్టు గుర్తించారు. అర్ధరాత్రి దాటిన తరువాత అతడిని అదుపులోకి తీసుకున్నారు. ట్రాన్స్‌జెండర్ పేరు షైపాలి దిలీప్ శివశంకర్ అలియాస్ దీపు (40) అని అతను చెప్పినట్టు సమాచారం. కశింకోట సీఐ స్వామినాయుడు, పోలీసు సిబ్బంది బుధవారం అనకాపల్లి పట్టణ శివారులోని జగలమదుం కూడలి సమీపంలో ఒక బాక్సును స్వాధీనం చేసుకున్నారు. దానిని తెరిచిచూడగా తల, ఎడమ చేయి కనిపించాయి. వీటిని ప్యాక్ చేసి ఎన్టీఆర్ వైద్యాలయం మార్చురీకి పంపారు. అనంతరం నిందితుడిని వెంటబెట్టుకుని కశింకోట మండలం తాళ్లపాలెం మామిడివాక గెడ్డ వద్దకు వెళ్లారు. అక్కడ మిగిలిన శరీర భాగాలు (మొండెం) వున్న సంచిను అతను చూపించాడు. పంచనామా అనంతరం ఎన్టీఆర్ వైద్యాలయం మార్చురీకి తరలించారు. దీంతో బుధవారం మిగిలిన శరీర భాగాలు లభ్యమైన తరువాత హత్యకు గురైంది ట్రాన్స్‌జెండర్‌గా నిర్ధారించారు.

నాగులాపల్లి అద్దె ఇంటిలోనే హత్య?

ట్రాన్స్ జెండర్ దిలీప్ అలియాస్ దీపును సోమవారం అర్ధరాత్రి నాగులాపల్లిలోని అద్దె ఇంటిలోనే హత్య చేసి, శరీరాన్ని ముక్కలుగా నరికి, బెడ్‌షీట్‌లో, బాక్సులో, సంచిలో వేసుకుని మూడుచోట్ల పడేసినట్టు పోలీసుల విచారణలో బన్నీ చెప్పినట్టు తెలిసింది.

దీపుగా మారిన దిలీప్

హత్యకు గురైన ట్రాన్స్‌జెండర్ అసలు పేరు షైపాలి దిలీప్ శివశంకర్ (40). అనకాపల్లి గవరపాలెంలో ఉన్న ముత్రాసుకాలనీకి చెందిన దిలీప్.. ట్రాన్స్‌జెండర్‌గా మారి 'దీపు'గా పేరుమార్చుకుని, తల్లిదండ్రులకు దూరంగా వున్నాడు.

నాలుగేళ్ల నుంచి సహజీవనం

పశ్చిమ గోదావరి జిల్లా ఇరగవరం మండలం పొదలాడకు చెందిన బన్నీ కొన్నేళ్ల క్రితం ఉపాధి నిమిత్తం అనకాపల్లి వచ్చాడు. ఫుడ్ డెలివరీ కంపెనీలో బాయ్‌గా పనిచేస్తుండగా ట్రాన్స్‌జెండర్ దీపుతో పరిచయం ఏర్పడింది. నాలుగేళ్ల నుంచి వీరు సహజీవనం చేస్తున్నట్టు తెలిసింది. ఏడాది క్రితం మునగపాక మండలం నాగులాపల్లిలో ఇల్లు అద్దెకు తీసుకుని వుంటున్నారు. వీరిరువురూ తరచూ గొడవ పడుతూ ఉండేవారని స్థానికులు చెబుతున్నారు. కాగా కేసు పూర్తి వివరాలను గురువారం మీడియాకు వెల్లడిస్తామని పోలీసులు చెప్పారు.

గజం రూ.75,560

... 5వ పేజీ తరువాయి

గజాల వరకు పెట్టారు. ధర బాగా తగ్గించారు. ఆ ప్రాంతంలో ప్రభుత్వం రిజిస్ట్రేషన్ ధర గజం రూ.50 వేలు ఉండగా, రాజీవ్ స్వగృహ అధికారులు గజం రూ.60 వేలకే అప్‌సెట్ ధర నిర్ణయించారు. వాస్తవానికి బయట గజం లక్ష రూపాయల వరకు ఉంది. ఇదే అదనుగా భావించిన వైసీపీ పెద్దలు వారి అనుచరులను రంగంలో దింపి గజానికి రూ.500 ఎక్కువ వేసి అంటే రూ.60,500 చొప్పున 32 ప్లాట్లను సొంతం చేసుకున్నారు. ఇదంతా 2024 ఎన్నికల ప్రకటనకు ముందు జరిగింది. ఆ తరువాత ప్రభుత్వం మారడంతో తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి ఈ కుంభకోణంపై ప్రశ్నించారు. ఆ వేలంలో అమ్మిన భూములను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అయితే ప్రభుత్వం వాటిపై ఎటువంటి నిర్ణయం ప్రకటించలేదు. ప్రస్తుతం ఇంకో 39 ప్లాట్లు అందుబాటులో ఉండగా, వాటిని అప్‌సెట్ ధర రూ.75,560తో అమ్మాలని సూచించింది.

అనుబంధ పరిశ్రమలు పెరిగితేనే ఉపాధి

ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ శివశంకరరావు



మాట్లాడుతున్న శివశంకరరావు

విశాఖపట్నం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ప్రధాన పరిశ్రమలకు అనుబంధంగా మరిన్ని సంస్థలు ఏర్పాటైనపుడే ఎగుమతులతో పాటు ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయని ఏపీ ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ టి.శివశంకరరావు అన్నారు. ఎంఎస్ఎంఈల ద్వారా ఎగుమతులు పెంచడానికి సీఐఐ, నీతి ఆయోగ్‌తో కలిసి రాష్ట్ర ప్రభుత్వం నోవాటెల్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. గోవాలో నౌకా నిర్మాణానికి అనుబంధంగా 22 షిప్ బిల్డింగ్ సెంటర్లున్నాయని, విశాఖపట్నంలో కూడా నౌకా నిర్మాణం జరుగుతున్నా ఆ విధమైన అనుబంధ సంస్థలు లేవన్నారు. అలాగే శ్రీకాకుళం జిల్లా టెక్కలి నుంచి బ్లూ గ్రానైట్, చీమకుర్తి నుంచి గెలాక్సీ గ్రానైట్ 80 శాతం చైనాకు ఎగుమతి అవుతోందన్నారు. అక్కడ వాటికి పాలిషింగ్ చేసి ఇతర దేశాలకు ఎగుమతి చేస్తున్నారన్నారు. ఆయా రంగాల్లో సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యం లేకపోవడం వల్ల ఇలాంటి సమస్యలు వస్తున్నాయన్నారు. ప్రభుత్వం ఎంఎస్ఎంఈలకు అద్భుతమైన పాలసీ తెచ్చిందని, దానిని క్షేత్రస్థాయికి తీసుకెళ్లి అన్ని వర్గాలకు అందేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో లక్ష వరకు ఎంఎస్ఎంఈ యూనిట్లు ఉన్నాయని, వాటిని 2030 నాటికి మూడు లక్షలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఈ సమావేశాన్ని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ జ్యోతి వెలిగించి ప్రారంభించగా కలెక్టర్ హరేంధిర ప్రసాద్, సీఐఐ ప్రతినిధులు పొన్ను స్వామి, డాక్టర్ మురళీకృష్ణ, నీతి ఆయోగ్ సలహాదారు సింగ్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల సంఘం ఎన్నికల్లో 40 మంది పోటీ

విశాఖపట్నం లీగల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా న్యాయవాదుల సంఘం ఎన్నికలకు నామినేషన్ల ప్రక్రియ ముగిసింది. బుధవారం పరిశీలన అనంతరం అభ్యర్థుల జాబితా ప్రకటించారు. అధ్యక్ష పదవికి ఎం కే.శ్రీనివాస్, నమ్మి సన్యాసిరావు, ఐఎం అహ్మద్, కార్యదర్శి పదవికి ఎల్పీ నాయుడు, రాపేడు సూర్యనారాయణ, ఏవీ సోమేశ్వరరావు పోటీ చేస్తున్నారని ఎన్నికల అధికారి బీఎం.రెడ్డి, ఉప ఎన్నికల అధికారి సీబీఎస్. లింగరాజు తెలిపారు.అన్ని పదవులకు 40 మంది బరిలో ఉన్నారు. ఈ నెల 28న ఎనికలు జరుగుతాయని, అనంతరం ఓట్లలెక్కింపు చేపట్టి,ఫలితాలువెల్లడిస్తామన్నారు.

సినిమా గైడ్

- **కోర్ట్ :** సంగం, శ్రీ వెంకటేశ్వర-1, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లీలిత (శ్రీహరిపురం), నటరాజ్-1 (పెందుర్తి),
- **దిల్‌రుబా :** జగదాంబ, శ్రీకన్య, శ్రీరామా, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం),
- **శబ్దం :** సంగం, శారద, కిన్నెర,
- **మజాకా :** రమాదేవి, శ్రీరామా, కామేశ్వరి, మౌర్య (గోపాలపట్నం),
- **డ్రాగన్ :** జగదాంబ, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం),
- **తండేల్ :** శ్రీవెంకటేశ్వర, శ్రీలీలామహల్, అరుణ (పెదగంట్యాడ)
- **సంక్రాంతికి వస్తున్నాం :** మెలోడి, జగదాంబ, కాంతి, శ్రీనరసింహ (గోపాలపట్నం), తాతా, రాములమ్మ (తగరపువలస)
- **డాకు మహారాజ్ :** శరత్, మోహిని కాంప్లెక్స్, శ్రీకన్య హెవెన్ (గాజువాక), గణేష్, సప్తగిరి (తగరపువలస)
- **గేమ్ ఛేంజర్ :** మెలోడి, కామేశ్వరి, కన్యకాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-2 (పెందుర్తి) రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 23, టమాటా 15, వంకాయలు (తెలుపు)40, వంకాయలు (నలుపు) 36, బెండకాయలు 30, పచ్చిమిర్చి 32, కాకరకాయలు 40, బీరకాయలు 46, ఆనపకాయ 20, కాలీఫ్లవర్ 20, క్యాబేజి 12, క్యారెట్ 24 దొండకాయలు 34, బంగాళ దుంపలు 16, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 40, అల్లం (పాతది)50, బరబాటి 34, ముల్లంగి 22, నిమ్మకాయలు (కిలో) 100, బద్దచిక్కుడు 52, దోస కాయలు 22, వెల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 56, కీరదోస 20, కాప్సికమ్ 42, పొట్లకాయ (పెద్దది) 28, చేమ దుంపలు 40 చిలగడదుంపలు 40, కంద 64, దేముడు చిక్కుడు 64, గోరు చిక్కుడు 38, కూర పెండలం 26, బ్రకోలి 45 , నూల్ కోల్ 30, పనసపొట్టు 200, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 15, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 90, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 22, మామిడి అల్లం 64, బొప్పాయి 42, జామ కాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్)	
(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	415
విజయనగరం	419
శ్రీకాకుళం	419

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	87
లైవ్ ధర	107
విత్ స్కిన్	184
స్కిన్‌లెస్	194

కాపర్ కోసం రోడ్డు తవ్వారట!

- పోలీసుల దర్యాప్తు తీరుపై విమర్శలు
- వాస్తవాలు దాస్తున్నారంటూ ఆరోపణలు

ఎంవీపీ కాలనీ, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : ఓ సెల్‌ఫోన్, రూ. వెయ్యితో నిందితుడిని పట్టుకుంటే ప్రెస్‌మీట్ పెట్టి గొప్పగా చెప్పుకునే ఎంవీపీ నేర విభాగం పోలీసులు ఓ కేసు విషయంలో మాత్రం వివరాలు చెప్పడానికి ఇబ్బంది పడుతున్నారు. దీంతో ఈ కేసు విషయమై పలు అనుమానాలు రేకెత్తుతున్నాయి. ఎంవీపీ కాలనీ డబుల్ రోడ్డులో ఏఎస్ రాజా మైదానం ఆనుకుని ఫుట్‌పాత్, కొంత మేర రోడ్డును వారం రోజుల క్రితం అర్థరాత్రి సమయంలో కొందరు వ్యక్తులు మెషిన్‌తో తవ్వేశారు. అదే సమయంలో అటుగా వెళుతున్న ఎంవీపీ పోలీసులు వారిని పట్టుకుని ప్రశ్నించడంతో పొంతనలేని సమాధానాలు ఇచ్చారు. దీంతో ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. దీనిపై బీఎస్ఎన్ఎల్ సహాయ ఇంజినీరు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. ఈ విషయంలో పలు అనుమానాలు రేకెత్తుతున్నా, పోలీసులు మాత్రం సరైన వివరాలు చెప్పడానికి వెనుకాడుతున్నారు. ఫిర్యాదు కాపీ లేదా ఎఫ్ఐఆర్ చూపించమన్నా, తాము ఇవ్వలేమని అంటున్నారు.

అనుమానాలివి!

రోడ్డు తవ్వి, భూ గర్భంలో ఉన్న బీఎస్ఎన్ఎల్ కేబుళ్లను బయటకు తీసి, అందులోని కాపర్‌ను ఎత్తుకుపోయి అమ్ముకోవడానికే నిందితులు ఈ పని చేశారని పోలీసులు చెబుతున్నారు. అంతవరకూ బాగానే ఉన్నా, అత్యంత పకడ్బందీగా ప్రతి రోజూ రాత్రి సమయంలో ఒక బృందంగా ఏర్పడి బీఎస్ఎన్ఎల్ కేబుల్‌ను తవ్వేశారు. అసలు ఇవి ఎక్కడ ఉన్నాయి, ఏ దిశగా వెళుతున్నాయి అన్నది స్పష్టత ఉంటే తప్ప భూగర్భంలో తవ్వే అవకాశం ఉండదు.

పైగా ఈ కేబుళ్లను ఆనుకుని 11 కేవీ విద్యుత్తు కేబుళ్లు కూడా వెళుతున్నాయి. పొరపాటున ఆ కేబుల్ పనిచేసేవారి పనిముట్లను తాకితే, ప్రమాదం భారీగా ఉంటుంది. ఇలా తవ్వుతున్నప్పుడు విద్యుత్తు శాఖ సిబ్బంది కూడా వీరిని ప్రశ్నించడం, మాకు తెలుసంటూ వారు సమాధానం ఇవ్వడం ఆశ్చర్యకరం. అలాగే సుమారు పదిహేను చోట్ల మూడు నుంచి నాలుగడుగుల మేర తవ్వి, కేబుళ్లను బయటకు తీసి, అందులోని కాపర్‌ను బయటకు లాగేశారు. ఇది కొద్ది రోజులుగా ప్రణాళిక ప్రకారం జరిగింది. ఈ నెల అయిదో తేదీన బీఎస్ఎన్ఎల్ అధికారులకు తమ ల్యాండ్ లైన్లు పనిచేయడం లేదని ఫిర్యాదులు వచ్చాయి. దీనిపై వారు పరిశీలించగా,ధ గోతులు గమనించి, పోలీసులకు మౌఖికంగా ఫిర్యాదు చేయడం జరిగినా, ఈ గొయ్యిలు మాత్రం ఆగలేదు. ఎట్టకేలకు ఈ నెల 9న పోలీసుల నైట్ రౌండ్స్‌లో మళ్లీ వీరు తవ్వుతుంటే పట్టుకుని, అదుపులోకి తీసుకున్నారు. తర్వాత అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. అయితే ఇంత పకడ్బందీగా ఎలా తవ్వగలిగారన్న దానికి పోలీసుల నుంచి కూడా సరైన సమాధానం రాలేదు. నిందితులు ఏడుగురు ఏలూరుకు చెందినవారనిపోలీసులు చెబుతున్నారు. వారికి ఇక్కడ కేబుళ్లు ఉన్నవిషయం ఎలా తెలుసంటే ఏమో అంటున్నారు. అంటే నిందితులనువిచారించలేదా, లేక తెలిసినీనిజాలు దాస్తున్నారో అర్థం కావడం లేదు.

విశ్వసనీయ సమాచారం మేరకు.. పట్టుబడిన నిందితులు గతంలో బీఎస్ఎన్ఎల్ కాంట్రాక్టరు వద్ద పని చేసినట్లు తెలుస్తోంది. ఈ కేబుళ్లను వేసేటప్పుడు కూడా వారే పని చేశారని అంటున్నారు. ఎవరు అడిగినా బీఎస్ఎన్ఎల్ పేరునే చెప్పి, తమ పని కానిచ్చేశారు.

దీంతో ఈ వ్యవహారం వెనుక కాంట్రాక్టర్లు కూడా ఉన్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. జరిగిన వ్యవహారం వల్ల జీవీఎంసీ నిర్మించిన రోడ్లు, ఫుట్‌పాత్‌లపైన వేసిన టైల్స్ వంటివి ధ్వంసమయ్యాయి.

పోలీసులు కేసులో నష్టం రూ.90 వేలు విలువైన కేబుళ్లు అంటూ నమోదు చేశారు. కానీ ఈ నష్టం రూ.లక్షల్లో ఉంటుందని అధికారులు అంటున్నారు. దీనిపై పూర్తి స్థాయిలో విచారణ చేస్తే తప్ప నిజాలు బయటకు వచ్చే అవకాశం లేదు.

క్లౌడ్ కిచెన్స్‌లో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీ



తనిఖీ చేస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారులు

విశాఖపట్నం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): నగర పరిధిలోని పలు ప్రాంతాల్లో నిర్వహిస్తున్న క్లౌడ్ కిచెన్లపై బుధవారం ఆహార భద్రత, ప్రమాణాలశాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఎంవీపీ కాలనీ, మధురవాడ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న పదికిపైగా క్లౌడ్ కిచెన్స్‌ను జిల్లా అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ నందాజీ, ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు జీవీ అప్పారావు, ఆనందరావు పరిశీలించారు.అపరిశుభ్రంగా ఉండ డాన్ని గుర్తించి ఆరు కిచెన్స్‌కు నోటీసులు జారీ చేశారు. ఆహార నమూనాలను సేకరించి పరీక్షలకు పంపించారు. తనిఖీలు నిర్వహించిన క్లౌడ్ కిచెన్స్‌లో హ్యాంగవుట్ బిర్యానీస్, మెగా భోజనం, అయిప్స్ కిచెన్, ఆంధ్ర బిర్యానీస్, రాజుల రుచులు, పక్కా హైదరాబాదీ, రాజూస్ కిచెన్ ఉన్నాయి. నిర్వాహకులు తప్పనిసరిగా ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్సులు తీసుకోవాలని, నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. లేదంటే కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆస్తి విలువ ఆధారిత పన్ను విధానాన్ని రద్దుచేయాలి

వార్వా, నివాస్ ఆధ్వర్యంలో రెసిడెన్షియల్ వెల్ఫేర్ సంఘాల ఆందోళన

సిరిపురం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : ఆస్తి విలువ ఆధారిత పన్ను విధానాన్ని రద్దు చేయాలని, అపార్ట్‌మెంట్ వాసుల సమస్యలను పరిష్కరించాలని వక్తలు డిమాండ్ చేశారు. బుధవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద వార్వా, నివాస్ ఆధ్వర్యంలో రెసిడెన్షియల్ వెల్ఫేర్ సంఘాల సభ్యులు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ధర్నా నిర్వహించారు. ధర్నాను ప్రారంభించిన నాగార్జున యూనివర్సిటీ మాజీ వీసీ బాలమోహన్‌దాస్ మాట్లాడుతూ అయిదేళ్లకు ఒకసారి అద్దె విలువపై లెక్కించి, పెంచాల్సిన ఇంటి పన్ను, క్యాపిటల్ విలువ ఆధారంగా, రిజిస్ట్రేషన్ చార్జీల పెంపుదలతో, పెనాల్టీలతో లెక్కించి ప్రతి ఏటా పెంచే ఆస్తిపన్నుగా మార్చడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. వార్వా నివాస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎన్.ప్రకాశరావు, బీబీ గణేష్, నారాయణమూర్తి మాట్లాడుతూ విద్యుత్ సర్దుబాటు చార్జీలు, ప్రీపెయిడ్ రీచార్జి, పీక్ సమయాల్లో విభిన్న రేట్లలో విద్యుత్ బిల్లులు వసూలు చేసి విద్యుత్ వ్యవస్థను అవినీతిమయం చేస్తున్నారని మండిపడ్డారు. నగరంలోని పార్కులు, స్పోర్ట్స్ స్టేడియాలను ప్రభుత్వమే నడపాలన్నారు. ఆస్తిపన్ను రద్దు చేసి అద్దె ఆధారిత ఇంటిపన్ను పునరుద్ధరించాలని కోరుతూ సంతకాలు చేసి నగర్ మేయర్‌కు అందజేశారు. ఈ ధర్నాలో సంఘం పూర్వ అధ్యక్షులు సీహెచ్ఎల్ఎన్ శాస్త్రి, నివాస్ అధ్యక్షులు బి.గురప్ప, శర్మ, త్రినాథస్వామి, రఘురామ్, రమణ, తులసీరామ్ పాల్గొన్నారు.

చందనయాత్రలోగా 'ప్రసాద్' పనులు పూర్తిచేయండి

కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ ఆదేశం



పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్, అధికారులు



కప్పస్తంభం వద్ద కలెక్టర్ హరింధిర ప్రసాద్

సింహాచలం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : కేంద్రం మంజూరు చేసిన రూ.54.4 కోట్లతో పర్యాటక శాఖ సింహగిరిపై చేపడుతున్న ప్రసాద్ పథకం పనులను సింహాద్రి అప్పన్న నిజరూపదర్శనం (చందనోత్సవం) సమయానికి పూర్తిచేయాలని కలెక్టర్ ఎంఎన్ హరేంధర్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. దేవస్థానం ఈవో కె.సుబ్బారావుతో కలిసి బుధవారం ప్రసాద్ పనుల క్షేత్రపరిశీలన చేపట్టారు. ఈ సందర్భంగా దుకాణాల సముదాయం, క్యూలు, పర్యాటక సమాచార కేంద్రం, పార్కుల అభివృద్ధి పనులను పరిశీలించి తగు సూచనలిచ్చారు. పనుల వేగం పెంచి చందనోత్సవం (ఏప్రిల్ 30)కన్నా ముందుగానే పూర్తిచేయాలన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని, సూచించారు. ప్రసాద్ పనుల గురించి ముందుగా సిద్ధం చేసిన ప్రణాళిక ప్రకారం ఈవో సుబ్బారావు కలెక్టర్‌కు వివరించారు. ప్రస్తుత పనుల పురోగతి, త్వరలో చేపట్టనున్న మరిన్ని అభివృద్ధి పనుల వివరాలను తెలిపారు. రానున్న చందనోత్సవ ఏర్పాట్లపై కూడా ప్రాథమిక చర్చ సాగించారు.

అంతకుముందు కలెక్టర్ హరీంధరప్రసాద్.. లక్ష్మీనృసింహస్వామిని దర్శించుకున్నారు. ఆయనకు దేవస్థానంఈవో కె.సుబ్బారావు అధికార లాంఛనాలతో ఆహ్వానం పలికారు. కప్పస్తంభ ఆలింగనం చేసుకున్న కలెక్టర్ గోత్రనామాలతో అంతరాలయంలో అర్చకులు పూజలు చేసి శేషవస్త్రాన్ని పర్యవేట్టంగా చుట్టారు. గోదాదేవి అమ్మవారి దర్శనం తరువాత పండితులు వేదాశీర్వచనాలీయగా, ఈఓ శాలువతో సత్కరించి జ్ఞాపికగా స్వామివారి ఫోటోను, స్వామివారి ప్రసాదాలను అందజేశారు.

కార్యక్రమంలో దేవస్థానం ఈఈలు డీజీ శ్రీనివాసరాజు, బి.రాంబాబు, డీఈఈ డీవీఎస్ రామరాజు (హరి), ఏఈలు సన్యాసిరావు, రవిరాజ్, బాబ్జీ, టూరిజం శాఖ ఏఈ మదన్ పాల్గొన్నారు.

సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ

ఎంవీపీ కాలనీ, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : శ్రీసత్యసాయి ఉజ్వల్ జీవన్ ఫర్ బెటర్ లివింగ్ కార్యక్రమంలో భాగంగా నగరంలోని రైల్వే ఏరియా శ్రీసత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఏపీఈపీ సెట్, పాలీసెట్‌లకు ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్టు జిల్లా సత్యసాయి సేవా సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. తరగతులను అక్కయ్యపాలెం పోర్టు స్టేడియం ఇన్ గేట్ ఎదురుగా గల ఎన్జీజీఓఎస్ కాలనీలోని శ్రీసాయి సౌధ మందిర్‌లో నిర్వహించనున్నట్టు సంస్థ తెలిపింది. ఇంటర్ విద్యార్థుల కోసం ఏపీఈఏపీసెట్ ఈ నెల 24 నుంచి, పదో తరగతి విద్యార్థుల కోసం పాలీసెట్ తరగతులు ఏప్రిల్ 1 నుంచి ప్రారంభించనున్నట్టు పేర్కొంది. ఇతర వివరాల కోసం ఫోన్ నెంబర్లు 92480 52173, 96668 08446లో సంప్రదించవచ్చు.

లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తికి ఐదేళ్ల జైలు

విశాఖపట్నం లీగల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): చిన్నారి పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తికి ఐదేళ్ల జైలు శిక్ష విధిస్తూ పోక్సో ప్రత్యేక కోర్టు జడ్జి బి.ఆనంది బుధవారం తీర్పుచెప్పారు. జైలు శిక్షతోపాటు రూ. 2వేల జరిమానా చెల్లించాలని, లేదంటే మరో మూడు నెలల సాధారణ జైలు శిక్ష అనుభవించాలని ఆదేశించారు.

పబ్లిక్ ప్రాసిక్యూటరు బత్తి రాజశేఖర్ తెలిపిన వివరాలివి... గాజువాక సుధామెడికల్ సమీపంలో ఉంటున్న గౌరీశంకర్(45) కాలకృత్యాలు తీర్చుకునేందుకు వచ్చిన చిన్నారిపై అసభ్యంగా ప్రవర్తించాడు. బాలిక కేకలు వేయడంతో తల్లితండ్రులు వచ్చి గాజువాక పోలీసులకు ఫిర్యాదుచేశారు.

పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదుచేసి కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి శిక్ష విధించారు.

హత్య కేసులో నిందితుడికి 14 ఏళ్ల జైలు, జరిమానా

విశాఖ లీగల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): హత్య కేసులో నిందితుడికి 14 ఏళ్ల జైలు శిక్ష, రూ.2 వేల జరిమానా విధిస్తూ నగరంలోని 12వ అదనపు జిల్లా న్యాయమూర్తి పి.గోవర్ధన్ బుధవారం తీర్పు ఇచ్చారు. జరిమానా చెల్లించకపోతే అదనంగా మూడు నెలల సాధారణ శిక్ష అనుభవించాలని తీర్పులో స్పష్టం చేశారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ వి.దేవానందరావు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి.. నిందితుడు మోహన్ పూజారి (59) కర్ణాటక రాష్ట్రంలోని ఉడిపి జిల్లా అంబటిపూడి గ్రామస్థుడు. అక్కడి నుంచి ఉమ్మడి విశాఖ జిల్లా ముంచింగ్‌పుట్ మండలం జర్సు పంచాయతీ సంతవీధికి వచ్చి యాచన చేసుకునేవాడు. అతడికి గంజాయి సేవించే అలవాటు ఉండేది. జర్సు పంచాయతీ సంతవీధి వాసి అయిన వంతల రామారావు 2024 మార్చి 3న తన ఇంటి నుంచి సంత వీధి ప్రాంతానికి పాల పిండి అమ్మడానికి వెళ్లాడు. ఉదయం 11 గంటల సమయంలో యాచకుడు రామారావును గంజాయి అడగడంతో ఇద్దరూ ఘర్షణ పడ్డారు. సాయంత్రం మరోసారి ఇద్దరి మధ్య ఘర్షణ జరిగింది. దీంతో నిందితుడు పూజారి బలమైన కత్తితో రామారావును కడుపులో పొడవడంతో రక్తపు మడుగు మధ్య అక్కడికక్కడే మృతిచెందాడు. రామారావు తండ్రి బలరాం జి.మాడుగుల పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అప్పటి సీఐ ఎస్. రమేష్ కేసు దర్యాప్తు చేసి నిందితుడిపై భారతీయ శిక్షాస్మృతి 302 సెక్షన్ కింద కేసు నమోదు చేశారు. అభియోగ పత్రాన్ని దాఖలు చేయగా నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పు ఇచ్చారు.

రామానాయుడు స్టూడియో భూములు వెనక్కి తీసుకోండి

- అసెంబ్లీలో తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు



విశాఖపట్నం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): విశాఖ, భీమిలి బీచ్‌రోడ్డు తిమ్మాపురంలో రామానాయుడు స్టూడియోకు కేటాయించిన భూములను ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు కోరారు. ఈ మేరకు బుధవారం అసెంబ్లీలో ఆయన మాట్లాడుతూ సినిమా చిత్ర నిర్మాణాల కోసం 2003లో అప్పటి ప్రభుత్వం తిమ్మాపురం కొండపై రామానాయుడు స్టూడియోకు భూములు కేటాయించిందన్నారు. రెవెన్యూ శాఖ బీఎస్‌వో -24 నిబంధనల మేరకు చిత్రనిర్మాణాల కోసం భూములు కేటాయించారని, అయితే గత ప్రభుత్వ హయాంలో కొంత భూమిలో ఇళ్ల నిర్మాణాలకు వీలుగా లేఅవుట్ అభివృద్ధిచేశారని, దీనిపై తాను సుప్రీంకోర్టులో కేసు దాఖలు చేశానన్నారు. భూముల కేటాయింపు కోసం ఉద్దేశించిన బీఎస్‌వో 24ను ఉల్లంఘించినందునందున స్టూడియోకు ఇచ్చిన భూములు స్వాధీనం చేసుకోవాలన్నారు. ఇదే కారణంతో ఎండాడలో హయగ్రీవ సంస్థకు భూ కేటాయింపులు రద్దు చేశారని గుర్తుచేశారు. నగరంలో ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్న పేదలకు చెందిన స్థలాల కమబద్ధీకరణకు 2018లో ఇచ్చిన పట్టాలకు రెండేళ్లలో ఇవ్వాల్సిన కన్వేయన్స్ డీడ్స్ ఇప్పటివరకు ఇవ్వలేదన్నారు.


రెండు నెలల క్రితం విశాఖ జిల్లా ఎమ్మెల్యేలతో సీఎం చంద్రబాబునాయుడు సమావేశమైనపుడు 100 గజాలలోపు పేదల ఇళ్ల స్థలాలు క్రమబద్ధీకరించాలని హామీ ఇచ్చారన్నారు. యూఎస్సీ భూముల క్రమబద్ధీకరణలో పదేళ్లకు బదులు రెండేళ్లకే కన్వేయన్స్ డీడ్స్ ఇవ్వడానికి సీఎం అంగీకరించినా ఇంతవరకు జీవో రాలేదన్నారు. రెవెన్యూ మంత్రి జోక్యం చేసుకుని జీవోలు జారీ చేయాలన్నారు.

ఏటీఎం కార్డులను మార్చు చేసి నగదు డ్రా చేస్తున్న దొంగ అరెస్టు

- రూ.లక్షా 1,43,000 స్వాధీనం
- నిందితుడిపై ఇప్పటికే 5 పోలీస్ స్టేషన్లలో కేసులు



వివరాలు తెలుపుతున్న జోన్-2 క్రైమ్ ఏసీపీ లక్ష్మణరావు. చిత్రంలో సీఐ శ్రీనివాసరావు, తదితరులు



నిందితుడు వీరయ్య చౌదరి

గాజువాక, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఏటీఎం కార్డులను మార్చు చేసి నగదు విత్‌డ్రా చేస్తున్న దొంగను గాజువాక క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. గాజువాక పోలీస్ స్టేషన్ కాంప్లెక్స్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జోన్-2 క్రైమ్ ఏసీపీ డి.లక్ష్మణరావు వివరాలను వెల్లడించారు. ఈ ఏడాది జనవరి 18న మింది ప్రాంతానికి చెందిన దాడి ఆనంద్ సన్యాసి తన భార్య కార్డుతో గాజువాకలోని లక్ష్మీకాంత్ థియేటర్ వద్ద గల ఏటీఎం కేంద్రంలో నగదు డ్రా చేసేందుకు యత్నించారు. ఆ సమయంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి అక్కడకు వచ్చి సహాయం చేస్తున్నట్టు నటించి సన్యాసి వద్దనున్న కార్డును తీసుకుని మరో కార్డును ఇచ్చాడు. అయితే మళ్లీ అదే నెల 20న నగదు డ్రా చేసేందుకు సన్యాసి ఏటీఎం వద్దకు వెళ్లగా ఆ కార్డు పనిచేయలేదు. దీంతో ఆయన చట్టివానిపాలెంలోని బ్యాంకుకు వెళ్లి ఆరా తీయగా ఆ ఏటీఎం కార్డు నుంచి రూ.75 వేలు డ్రా చేసినట్టు సిబ్బంది తెలిపారు. ఈ మేరకు సన్యాసి గాజువాక క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు సాంకేతిక ఆధారాలతో ఏటీఎం కార్డును మార్చేసిన మర్రిపాలేనికి చెందిన ముప్వ వీరయ్యచౌదరి (41)ని గాజువాక మోహిని థియేటర్ ఎదురుగా ఉన్న ఎస్‌బీఐ ఏటీఎం వద్ద అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు. నిందితుడు పాత నేరస్థుడేనని, ఆయన వద్ద నుంచి రూ.1,43,000, వాచ్‌ను స్వాధీనం చేసుకున్నట్టు ఏసీపీ లక్ష్మణరావు తెలిపారు. నిందితుడిపై గాజువాక, పెందుర్తి, గోపాలపట్నం, కంచరపాలెం, ఎయిర్‌పోర్టు పోలీస్ స్టేషన్‌లో కేసులు ఉన్నాయన్నారు. సమావేశంలో సీఐ కె.శ్రీనివాసరావు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

పిచ్చుకలను పరిరక్షించుకోవాలి

డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ విజయబాబు



వరి కంకులు, నీళ్ల తొట్టెలతో విద్యార్థులు

మద్దిలపాలెం, మార్చి19 (ఆంధ్రజ్యోతి) : అంతరించిపోతున్న పిచ్చుకలను పరిరక్షించాలని డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఐ.విజయబాబు పిలుపునిచ్చారు. గ్రీన్ క్లైమెట్ ఎన్జీవో ఆధ్వర్యంలో బుధవారం కళాశాలలో ప్రపంచ పిచ్చుకల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విజయబాబు మాటాడుతూ.. వేసవిలో పక్షుల కోసం మంచినీటిని అందుబాటులో ఉంచాలన్నారు. పిచ్చుకల కోసం గూళ్ల ఏర్పాటు చేయాలన్నారు. గ్యాస్ ముగ్గుతో ముగ్గులు వేస్తే పర్యావరణానికి ముప్పని బియ్యం పిండితో ముగ్గులు వేయాలని సూచించారు. గ్రీన్ క్లైమెట్ వ్యవస్థాపక కార్యదర్శి జేవీ రత్నం మాట్లాడుతూ తమ సంస్థ ప్రారంభించిన 2000 నుంచి ఇప్పటి వరకు 2.8 లల క్షల పిచ్చుకల గూళ్ల ఏర్పాటు చేశామన్నారు. పక్షులు, వన్యప్రాణుల కోసం 6 లక్షల మట్టి పాత్రలు, ప్రతీ ఏడాది 5వేల కుచ్చులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ ఏడాది 10 వేల పిచ్చుకల గూళ్లు, పక్షులు, జంతువులకు నీటి కోసం లక్ష మట్టి పాత్రలు సమకూర్చుతున్నట్టు చెప్పారు. అనంతరం విద్యార్థులకు వరికంకులు, గూళ్ల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జయ, అధ్యాపకులు పద్మావతి, స్వామినాయుడు, రామలక్ష్మణ్, సుజాత, ఏయూ సోషల్ వర్క్ విద్యార్థులు కేదార్శి, నిఖిత, భానుప్రసాద్, గ్రీన్ వలంటీర్లు రాజేశ్వరి, కృష్ణకుమారి పాల్గొన్నారు.

'ఎస్సీ వర్గీకరణను స్వాగతిస్తున్నాం'

డాబాగార్డెన్స్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): షెడ్యూల్డు కులాల వర్గీకరణపై ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన రాష్ట్ర క్యాబినెట్‌లో ఈ నెల 15న చేసిన తీర్మానాన్ని స్వాగతిస్తున్నామని ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మున్నంగి నాగరాజు తెలిపారు. బుధవారం డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజీవ్ రంజన్ మిశ్రా కమీషన్ ఇచ్చిన నివేదికను అధ్యయనం చేసిన అయిదుగురు మంత్రుల సబ్‌కమిటీ ఇచ్చిన రిపోర్టు ఆధారంగా వర్గీకరణకు అనుకూలంగా తీర్మానాన్ని ఆమోదించారన్నారు. ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ 59 ఉపకులాలకు జనాభా నిష్పత్తి ప్రకారం వర్గీకరణ జరగాలని కోరుతూ 30 సంవత్సరాల నుంచి ఉద్యమం చేస్తున్న విషయాన్ని గుర్తుచేశారు. ఇందుకు అనుకూలంగా నివేదిక ఇచ్చిందన్నారు. రిజర్వేషన్ అమలు ప్రక్రియ నెల రోజుల్లో చేయడానికి కృషి చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు ఎ.దీపిక్, రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.సురేష్, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

అంధకారంలో పార్కులు


విద్యుత్ వెలుగులు లేక బోసిపోయిన అక్కయ్యపాలెంలోని పిల్లల పార్కు


గ్రీన్‌బెల్టు పార్కులో చీకటిలోనే నడకమార్గం

అక్కయ్యపాలెం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): అక్కయ్యపాలెం నాలుగు వరుసల రహదారికి ఆనుకుని ఉన్న గ్రీన్‌బెల్ట్, పిల్లల పార్కుల్లో అయిదు రోజులుగా అంధకారం రాజ్యమేలుతోంది. విద్యుత్ దీపాలు వెలగకపోవడంతో లోపల చీకట్లు అలముకుని వాకర్లు, పిల్లలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉదయం, సాయంత్రం సమయాల్లో వాకర్లు, పిల్లలు ఈ పార్కులకు వచ్చి వ్యాయామం, వాకింగ్ చేస్తుంటారు. పిల్లలు ఆటలాడుకుని సరదాగా గడుపుతుంటారు. గత కొన్ని రోజులుగా చిమ్మచీకట్లు కమ్ముకోవడం, సంబంధిత విభాగం వారు పట్టించుకోకపోవడంతో పార్కులకు వచ్చినవారు నిరుత్సాహం చెందుతున్నారు. అధికారుల పర్యవేక్షణ లోపాన్ని ఈ ఘటన చాటుతోందని వాకర్లు అంటున్నారు. పార్కులను ఏర్పాటు చేసి గాలికొదిలేయకుండా వాటి నిర్వహణ కూడా చేపట్టాలని కోరుతున్నారు. కొన్ని నెలల క్రితమే ఈ పార్కులను ప్రారంభించారు. ఇందులో అమర్చిన విద్యుత్ దీపాలు వెలుగులు విరజిమ్మాయి. ప్రధాన రహదారి పక్కనే ఈ పార్కులు ఉండడంతో బాటసారులను కూడా ఈ పార్కులు ఆకట్టుకునేవి. ఇప్పటికైనా అధికారులు స్పందించి పార్కుల్లో చీకట్లు తొలగించాలని కోరుతున్నారు.

'ఉక్కు పరిశ్రమ విక్రయ ప్రతిపాదన విరమించుకోవాలి'


రౌండ్‌టేబుల్ సమావేశంలో కరపత్రాన్ని విడుదల చేస్తున్న నాయకులు

మహారాణిపేట, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం విశాఖ ఉక్కు పరిశ్రమకు రూ.11,440 కోట్ల ప్యాకేజీ ఇచ్చి ప్లాంట్‌ను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించే కుట్ర చేస్తోందని, ఈ ప్రయత్నాన్ని కూటమి పార్టీల నేతలు అడ్డుకోవాలని జిల్లా అఖిల పక్ష కార్మిక, ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ ఎం. జగ్గునాయుడు డిమాండ్ చేశారు. జగదాంబ సమీపంలోని సీఐటీయూ కార్యాలయంలో బుధవారం జిల్లా అఖిలపక్ష కార్మిక సంఘాల జేఏసీ రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జేఏసీ నేతలు ప్రచార కరపత్రాన్ని విడుదల చేశారు. ఇచ్చిన ప్యాకేజీ డబ్బును ప్లాంట్ ఉత్పత్తి, యంత్రాలు, ముడి సరకులు, కార్మికుల జీతభత్యాలకు కేటాయించకుండా అప్పులు చెల్లించారని ఆక్షేపించారు. కేవలం రూ.3 వేల కోట్లతో శాశ్వత, కాంట్రాక్ట్ ఉద్యోగులను తొలగించి, పూర్తిస్థాయి ఉత్పత్తులు రాబట్టాలని షరతు పెట్టారని పేర్కొన్నారు. 1,100 మంది శాశ్వత కార్మికులు, 5,400 మంది కాంట్రాక్ట్ ఉద్యోగుల తొలగింపునకు సిద్ధపడ్డారని విమర్శించారు. ఉక్కు పరిశ్రమను అమ్మేయాలన్న ఆలోచనను విరమించుకోవాలని, ఉద్యోగులెవరినీ తొలగించవద్దని, ప్లాంట్‌కు సొంతగనులు కేటాయించేలా కేంద్రంపై ఒత్తిడి తేవాలని కూటమి నాయకులను కోరారు. మోదీ కుట్రలు బయటపెట్టేందుకు గురువారం ప్రభుత్వ, ప్రైవేటు పరిశ్రమలు, బస్టాప్‌లు, బజార్ల వద్ద పెద్దఎత్తున కరపత్రాలు పంపిణీ చేస్తామని తెలిపారు. ఏప్రిల్ 1న జీవీఎంసీ వద్ద మహాధర్నా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. స్టీల్‌ప్లాంట్ కార్మికులకు సంపూర్ణ మద్దతు అందిస్తామని జగ్గునాయుడు ప్రకటించారు. ఈ సమావేశంలో నాయకులు జీజేఎస్ అచ్యుతరావు, ఆర్‌కేవీఎస్ కుమార్, ఎస్.జ్యోతీశ్వరరావు, బూసి వెంకటరావు, సురేష్, రమణ, లక్ష్మి, సుహాసిని, అప్పారావు, నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

బాలికపై లైంగిక దాడి యువకుడిపై పోక్సో కేసు

సీతంపేట, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): అక్కయ్యపాలెం ప్రాంతంలో నివాసం ఉంటున్న ఓ బాలికకు మాయమాటలు చెప్పి ఇంటి నుంచి బయటకు తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడిన ఓ యువకుడిపై పోక్సో కేసు నమోదైంది. నాలుగో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... అక్కయ్యపాలెం చెక్కుడురాయి భవనం సమీపంలో నివాసం ఉంటున్న కవి సత్య (22) అదే ప్రాంతంలోని ఓ మిఠాయి దుకాణంలో పనిచేస్తున్నాడు. సత్య తన ఇంటి సమీపంలో ఉంటున్న బాలికకు మాయమాటలు చెప్పి ఈ నెల 15న బయటకు తీసుకెళ్లాడు. ఆ బాలికను పలు ప్రాంతాల్లో తిప్పాడు. పలుచోట్ల ఆ బాలికపై అఘాయిత్యానికి పాల్పడ్డాడు. తమ కుమార్తె అదృశ్యమైందని బాలిక తల్లిదండ్రులు ఈ నెల 16న నాలుగో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. బుధవారం బాలిక సహా నిందితుడు పోలీసులకు పట్టుబడ్డాడు. కవి సత్యపై సీఐ సత్యనారాయణ పోక్సో కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నారు.

నిధుల దుర్వినియోగం .. పోస్టుమ్యాన్‌కు మూడేళ్ల జైలు

మహారాణిపేట, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): కురుపాం మార్కెట్ సబ్ పోస్టాఫీస్‌లో పోస్టుమ్యాన్‌గా పనిచేసిన వి.వి.రమణమూర్తి 2019లో రూ.51 వేల సుకన్య యోజన స్కీం డబ్బును దుర్వినియోగం చేశారన్న అభియోగంపై అసిస్టెంట్ సూపరింటెండెంట్ కె.శ్యామసుందరరావు వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ కేసులో పోస్టుమ్యాన్ రమణమూర్తికి జిల్లా కోర్టు న్యాయమూర్తి ఎం.ప్రదీప్ కుమార్ మూడేళ్ల జైలుశిక్ష, రూ.20 వేల జరిమానా విధించారు. బుధవారం ఈ తీర్పును వెలువరించారు.

వినియోగదారుల హక్కుల కమీషన్‌లో రాజేష్‌కు పదవి

మహారాణిపేట, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): జాతీయ వినియోగదారుల హక్కుల కమీషన్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా బద్దుకొండ రాజేష్ నియమితులయ్యారు. బుధవారం వన్‌టౌన్‌లోని విశాఖ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో జాతీయ చైర్మన్ సాయి రమేష్ ఆయనకు నియామక పత్రాన్ని అందించారు. వినియోగదారుల హక్కులపై ప్రజలకు అవగాహన కల్పనకు కృషి చేస్తానని రాజేష్ అన్నారు. తనకు ఈ అవకాశం కల్పించిన పల్లి శ్రీనివాసనాయుడు, శ్రీనివాసరాజు, రాష్ట్ర చైర్మన్ శ్రీనివాస్ యాదవ్, దాడి సత్యనారాయణలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్వనాథ్, శ్రీరామమూర్తి, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

అక్కయ్యపాలెం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 42వ వార్డు రైల్వే న్యూకాలనీ మసీదు రోడ్డు బజారు వద్ద బాక్స్ కల్వర్ట్ నిర్మాణం చేపట్టేందుకు బీజేపీ నాయకురాలు శ్యామలా దీపిక శంకుస్థాపన చేశారు. ఆమె మాట్లాడుతూ ఈ ప్రాంతంలో రూ.20 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు చెప్పారు. కార్పొరేటర్ ఆళ్ల లీలావతి, జడ్సీ రాము, ఏఈ రమణమ్మ, సుబ్బారావు పాల్గొన్నారు.

ఏఎంసీకి ఓవరాల్ కాంస్య పతకం


ట్రోఫీ, పతకాలు సాధించిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యాదేవి తదితరులు

విశాఖపట్నం స్పోర్ట్సు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ ఎన్టీఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ అంతర్ కళాశాలల గేమ్స్ అండ్ స్పోర్ట్సు మీట్‌లో ఆంధ్ర వైద్య కళాశాల ఓవరాల్ కాంస్య పతకం సాధించింది. గన్నవరంలో డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ వైద్య కళాశాలలో ఈ టోర్నీలలో ఆంధ్ర వైద్య కళాశాల విద్యార్థులు కెప్టెన్ భాను, బి.అంబేడ్కర్, ఎం.ధనుష్, ఎం.తరుణ్ శ్రీరామ్, డి.చరణ్ నాయక్‌లు అద్భుతంగా రాణించి పతకాలు సాధనతో ఏఎంసీని ఓవరాల్ మూడో స్థానంలో నిలబెట్టారు. ప్రిన్సిపాల్ సంధ్యాదేవి బుధవారం విద్యార్థులను అభినందించారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.కృష్ణవేణి, స్పోర్ట్సు వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ ఆర్.సునీల్‌కుమార్, ఫిజికల్ డైరక్టర్ డాక్టర్ ఎంఎస్ఎన్.పాత్రుడు, కార్యదర్శి ఎన్.భాను సతీష్‌లు హర్షం వ్యక్తం చేశారు.

జాతీయ విలువిద్య పోటీలకు విశాఖ జిల్లా క్రీడాకారులు

విశాఖపట్నం స్పోర్ట్సు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): జాతీయ మినీ, కిడ్స్ విలువిద్య (ఆర్చరీ) చాంపియన్‌షిప్ టోర్నీలో పాల్గొనే ఉమ్మడి విశాఖ జిల్లా క్రీడాకారుల జాబితాను బుధవారం ప్రకటించారు. గుంటూరులో జరిగే ఈ టోర్నీ ఇండియన్ రౌండ్, రికర్వ్, కాంపౌండ్ ఈవెంట్లలో వివిధ వయసుల వారి బృందాలలో 12 మంది చిన్నారులు ప్రాతినిధ్యం వహిస్తున్నారని జిల్లా విలువిద్య క్రీడా సంఘం కార్యదర్శి కె.నిషాంత్ తెలిపారు. ఇండియన్ రౌండ్ బాలుర విభాగంలో సోదేరామ్ చైతన్య, వంతల వసంత సాయితేజ, నల్లి తేజేశ్వరరావు, సిరిపురి వెంకట శరత్ వర్మ... బాలికల విభాగంలో సాయి మనస్వి, కె.చోద్య నందిత ప్రాతినిధ్యం వహిస్తారని పేర్కొన్నారు. అలాగే రికర్వ్ బాలికల విభాగంలో ఎస్.తన్మయ శ్రీఎస్.కన్విక్‌శ్రీ, బాలుర విభాగంలో ఎల్.శాత్విక్ సుధీప్... కాంపౌండ్ బాలికల కేటగిరీలో ఊడి యశస్వి, ఆద్య వేమూరి ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. జిల్లా విలువిద్య క్రీడా సంఘం అధ్యక్షుడు పి.సూర్యనారాయణరెడ్డి, ఉపాధ్యక్షుడు పి.సత్యనారాయణ, ఇతర ప్రతినిధులు చిన్నారులను అభినందించారు.

దివ్యాంగ క్రికెటర్లకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు

విశాఖపట్నం స్పోర్ట్సు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగ క్రికెటర్లతోపాటు అర్హత కలిగిన క్రికెటేతర దివ్యాంగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఏఎంటీజెడ్, ఐడియా, సాక్షం వంటి ప్రముఖ సంస్థలు ముందుకు వచ్చాయని కౌన్సిల్ కార్యదర్శి సురవరపు రామన్ ఒక ప్రకటనలో తెలిపారు. తొలి దశలో విశాఖ, అనకాపల్లికి చెందిన దివ్యాంగులకు ప్రాధాన్యత ఇస్తూ ఉద్యోగవకాశాలు ఇవ్వనున్నారని పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత గల దివ్యాంగ క్రికెటర్లు, క్రికెటేతర దివ్యాంగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, వివరాలకు ఫోన్:7780167625లో సంప్రదించాలని డీఏసీసీ కమిటీ చైర్మన్ యడ్లపల్లి సూర్యనారాయణ, సభ్యుడు ఇల్లూరి అజయ్‌కుమార్ రెడ్డి తెలిపారు.

పాలిటెక్నిక్ ఉత్తీర్ణులతోనే పారిశ్రామిక ప్రగతి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ సోమరాజు

కంచరపాలెం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్ విద్యార్థులతోనే పారిశ్రామిక ప్రగతి ముడిపడి ఉంటుందని గాయత్రి విద్యా పరిషత్ కార్యదర్శి ప్రొఫెసర్ సోమరాజు అన్నారు.కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో బుధవారం వార్షిక, ఉద్యోగ సాధకుల ఉత్సవాలను సంయుక్తంగా నిర్వహించారు. ప్రొఫెసర్ సోమరాజు ముఖ్య అతిథిగా ప్రసంగిస్తూ పుస్తకాలకే పరిమితం కాకుండా, ప్రయోగాత్మక అనుభవంతోనే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చునన్నారు. ప్రిన్సిపాల్ డా.కె.నారాయణరావు మాట్లాడుతూ ఈ ఏడాది పాలిటెక్నిక్ విద్యార్థులు నూరుశాతం ప్రాంగణ ఉద్యోగాలకు ఎంపిక కావడం అభినందనీయమన్నారు. ఎలక్ట్రికల్ విభాగం విద్యార్థి రూ.9.06 లక్షల వేతనంతో టిక్సాస్ సంస్థలో ఉద్యోగం సాధించాడని అన్నారు. వీఎంఆర్డీఏ చీఫ్ ఇంజినీర్ ఎం.వినయ్‌కుమార్ మాట్లాడుతూ పీజీలు చదివిన వారికంటే పాలిటెక్నిక్ డిప్లొమా పూర్తిచేసిన విద్యార్థులే అధిక శాతం ఉద్యోగాలు సాధిస్తున్నారని అన్నారు. అనంతరం అతిథులు ఉద్యోగ సాధకులను సత్కరించారు. కెమికల్ కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.వి.రమణ, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

మెట్రో రైల్ సీఎంపీలకు కేంద్రం నిధులు మంజూరు

... 5వ పేజీ తరువాయి

సూచనలతో సీఎంపీ కోసం కన్సల్టెన్సీ సంస్థను టెండర్ల ద్వారా ఏపీ మెట్రో రైలు కార్పొరేషన్ ఎంపిక చేసిందని తెలిపారు. రెండు నగరాల్లో సీఎంపీ రూపకల్పన కోసం సిస్ట్ర ఎంవీఏ సంస్థను ఎంపిక చేశామన్నారు. విశాఖలో రూ.87.47 లక్షలు, విజయవాడలో రూ.81.68 లక్షలతో ప్లాన్ రూపొందించనున్నట్టు తెలిపారు. ఆయా పనుల కోసం ఏపీ మెట్రో రైల్ కార్పొరేషన్‌కు సెంట్రల్ అర్బన్ ట్రాన్స్‌పోర్ట్ విభాగం నిధులు మంజూరు చేసిందన్నారు.

గజం రూ.75,560

... 5వ పేజీ తరువాయి

గజాల వరకు పెట్టారు. ధర బాగా తగ్గించారు. ఆ ప్రాంతంలో ప్రభుత్వం రిజిస్ట్రేషన్ ధర గజం రూ.50 వేలు ఉండగా, రాజీవ్ స్వగృహ అధికారులు గజం రూ.60 వేలకే అప్‌సెట్ ధర నిర్ణయించారు. వాస్తవానికి బయట గజం లక్ష రూపాయల వరకు ఉంది. ఇదే అదనుగా భావించిన వైసీపీ పెద్దలు వారి అనుచరులను రంగంలో దింపి గజానికి రూ.500 ఎక్కువ వేసి అంటే రూ.60,500 చొప్పున 32 ప్లాట్లను సొంతం చేసుకున్నారు. ఇదంతా 2024 ఎన్నికల ప్రకటనకు ముందు జరిగింది. ఆ తరువాత ప్రభుత్వం మారడంతో తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి ఈ కుంభకోణంపై ప్రశ్నించారు. ఆ వేలంలో అమ్మిన భూములను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అయితే ప్రభుత్వం వాటిపై ఎటువంటి నిర్ణయం ప్రకటించలేదు. ప్రస్తుతం ఇంకో 39 ప్లాట్లు అందుబాటులో ఉండగా, వాటిని అప్‌సెట్ ధర రూ.75,560తో అమ్మాలని సూచించింది.

హత్యకు గురైంది ట్రాన్స్‌జెండర్

... 5వ పేజీ తరువాయి

బయ్యవరం వద్ద పడేశారనే వార్త ఈ ప్రాంతంలో దావానలంలా వ్యాపించింది. ఈ నేపథ్యంలో మునగపాక మండలం నాగులాపల్లిలో ట్రాన్స్‌జెండర్ ఒకరు అద్దెకు వుంటున్న ఇంటి వెలుపల రక్తపు మరకలు చూసిన స్థానికులు ఈ విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. మంగళవారం అర్ధరాత్రి క్లూస్ టీమ్ అక్కడకు వెళ్లి ఇంటిలో పరిశీలించారు. ఇంటిలో ఎవరెరు వుంటున్నారో పోలీసులు ఆరా తీశారు. బన్నీ అనే 30 ఏళ్ల యువకుడు, ట్రాన్స్‌జెండర్ కలిసి వుంటున్నట్టు గుర్తించారు. అర్ధరాత్రి దాటిన తరువాత అతడిని అదుపులోకి తీసుకున్నారు. ట్రాన్స్‌జెండర్ పేరు షైపాలి దిలీప్ శివశంకర్ అలియాస్ దీపు (40) అని అతను చెప్పినట్టు సమాచారం. అతను ఇచ్చిన సమాచారంతో కశింకోట సీఐ స్వామినాయుడు, పోలీసు సిబ్బంది బుధవారం ఉదయం అనకాపల్లి పట్టణ శివారులోని జగలమదుం కూడలి సమీపంలో జాతీయ రహదారికి వెళ్లే మార్గంలో ఒక బాక్సును స్వాధీనం చేసుకున్నారు. దానిని తెరిచిచూడగా తల, ఎడమ చేయి కనిపించాయి. వీటిని ప్యాక్ చేసి ఎన్టీఆర్ వైద్యాలయం మార్చురీకి పంపారు. అనంతరం నిందితుడిని వెంటబెట్టుకుని కశింకోట మండలం తాళ్లపాలెం మామిడివాక గెడ్డ వద్దకు వెళ్లారు. అక్కడ మిగిలిన శరీర భాగాలు (మొండెం) వున్న సంచిను అతను చూపించాడు. పంచనామా అనంతరం ఎన్టీఆర్ వైద్యాలయం మార్చురీకి తరలించారు. దీంతో బయ్యవరం వద్ద మంగళవారం లభించిన శరీర భాగాలు మహిళవిగా భావించిన పోలీసులు, బుధవారం మిగిలిన శరీర భాగాలు కూడా లభ్యమైన తరువాత హత్యకు గురైంది ట్రాన్స్‌జెండర్‌గా నిర్ధారించారు.

నాగులాపల్లి అద్దె ఇంటిలోనే హత్య?

ట్రాన్స్ జెండర్ దిలీప్ అలియాస్ దీపును సోమవారం అర్ధరాత్రి నాగులాపల్లిలోని అద్దె ఇంటిలోనే హత్య చేసి, శరీరాన్ని ముక్కలుగా నరికి, బెడ్‌షీట్‌లో, బాక్సులో, సంచిలో వేసుకుని మూడుచోట్ల పడేసినట్టు పోలీసుల విచారణలో బన్నీ చెప్పినట్టు తెలిసింది.

దీపుగా మారిన దిలీప్

హత్యకు గురైన ట్రాన్స్‌జెండర్ అసలు పేరు షైపాలి దిలీప్ శివశంకర్ (40). అనకాపల్లి గవరపాలెంలో ఉన్న ముత్రాసుకాలనీకి చెందిన దిలీప్..ట్రాన్స్‌జెండర్‌గా మారి 'దీపు'గా పేరుమార్చుకున్నాడు. అప్పటి నుంచి తల్లిదండ్రులకు దూరంగా వున్నాడు.

నాలుగేళ్ల నుంచి సహజీవనం

పశ్చిమ గోదావరి జిల్లా ఇరగవరం మండలం పొదలాడకు చెందిన బన్నీ కొన్నేళ్ల క్రితం ఉపాధి నిమిత్తం అనకాపల్లి వచ్చాడు. ఒక ఫుడ్ డెలివరీ కంపెనీలో బాయ్‌గా పనిచేస్తుండగా ట్రాన్స్‌జెండర్ దీపుతో పరిచయం ఏర్పడింది. సుమారు నాలుగేళ్ల నుంచి వీరు సహజీవనం చేస్తున్నట్టు తెలిసింది. ఏడాది క్రితం మునగపాక మండలం నాగులాపల్లిలో ఒక ఇల్లు అద్దెకు తీసుకుని నివాసం వుంటున్నారు. వీరిరువురూ తరచూ గొడవ పడుతూ ఉండేవారని స్థానికులు చెబుతున్నారు. ఈ కేసుకు సంబంధించి పూర్తి వివరాలను గురువారం మీడియాకు వెల్లడిస్తామని పోలీసు అధికారులు చెప్పారు. ఏం జరిగిందన్నది కొన్ని గంటల్లో తేలనుంది.

ఆరోగ్య కేంద్రాల్లో అంతంతమాత్రం సేవలు

... 5వ పేజీ తరువాయి

నెలకొంది. రెల్లివీధిలోని జాలారిపేట ప్రాంతంలో ఉన్న అర్బన్ హెల్త్ సెంటర్‌లోనూ ఇదే పరిస్థితి.

సెలవులతో ఇబ్బంది

అర్బన్ హెల్త్ సెంటర్లలో కొన్నిచోట్ల మినహా ఒక వైద్యుడు, ఇద్దరు స్టాఫ్ నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మసిస్టు, ఒక హెల్పర్ ఉంటారు. ఒక్క డాక్టరే ఉన్నచోట...ఆయన సెలవు పెడితే ఇబ్బంది ఎదురవుతోంది. బుధవారం రేసపువానిపాలెం, మద్దిలపాలెం అర్బన్ హెల్త్ సెంటర్స్‌లోని వైద్యులు సెలవులో ఉన్నారు. రేసపువానిపాలెం అర్బన్ హెల్త్ సెంటర్‌లో స్టాఫ్ నర్సే రోగులను పరీక్షిస్తున్నారు. మద్దిలపాలెం అర్బన్ హెల్త్ సెంటర్‌లోనూ అదే పరిస్థితి. ఈ సెంటర్‌లో ల్యాబ్ టెక్నీషియన్ కూడా సెలవులో ఉండడంతో రోగులకు అందించే సేవలపై తీవ్ర ప్రభావం పడింది.

మరికొన్ని ఇబ్బందులు..

కొన్ని అర్బన్ హెల్త్ సెంటర్స్‌లో మంచి నీటి సదుపాయం కల్పించేందుకు ప్రత్యేకంగా వాటర్ ట్యాంకులు ఏర్పాటుచేశారు. అయితే, కొన్నిచోట్ల పనిచేయడం లేదు. దీంతో హెల్త్ సెంటర్స్‌కు వచ్చే రోగులకు మంచినీటి ఇబ్బందులు తప్పడం లేదు. చినవాల్తేరు ఆరోగ్య కేంద్రంలో వాటర్ ప్యూరిఫైర్ యంత్రాలు మూలకు చేరి ఉన్నాయి. వేసవిలో అర్బన్ హెల్త్ సెంటర్స్‌లో ప్రత్యేకంగా ఓఆర్ఎస్ కార్నర్స్ ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. అయితే, అనేకచోట్ల ఓఆర్ఎస్ కార్నర్ వద్ద బాటిల్ నీరు, ప్యాకెట్లు పెట్టి వదిలేశారు.

అవగాహన ఏదీ.?

ఇదిలావుంటే అవగాహన లేక ప్రజలు కూడా స్థానికంగా ఉన్న అర్బన్ హెల్త్ సెంటర్స్‌కు వెళ్లడం లేదు. ఒక్కో అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలో దాదాపు 20 వేల మందికిపైగా ఉంటారు. కానీ, బుధవారం మధ్యాహ్నం 12 గంటల వరకూ చాలాచోట్ల కనీసం 20 మంది కూడా ఆరోగ్య కేంద్రాల సేవలను వినియోగించుకోలేదు. ఒకవైపు అర్బన్ హెల్త్ సెంటర్స్ వెలవెలబోతుంటే..మరోవైపు కేజీహెచ్, విమ్స్ మాత్రం రోగులతో కిటకిటలాడుతున్నాయి. పెద్దాస్పత్రులకు తాకిడి తగ్గాలంటే స్థానికంగా ఆరోగ్య కేంద్రాల్లో అందించే వైద్య సేవలపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించడంతోపాటు సిబ్బంది నిత్యం అందుబాటులో ఉండేలా ఉన్నతాధికారులు చూడాలి.

ఏప్రిల్ 30న అప్పన్న చందనోత్సవం

... 5వ పేజీ తరువాయి

ఆదేశించారు. దర్శనం కోసం రూ.1,500, రూ.1,000, రూ.300 టికెట్లు అమ్మకం ప్రణాళికాయుతంగా చేపట్టాలన్నారు. రూ.1,500 టికెట్ కొన్న భక్తులకు నీలాద్రిగుమ్మం వరకూ అనుమతిస్తామన్నారు. ఏప్రిల్ 30 తెల్లవారుజామున 3.30 నుంచి 4.30 గంటల వరకూ అనువంశిక ధర్మకర్త, సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తులకు అంతరాలయ దర్శనాలు ఉంటాయన్నారు. వీఐపీలకు అంతరాయల దర్శనాలపై ప్రభుత్వ అధికారులతో మాట్లాడిన తరువాత నిర్ణయం తీసుకుంటామన్నారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని కొండపైకి వచ్చే వాహనాలను గణనీయంగా తగ్గించాలని పోలీసులకు సూచించారు. పరిమిత సంఖ్యలో మాత్రమే వాహనాల పాస్‌లు ఇవ్వాలని, ప్రైవేటు వాహనాలను కొండపైకి అనుమతించవద్దన్నారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా కింద నుంచి కొండపైకి, దర్శనం తరువాత కొండ పై నుంచి కిందకు బస్సులు ఏర్పాటుచేయాలన్నారు. పోలీస్ కమిషనర్ శంఖబ్రతబాగ్చి మాట్లాడుతూ కొండపై అదనపు పార్కింగ్ ప్రదేశం ఏర్పాటుచేయాలని, శాశ్వత అవుట్ పోస్టు నెలకొల్పాలని సూచించగా, సంబంధిత అధికారులకు కలెక్టర్ ఆదేశాలు ఇచ్చారు. ఇంకా ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సీపీ చెప్పారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ అన్ని శాఖలతో దేవదాయ శాఖ అధికారులు సమన్వయం చేసుకోవాలన్నారు. సమావేశంలో డీఆర్వో భవానీశంకర్, భీమిలి ఆర్డీవో సంగీత్ మాధుర్, సింహాచలం ఇన్‌చార్జి ఈవో కె.సుబ్బారావు పాల్గొన్నారు.

మహా నిర్లక్ష్యం

... 5వ పేజీ తరువాయి

వేతనాలు, జీవీఎంసీ కార్యాలయాలకు విద్యుత్ బిల్లులు, అధికారుల వాహనాలు, ప్రజారోగ్య వాహనాలకు డీజిల్ కొనుగోలు వంటివి నిలిచిపోతాయి. వీటన్నింటి కోసం ప్రతినెలా సుమారు రూ.30 కోట్ల వరకు జీవీఎంసీ వెచ్చిస్తోంది. కొత్త ఆర్థిక సంవత్సరం ఆరంభం నాటికి బడ్జెట్ ఆమోదం పొందకపోతే జీవీఎంసీ కార్యకలాపాలు నిలిచిపోతాయని, అందువల్ల తక్షణం సమావేశం ఏర్పాటుచేయాలనే డిమాండ్ మొదలైంది. బడ్జెట్ సమావేశం ఏర్పాటుచేయాలని కోరుతూ జీవీఎంసీ మేయర్ గొలగాని హరివెంకటకుమారి ఇటీవల జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్, జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్‌కు లేఖ రాశారు. మరోవైపు సీపీఎం కార్పొరేటర్ బి.గంగారావు కూడా తక్షణం బడ్జెట్ సమావేశం ఏర్పాటుచేయాలని కోరుతూ మేయర్ గొలగాని హరివెంకటకుమారికి లేఖ అందజేశారు. అలాగే జనసేనకు చెందిన 22వ వార్డు కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ కూడా జీవీఎంసీ బడ్జెట్ సమావేశం ఏర్పాటులో అధికారులు తాత్సారం చేస్తున్నారంటూ రాష్ట్ర మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్‌కుమార్‌కు లేఖ రాశారు.

అనుబంధ పరిశ్రమలు పెరిగితేనే ఉపాధి

ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ శివశంకరరావు


మాట్లాడుతున్న శివశంకరరావు

విశాఖపట్నం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ప్రధాన పరిశ్రమలకు అనుబంధంగా మరిన్ని సంస్థలు ఏర్పాటైనపుడే ఎగుమతులతో పాటు ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయని ఏపీ ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ టి.శివశంకరరావు అన్నారు. ఎంఎస్ఎంఈల ద్వారా ఎగుమతులు పెంచడానికి సీఐఐ, నీతి ఆయోగ్‌తో కలిసి రాష్ట్ర ప్రభుత్వం నోవాటెల్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. గోవాలో నౌకా నిర్మాణానికి అనుబంధంగా 22 షిప్ బిల్డింగ్ సెంటర్లున్నాయని, విశాఖపట్నంలో కూడా నౌకా నిర్మాణం జరుగుతున్నా ఆ విధమైన అనుబంధ సంస్థలు లేవన్నారు. అలాగే శ్రీకాకుళం జిల్లా టెక్కలి నుంచి బ్లూ గ్రానైట్, చీమకుర్తి నుంచి గెలాక్సీ గ్రానైట్ 80 శాతం చైనాకు ఎగుమతి అవుతోందన్నారు. అక్కడ వాటికి పాలిషింగ్ చేసి ఇతర దేశాలకు ఎగుమతి చేస్తున్నారన్నారు. ఆయా రంగాల్లో సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యం లేకపోవడం వల్ల ఇలాంటి సమస్యలు వస్తున్నాయన్నారు. ప్రభుత్వం ఎంఎస్ఎంఈలకు అద్భుతమైన పాలసీ తెచ్చిందని, దానిని క్షేత్రస్థాయికి తీసుకెళ్లి అన్ని వర్గాలకు అందేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో లక్ష వరకు ఎంఎస్ఎంఈ యూనిట్లు ఉన్నాయని, వాటిని 2030 నాటికి మూడు లక్షలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఈ సమావేశాన్ని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ జ్యోతి వెలిగించి ప్రారంభించగా కలెక్టర్ హరేంధిర ప్రసాద్, సీఐఐ ప్రతినిధులు పొన్ను స్వామి, డాక్టర్ మురళీకృష్ణ, నీతి ఆయోగ్ సలహాదారు సింగ్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల సంఘం ఎన్నికల్లో 40 మంది పోటీ

విశాఖపట్నం లీగల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా న్యాయవాదుల సంఘం ఎన్నికలకు నామినేషన్ల ప్రక్రియ ముగిసింది. బుధవారం పరిశీలన అనంతరం అభ్యర్థుల జాబితా ప్రకటించారు. అధ్యక్ష పదవికి ఎం కే.శ్రీనివాస్, నమ్మి సన్యాసిరావు, ఐఎం అహ్మద్, కార్యదర్శి పదవికి ఎల్వీ నాయుడు, రాపేటి సూర్యనారాయణ, ఏవీ సోమేశ్వరరావు పోటీ చేస్తున్నారని ఎన్నికల అధికారి బీఎం.రెడ్డి, ఉప ఎన్నికల అధికారి సీబీఎస్.లింగరాజు తెలిపారు.అన్ని పదవులకు 40 మంది బరిలో ఉన్నారు. ఈ నెల 28న ఎనికలు జరుగుతాయని, అనంతరం ఓట్లలెక్కింపు చేపట్టి,ఫలితాలువెల్లడిస్తామన్నారు.

సినిమా గైడ్

● **కోర్ట్ :** సంగం, శ్రీ వెంకటేశ్వర-1, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), నటరాజ్-1 (పెందుర్తి),
● **దిల్‌రుబా :** జగదాంబ, శ్రీకన్య, శ్రీరామా, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం),
● **శబ్దం :** సంగం, శారద, కిన్నెర,
● **మజాకా :** రమాదేవి, శ్రీరామా, కామేశ్వరి, మౌర్య (గోపాలపట్నం),
● **డ్రాగన్ :** జగదాంబ, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం),
● **తండేల్ :** శ్రీవెంకటేశ్వర, శ్రీలీలామహల్, అరుణ (పెదగంట్యాడ)
● **సంక్రాంతికి వస్తున్నాం :** మెలోడి, జగదాంబ, కాంతి, శ్రీనరసింహ (గోపాలపట్నం), తాతా, రాములమ్మ (తగరపువలస)
● **డాకు మహారాజ్ :** శరత్, మోహిని కాంప్లెక్స్, శ్రీకన్య హెవెన్ (గాజువాక), గణేష్, సప్తగిరి (తగరపువలస)
● **గేమ్ ఛేంజర్ :** మెలోడి, కామేశ్వరి, కన్యకాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-2 (పెందుర్తి) రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 23, టమాటా 15, వంకాయలు (తెలుపు)40, వంకాయలు (నలుపు) 36, బెండకాయలు 30, పచ్చిమిర్చి 32, కాకరకాయలు 40, బీరకాయలు 46, ఆనపకాయ 20, కాలీఫ్లవర్ 20, క్యాబేజి 12, క్యారెట్ 24 దొండకాయలు 34, బంగాళ దుంపలు 16, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 40, అల్లం (పాతది)50, బరబాటి 34, ముల్లంగి 22, నిమ్మకాయలు (కిలో) 100, బద్దచిక్కుడు 52, దోస కాయలు 22, వెల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 56, కీరదోస 20, కాప్సికమ్ 42, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 40 చిలగడదుంపలు 40, కంద 64, దేముడు చిక్కుడు 64, గోరు చిక్కుడు 38, కూర పెండలం 26, బ్రకోలి 45 , నూల్‌కోల్ 30, పనసపొట్టు 200, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 15, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 90, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 22, మామిడి అల్లం 64, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్)	
(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	415
విజయనగరం	419
శ్రీకాకుళం	419

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	87
లైవ్ ధర	107
విత్ స్కిన్	184
స్కిన్‌లెస్	194

కాపర్ కోసం రోడ్డు తవ్వారట!

» పోలీసుల దర్యాప్తు తీరుపై విమర్శలు
» వాస్తవాలు దాస్తున్నారంటూ ఆరోపణలు

ఎంవీపీ కాలనీ, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : ఓ సెల్‌ఫోన్, రూ. వెయ్యితో నిందితుడిని పట్టుకుంటే ప్రెస్‌మీట్ పెట్టి గొప్పగా చెప్పుకునే ఎంవీపీ నేర విభాగం పోలీసులు ఓ కేసు విషయంలో మాత్రం వివరాలు చెప్పడానికి ఇబ్బంది పడుతున్నారు. దీంతో ఈ కేసు విషయమై పలు అనుమానాలు రేకెత్తుతున్నాయి. ఎంవీపీ కాలనీ డబుల్ రోడ్డులో ఏఎస్ రాజా మైదానం ఆనుకుని ఫుట్‌పాత్, కొంత మేర రోడ్డును వారం రోజుల క్రితం అర్ధరాత్రి సమయంలో కొందరు వ్యక్తులు మెషిన్‌తో తవ్వేశారు. అదే సమయంలో అటుగా వెళుతున్న ఎంవీపీ పోలీసులు వారిని పట్టుకుని ప్రశ్నించడంతో పొంతనలేని సమాధానాలు ఇచ్చారు. దీంతో ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. దీనిపై బీఎస్ఎన్ఎల్ సహాయ ఇంజినీరు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. ఈ విషయంలో పలు అనుమానాలు రేకెత్తుతున్నా, పోలీసులు మాత్రం సరైన వివరాలు చెప్పడానికి వెనుకాడుతున్నారు. ఫిర్యాదు కాపీ లేదా ఎఫ్ఐఆర్ చూపించమన్నా, తాము ఇవ్వలేమని అంటున్నారు.

అనుమానాలివి!

రోడ్డు తవ్వి, భూ గర్భంలో ఉన్న బీఎస్ఎన్ఎల్ కేబుళ్లను బయటకు తీసి, అందులోని కాపర్‌ను ఎత్తుకుపోయి అమ్ముకోవడానికే నిందితులు ఈ పని చేశారని పోలీసులు చెబుతున్నారు. అంతవరకూ బాగానే ఉన్నా, అత్యంత పకడ్బందీగా ప్రతి రోజూ రాత్రి సమయంలో ఒక బృందంగా ఏర్పడి బీఎస్ఎన్ఎల్ కేబుల్‌ను తవ్వేశారు. అసలు ఇవి ఎక్కడ ఉన్నాయి, ఏ దిశగా వెళుతున్నాయి అన్నది స్పష్టత ఉంటే తప్ప భూగర్భంలో తవ్వే అవకాశం ఉండదు.

పైగా ఈ కేబుళ్లను ఆనుకుని 11 కేవీ విద్యుత్తు కేబుళ్లు కూడా వెళుతున్నాయి. పొరపాటున ఆ కేబుల్ పనిచేసేవారి పనిముట్లను తాకితే, ప్రమాదం భారీగా ఉంటుంది. ఇలా తవ్వుతున్నప్పుడు విద్యుత్తు శాఖ సిబ్బంది కూడా వీరిని ప్రశ్నించడం, మాకు తెలుసంటూ వారు సమాధానం ఇవ్వడం ఆశ్చర్యకరం. అలాగే సుమారు పదిహేను చోట్ల మూడు నుంచి నాలుగ డుగుల మేర తవ్వి, కేబుళ్లను బయటకు తీసి, అందులోని కాపర్‌ను బయటకు లాగేశారు. ఇది కొద్ది రోజులుగా ప్రణాళిక ప్రకారం జరిగింది. ఈ నెల అయిదో తేదీన బీఎస్ఎన్ఎల్ అధికారులకు తమ ల్యాండ్ లైన్లు పనిచేయడం లేదని ఫిర్యాదులు వచ్చాయి. దీనిపై వారు పరిశీలించగా,ధ గోతులు గమనించి, పోలీసులకు మౌఖికంగా ఫిర్యాదు చేయడం జరిగినా, ఈ గొయ్యిలు మాత్రం ఆగలేదు. ఎట్టకేలకు ఈ నెల 9న పోలీసుల నైట్ రౌండ్స్‌లో మళ్లీ వీరు తవ్వుతుంటే పట్టుకుని, అదుపులోకి తీసుకున్నారు. తర్వాత అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. అయితే ఇంత పకడ్బందీగా ఎలా తవ్వగలిగారన్న దానికి పోలీసుల నుంచి కూడా సరైన సమాధానం రాలేదు. నిందితులు ఏడుగురు ఏలూరుకు చెందినవారనిపోలీసులు చెబుతున్నారు. వారికి ఇక్కడ కేబుళ్లు ఉన్నవిషయం ఎలా తెలుసంటే ఏమో అంటున్నారు. అంటే నిందితులనువిచారించలేదా, లేక తెలిసినీనిజాలు దాస్తున్నారో అర్థం కావడం లేదు.

విశ్వసనీయ సమాచారం మేరకు.. పట్టుబడిన నిందితులు గతంలో బీఎస్ఎన్ఎల్ కాంట్రాక్టరు వద్ద పని చేసినట్లు తెలుస్తోంది. ఈ కేబుళ్లను వేసేటప్పుడు కూడా వారే పని చేశారని అంటున్నారు. ఎవరు అడిగినా బీఎస్ఎన్ఎల్ పేరునే చెప్పి, తమ పని కానిచ్చేశారు.

దీంతో ఈ వ్యవహారం వెనుక కాంట్రాక్టర్లు కూడా ఉన్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. జరిగిన వ్యవహారం వల్ల జీవీఎంసీ నిర్మించిన రోడ్లు, ఫుట్‌పాత్‌లపైన వేసిన టైల్స్ వంటివి ధ్వంసమయ్యాయి.

పోలీసులు కేసులో నష్టం రూ.90 వేలు విలువైన కేబుళ్లు అంటూ నమోదు చేశారు. కానీ ఈ నష్టం రూ.లక్షల్లో ఉంటుందని అధికారులు అంటున్నారు. దీనిపై పూర్తి స్థాయిలో విచారణ చేస్తే తప్ప నిజాలు బయటకు వచ్చే అవకాశం లేదు.

క్లౌడ్ కిచెన్స్‌లో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీ


తనిఖీ చేస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారులు

విశాఖపట్నం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): నగర పరిధిలోని పలు ప్రాంతాల్లో నిర్వహిస్తున్న క్లౌడ్ కిచెన్లపై బుధవారం ఆహార భద్రత, ప్రమాణాలశాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఎంవీపీ కాలనీ, మధురవాడ ప్రాంతాల్లో నిర్వహి స్తున్న పదికిపైగా క్లౌడ్ కిచెన్స్‌ను జిల్లా అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ నందాజీ, ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు జీవీ అప్పారావు, ఆనందరావు పరిశీలించారు.అపరిశుభ్రంగా ఉండ డాన్ని గుర్తించి ఆరు కిచెన్స్‌కు నోటీసులు జారీ చేశారు. ఆహార నమూనాలను సేక రించి పరీక్షలకు పంపించారు. తనిఖీలు నిర్వహించిన క్లౌడ్ కిచెన్స్‌లో హ్యాంగవుట్ బిర్యానీస్, మెగా భోజనం, అయిప్స్ కిచెన్, ఆంధ్ర బిర్యానీస్, రాజుల రుచులు, పక్కా హైదరాబాదీ, రాజూస్ కిచెన్ ఉన్నాయి. నిర్వాహకులు తప్పనిసరిగా ఎఫ్ఎస్ ఎస్ఏఐ లైసెన్సులు తీసుకోవాలని, నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. లేదంటే కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆస్తి విలువ ఆధారిత పన్ను విధానాన్ని రద్దుచేయాలి

వార్వా, నివాస్ ఆధ్వర్యంలో రెసిడెన్షియల్ వెల్ఫేర్ సంఘాల ఆందోళన

సిరిపురం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : ఆస్తి విలువ ఆధారిత పన్ను విధానాన్ని రద్దు చేయాలని, అపార్ట్‌మెంట్ వాసుల సమస్యలను పరిష్కరించాలని వక్తలు డిమాండ్ చేశారు. బుధవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద వార్వా, నివాస్ ఆధ్వర్యంలో రెసిడెన్షియల్ వెల్ఫేర్ సంఘాల సభ్యులు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ధర్నా నిర్వహించారు. ధర్నాను ప్రారంభించిన నాగార్జున యూనివర్సిటీ మాజీ వీసీ బాలమోహన్‌దాస్ మాట్లాడుతూ అయిదేళ్లకు ఒకసారి అద్దె విలువపై లెక్కించి, పెంచాల్సిన ఇంటి పన్ను, క్యాపిటల్ విలువ ఆధారంగా, రిజిస్ట్రేషన్ చార్జీల పెంపుదలతో, పెనాల్టీలతో లెక్కించి ప్రతి ఏటా పెంచే ఆస్తిపన్నుగా మార్చడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. వార్వా నివాస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎన్.ప్రకాశరావు, బీబీ గణేష్, నారాయణమూర్తి మాట్లాడుతూ విద్యుత్ సర్దుబాటు ఛార్జీలు, ప్రీపెయిడ్ రీచార్జి, పీక్ సమయాల్లో విభిన్న రేట్లలో విద్యుత్ బిల్లులు వసూలు చేసి విద్యుత్ వ్యవస్థను అవినీతిమయం చేస్తున్నారని మండిపడ్డారు. నగరంలోని పార్కులు, స్పోర్ట్స్ స్టేడియాలను ప్రభుత్వమే నడపాలన్నారు. ఆస్తిపన్ను రద్దు చేసి అద్దె ఆధారిత ఇంటిపన్ను పునరుద్ధరించాలని కోరుతూ సంతకాలు చేసి నగర్ మేయర్‌కు అందజేశారు. ఈ ధర్నాలో సంఘం పూర్వ అధ్యక్షులు సీహెచ్ఎల్ఎన్ శాస్త్రి, నివాస్ అధ్యక్షులు బి.గురప్ప, శర్మ, త్రినాథస్వామి, రఘురామ్, రమణ, తులసీరామ్ పాల్గొన్నారు.

చందనయాత్రలోగా 'ప్రసాద్' పనులు పూర్తిచేయండి

కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ ఆదేశం


పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్, అధికారులు


కప్పస్తంభం వద్ద కలెక్టర్ హరింధిర ప్రసాద్

సింహాచలం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : కేంద్రం మంజూరు చేసిన రూ.54.4 కోట్లతో పర్యాటక శాఖ సింహగిరిపై చేపడుతున్న ప్రసాద్ పథకం పనులను సింహాద్రి అప్పన్న నిజరూపదర్శనం (చందనోత్సవం) సమయానికి పూర్తిచేయాలని కలెక్టర్ ఎంఎన్ హరేంధర్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. దేవస్థానం ఈవో కె.సుబ్బారావుతో కలిసి బుధవారం ప్రసాద్ పనుల క్షేత్రపరిశీలన చేపట్టారు. ఈ సందర్భంగా దుకాణాల సముదాయం, క్యూలు, పర్యాటక సమాచార కేంద్రం, పార్కుల అభివృద్ధి పనులను పరిశీలించి తగు సూచనలిచ్చారు. పనుల వేగం పెంచి చందనోత్సవం (ఏప్రిల్ 30)కన్నా ముందుగానే పూర్తిచేయాలన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని, సూచించారు. ప్రసాద్ పనుల గురించి ముందుగా సిద్ధం చేసిన ప్రణాళిక ప్రకారం ఈవో సుబ్బారావు కలెక్టర్‌కు వివరించారు. ప్రస్తుత పనుల పురోగతి, త్వరలో చేపట్టనున్న మరిన్ని అభివృద్ధి పనుల వివరాలను తెలిపారు. రానున్న చందనోత్సవ ఏర్పాట్లపై కూడా ప్రాథమిక చర్చ సాగించారు.

అంతకుముందు కలెక్టర్ హరీంధరప్రసాద్.. లక్ష్మీనృసింహస్వామిని దర్శించుకున్నారు. ఆయనకు దేవస్థానంఈవో కె.సుబ్బారావు అధికార లాంఛనాలతో ఆహ్వానం పలికారు. కప్పస్థంభ ఆలింగనం చేసుకున్న కలెక్టర్ గోత్రనామాలతో అంతరాలయంలో అర్చకులు పూజలు చేసి శేషవస్త్రాన్ని పర్యవేట్టంగా చుట్టారు. గోదాదేవి అమ్మవారి దర్శనం తరువాత పండితులు వేదాశీర్వచనాలీయగా, ఈఓ శాలువతో సత్కరించి జ్ఞాపికగా స్వామివారి ఫొటోను, స్వామివారి ప్రసాదాలను అందజేశారు.

కార్యక్రమంలో దేవస్థానం ఈఈలు డీజీ శ్రీనివాసరాజు, బి.రాంబాబు, డీఈఈ డీవీఎస్ రామరాజు (హరి), ఏఈలు సన్యాసిరావు, రవి రాజ్, బాబ్జీ, టూరిజం శాఖ ఏఈ మదన్ పాల్గొన్నారు.

సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ

ఎంవీపీ కాలనీ, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : శ్రీసత్యసాయి ఉజ్వల్ జీవన్ ఫర్ బెటర్ లివింగ్ కార్యక్రమంలో భాగంగా నగరంలోని రైల్వే ఏరియా శ్రీసత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఏపీఈఏపీ సెట్, పాలీసెట్‌లకు ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్టు జిల్లా సత్యసాయి సేవా సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. తరగతులను అక్కయ్యపాలెం పోర్టు స్టేడియం ఇన్ గేట్ ఎదురుగా గల ఎన్జీజీవోఎస్ కాలనీలోని శ్రీసాయి సౌధ మందిర్‌లో నిర్వహించనున్నట్టు సంస్థ తెలిపింది. ఇంటర్ విద్యార్థుల కోసం ఏపీఈఏపీసెట్ ఈ నెల 24 నుంచి, పదో తరగతి విద్యార్థుల కోసం పాలీసెట్ తరగతులు ఏప్రిల్ 1 నుంచి ప్రారంభించనున్నట్టు పేర్కొంది. ఇతర వివరాల కోసం ఫోన్ నెంబర్లు 92480 52173, 96668 08446లో సంప్రదించవచ్చు.

లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తికి ఐదేళ్ల జైలు

విశాఖపట్నం లీగల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): చిన్నారి పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తికి ఐదేళ్ల జైలు శిక్ష విధిస్తూ పోక్సో ప్రత్యేక కోర్టు జడ్జి బి.ఆనంది బుధవారం తీర్పుచెప్పారు. జైలు శిక్షతోపాటు రూ. 2వేల జరిమాచా చెల్లించాలని, లేదంటే మరో మూడు నెలల సాధారణ జైలు శిక్ష అనుభవించాలని ఆదేశించారు.

పబ్లిక్ ప్రాసిక్యూటరు బత్తి రాజశేఖర్ తెలిపిన వివరాలివి... గాజువాక సుధామెడికల్ సమీపంలో ఉంటున్న గౌరీశంకర్(45) కాలకృత్యాలు తీర్చుకునేందుకు వచ్చిన చిన్నారిపై అసభ్యంగా ప్రవర్తించాడు. బాలిక కేకలు వేయడంతో తల్లితండ్రులు వచ్చి గాజువాక పోలీసులకు ఫిర్యాదుచేశారు.


పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదుచేసి కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి శిక్ష విధించారు.

హత్య కేసులో నిందితుడికి 14 ఏళ్ల జైలు, జరిమానా

విశాఖ లీగల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): హత్య కేసులో నిందితుడికి 14 ఏళ్ల జైలు శిక్ష, రూ.2 వేల జరిమానా విధిస్తూ నగరంలోని 12వ అదనపు జిల్లా న్యాయమూర్తి పి.గోవర్ధన్ బుధవారం తీర్పు ఇచ్చారు. జరిమానా చెల్లించకపోతే అదనంగా మూడు నెలల సాధారణ శిక్ష అనుభవించాలని తీర్పులో స్పష్టం చేశారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ వి.దేవానందరావు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి.. నిందితుడు మోహన్ పూజారి (59) కర్ణాటక రాష్ట్రంలోని ఉడిపి జిల్లా అంబటిపూడి గ్రామస్థుడు. అక్కడి నుంచి ఉమ్మడి విశాఖ జిల్లా ముంచింగ్‌పుట్ మండలం జర్సు పంచాయతీ సంతవీధికి వచ్చి యాచన చేసుకునేవాడు. అతడికి గంజాయి సేవించే అలవాటు ఉండేది. జర్సు పంచాయతీ సంతవీధి వాసి అయిన వంతల రామారావు 2024 మార్చి 3న తన ఇంటి నుంచి సంత వీధి ప్రాంతానికి పాల పిండి అమ్మడానికి వెళ్లాడు. ఉదయం 11 గంటల సమయంలో యాచకుడు రామారావును గంజాయి అడగడంతో ఇద్దరూ ఘర్షణ పడ్డారు. సాయంత్రం మరోసారి ఇద్దరి మధ్య ఘర్షణ జరిగింది. దీంతో నిందితుడు పూజారి బలమైన కత్తితో రామారావును కడుపులో పొడవడంతో రక్తపు మడుగు మధ్య అక్కడికక్కడే మృతిచెందాడు. రామారావు తండ్రి బలరాం జి.మాడుగుల పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అప్పటి సీఐ ఎస్.రమేష్ కేసు దర్యాప్తు చేసి నిందితుడిపై భారతీయ శిక్షాస్మృతి 302 సెక్షన్ కింద కేసు నమోదు చేశారు. అభియోగ పత్రాన్ని దాఖలు చేయగా నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పు ఇచ్చారు.

రామానాయుడు స్టూడియో భూములు వెనక్కి తీసుకోండి

» అసెంబ్లీలో తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు




విశాఖపట్నం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): విశాఖ, భీమిలి బీచ్‌రోడ్డు తిమ్మాపురంలో రామానాయుడు స్టూడియోకు కేటాయించిన భూములను ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు కోరారు. ఈ మేరకు బుధవారం అసెంబ్లీలో ఆయన మాట్లాడుతూ సినిమా చిత్ర నిర్మాణాల కోసం 2003లో అప్పటి ప్రభుత్వం తిమ్మాపురం కొండపై రామానాయుడు స్టూడియోకు భూములు కేటాయించిందన్నారు. రెవెన్యూ శాఖ బీఎస్‌వో -24 నిబంధనల మేరకు చిత్రనిర్మాణాల కోసం భూములు కేటాయించారని, అయితే గత ప్రభుత్వ హయాంలో కొంత భూమిలో ఇళ్ల నిర్మాణాలకు వీలుగా లేఅవుట్ అభివృద్ధిచేశారని, దీనిపై తాను సుప్రీంకోర్టులో కేసు దాఖలు చేశానన్నారు. భూముల కేటాయింపు కోసం ఉద్దేశించిన బీఎస్‌వో 24ను ఉల్లంఘించినందునందున స్టూడియోకు ఇచ్చిన భూములు స్వాధీనం చేసుకోవాలన్నారు. ఇదే కారణంతో ఎండాడలో హయగ్రీవ సంస్థకు భూ కేటాయింపులు రద్దు చేశారని గుర్తుచేశారు. నగరంలో ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్న పేదలకు చెందిన స్థలాల కమబద్ధీకరణకు 2018లో ఇచ్చిన పట్టాలకు రెండేళ్లలో ఇవ్వాల్సిన కన్వేయన్స్ డీడ్స్ ఇప్పటివరకు ఇవ్వలేదన్నారు.

రెండు నెలల క్రితం విశాఖ జిల్లా ఎమ్మెల్యేలతో సీఎం చంద్రబాబునాయుడు సమావేశమైనపుడు 100 గజాలలోపు పేదల ఇళ్ల స్థలాలు క్రమబద్ధీకరించాలని హామీ ఇచ్చారన్నారు. యూఎల్సీ భూముల క్రమబద్ధీకరణలో పదేళ్లకు బదులు రెండేళ్లకే కన్వేయన్స్ డీడ్స్ ఇవ్వడానికి సీఎం అంగీకరించినా ఇంతవరకు జీవో రాలేదన్నారు. రెవెన్యూ మంత్రి జోక్యం చేసుకుని జీవోలు జారీ చేయాలన్నారు.

ఏటీఎం కార్డులను మార్పు చేసి నగదు డ్రా చేస్తున్న దొంగ అరెస్టు

» రూ.లక్షా 1,43,000 స్వాధీనం
» నిందితుడిపై ఇప్పటికే 5 పోలీస్ స్టేషన్లలో కేసులు


వివరాలు తెలుపుతున్న జోన్-2 క్రైమ్ ఏసీపీ లక్ష్మణ రావు. చిత్రంలో సీఐ శ్రీనివాసరావు, తదితరులు


నిందితుడు వీరయ్య చౌదరి

గాజువాక, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఏటీఎం కార్డులను మార్పు చేసి నగదు విత్‌డ్రా చేస్తున్న దొంగను గాజువాక క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. గాజువాక పోలీస్ స్టేషన్ కాంప్లెక్స్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జోన్-2 క్రైమ్ ఏసీపీ డి.లక్ష్మణరావు వివరాలను వెల్లడించారు. ఈ ఏడాది జనవరి 18న మింది ప్రాంతానికి చెందిన దాడి ఆనంద్ సన్యాసి తన భార్య కార్డుతో గాజువాకలోని లక్ష్మీకాంత్ థియేటర్ వద్ద గల ఏటీఎం కేంద్రంలో నగదు డ్రా చేసేందుకు యత్నించారు. ఆ సమయంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి అక్కడకు వచ్చి సహాయం చేస్తున్నట్టు నటించి సన్యాసి వద్దనున్న కార్డును తీసుకుని మరో కార్డును ఇచ్చాడు. అయితే మళ్లీ అదే నెల 20న నగదు డ్రా చేసేందుకు సన్యాసి ఏటీఎం వద్దకు వెళ్లగా ఆ కార్డు పనిచేయలేదు. దీంతో ఆయన చట్టివానిపాలెంలోని బ్యాంకుకు వెళ్లి ఆరా తీయగా ఆ ఏటీఎం కార్డు నుంచి రూ.75 వేలు డ్రా చేసినట్టు సిబ్బంది తెలిపారు. ఈ మేరకు సన్యాసి గాజువాక క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు సాంకేతిక ఆధారాలతో ఏటీఎం కార్డును మార్చేసిన మర్రిపాలేనికి చెందిన ముప్ప వీరయ్యచౌదరి (41)ని గాజువాక మోహిని థియేటర్ ఎదురుగా ఉన్న ఎస్‌బీఐ ఏటీఎం వద్ద అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు. నిందితుడు పాత నేరస్థుడేనని, ఆయన వద్ద నుంచి రూ.1,43,000, వాచ్‌ను స్వాధీనం చేసుకున్నట్టు ఏసీపీ లక్ష్మణరావు తెలిపారు. నిందితుడిపై గాజువాక, పెందుర్తి, గోపాలపట్నం, కంచరపాలెం, ఎయిర్‌పోర్టు పోలీస్ స్టేషన్‌లో కేసులు ఉన్నాయన్నారు. సమావేశంలో సీఐ కె.శ్రీనివాసరావు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

పిచ్చుకలను పరిరక్షించుకోవాలి

డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ విజయబాబు


వరి కంకులు, నీళ్ల తొట్టెలతో విద్యార్థులు

మద్దిలపాలెం, మార్చి19 (ఆంధ్రజ్యోతి) : అంతరించుపోతున్న పిచ్చుకలను పరిరక్షించాలని డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఐ.విజయబాబు పిలుపునిచ్చారు. గ్రీన్ క్లైమెట్ ఎన్‌జీవో ఆధ్వర్యంలో బుధవారం కళాశాలలో ప్రపంచ పిచ్చుకల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విజయబాబు మాటాడుతూ.. వేసవిలో పక్షుల కోసం మంచినీటిని అందుబాటులో ఉంచాలన్నారు. పిచ్చుకల కోసం

గూళ్లు ఏర్పాటు చేయాలన్నారు. గ్యాస్ ముగ్గుతో ముగ్గులు వేస్తే పర్యావరణానికి ముప్పని బియ్యం పిండితో ముగ్గులు వేయాలని సూచించారు. గ్రీన్ క్లైమెట్ వ్యవస్థాపక కార్యదర్శి జేవీ రత్నం మాట్లాడుతూ తమ సంస్థ ప్రారంభించిన 2000 నుంచి ఇప్పటి వరకు 2.8 లల క్షల పిచ్చుకల గూళ్లు ఏర్పాటు చేశామన్నారు. పక్షులు, వన్యప్రాణుల కోసం 6 లక్షల మట్టి పాత్రలు, ప్రతీ ఏడాది 5వేల కుచ్చులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ ఏడాది 10 వేల పిచ్చుకల గూళ్లు, పక్షులు, జంతువులకు నీటి కోసం లక్ష మట్టి పాత్రలు సమకూర్చుతున్నట్టు చెప్పారు. అనంతరం విద్యార్థులకు వరికంకులు, గూళ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జయ, అధ్యాపకులు పద్మావతి, స్వామినాయుడు, రామలక్ష్మణ్, సుజాత, ఏయూ సోషల్ వర్క్ విద్యార్థులు కే దాత్రీ, నిఖిత, భానుప్రసాద్, గ్రీన్ వలంటీర్లు రాజేశ్వరి, కృష్ణకుమారి పాల్గొన్నారు.

'ఎస్సీ వర్గీకరణను స్వాగతిస్తున్నాం'

డాబాగార్డెన్స్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): షెడ్యూల్డు కులాల వర్గీకరణపై ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన రాష్ట్ర క్యాబినెట్‌లో ఈ నెల 15న చేసిన తీర్మానాన్ని స్వాగతిస్తున్నామని ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మున్నంగి నాగరాజు తెలిపారు. బుధవారం డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజీవ్ రంజన్ మిశ్రా కమీషన్ ఇచ్చిన నివేదికను అధ్యయనం చేసిన అయిదుగురు మంత్రుల సబ్‌కమిటీ ఇచ్చిన రిపోర్టు ఆధారంగా వర్గీకరణకు అనుకూలంగా తీర్మానాన్ని ఆమోదించారన్నారు. ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ 59 ఉపకులాలకు జనాభా నిష్పత్తి ప్రకారం వర్గీకరణ జరగాలని కోరుతూ 30 సంవత్సరాల నుంచి ఉద్యమం చేస్తున్న విషయాన్ని గుర్తుచేశారు. ఇందుకు అనుకూలంగా నివేదిక ఇచ్చిందన్నారు. రిజర్వేషన్ అమలు ప్రక్రియ నెల రోజుల్లో చేయడానికి కృషి చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు ఎ.దీపిక్, రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.సురేష్, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

అంధకారంలో పార్కులు


విద్యుత్ వెలుగులు లేక బోసిపోయిన అక్కయ్యపాలెంలోని పిల్లల పార్కు


గ్రీన్‌బెల్టు పార్కులో చీకటిలోనే నడకమార్గం

అక్కయ్యపాలెం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): అక్కయ్యపాలెం నాలుగు వరుసల రహదారికి ఆనుకుని ఉన్న గ్రీన్‌బెల్ట్, పిల్లల పార్కుల్లో అయిదు రోజులుగా అంధకారం రాజ్యమేలుతోంది. విద్యుత్ దీపాలు వెలగకపోవడంతో లోపల చీకట్లు అలముకుని వాకర్లు, పిల్లలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉదయం, సాయంత్రం సమయాల్లో వాకర్లు, పిల్లలు ఈ పార్కులకు వచ్చి వ్యాయామం, వాకింగ్ చేస్తుంటారు. పిల్లలు ఆటలాడుకుని సరదాగా గడుపుతుంటారు. గత కొన్ని రోజులుగా చిమ్మచీకట్లు కమ్ముకోవడం, సంబంధిత విభాగం వారు పట్టించుకోకపోవడంతో పార్కులకు వచ్చినవారు నిరుత్సాహం చెందుతున్నారు. అధికారుల పర్యవేక్షణ లోపాన్ని ఈ ఘటన చాటుతోందని వాకర్లు అంటున్నారు. పార్కులను ఏర్పాటు చేసి గాలికొదిలేయకుండా వాటి నిర్వహణ కూడా చేపట్టాలని కోరుతున్నారు. కొన్ని నెలల క్రితమే ఈ పార్కులను ప్రారంభించారు. ఇందులో అమర్చిన విద్యుత్ దీపాలు వెలుగులు విరజిమ్మాయి. ప్రధాన రహదారి పక్కనే ఈ పార్కులు ఉండడంతో బాటసారులను కూడా ఈ పార్కులు ఆకట్టుకునేవి. ఇప్పటికైనా అధికారులు స్పందించి పార్కుల్లో చీకట్లు తొలగించాలని కోరుతున్నారు.

'ఉక్కు పరిశ్రమ విక్రయ ప్రతిపాదన విరమించుకోవాలి'

మహారాణిపేట, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం విశాఖ ఉక్కు పరిశ్రమకు రూ.11,440 కోట్ల ప్యాకేజీ ఇచ్చి ప్లాంట్‌ను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించే కుట్ర చేస్తోందని, ఈ ప్రయత్నాన్ని కూటమి పార్టీల నేతలు అడ్డుకోవాలని జిల్లా అఖిల పక్ష కార్మిక, ప్రజా సంఘాల జేఏసీ ఛైర్మన్ ఎం. జగ్గునాయుడు డిమాండ్ చేశారు. జగదాంబ సమీపంలోని సీఐటీయూ కార్యాలయంలో బుధవారం జిల్లా అఖిలపక్ష కార్మిక సంఘాల జేఏసీ రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జేఏసీ నేతలు ప్రచార కరపత్రాన్ని విడుదల చేశారు. ఇచ్చిన ప్యాకేజీ డబ్బును ప్లాంట్ ఉత్పత్తి, యంత్రాలు, ముడి సరకులు, కార్మికుల జీతభత్యాలకు కేటాయించకుండా అప్పులు చెల్లించారని ఆక్షేపించారు. కేవలం రూ.3 వేల కోట్లతో శాశ్వత, కాంట్రాక్ట్ ఉద్యోగులను తొలగించి, పూర్తిస్థాయి ఉత్పత్తులు రాబట్టాలని షరతు పెట్టారని పేర్కొన్నారు. 1,100 మంది శాశ్వత కార్మికులు, 5,400 మంది కాంట్రాక్ట్ ఉద్యోగుల తొలగింపునకు సిద్ధపడ్డారని విమర్శించారు. ఉక్కు పరిశ్రమను అమ్మేయాలన్న ఆలోచనను విరమించుకోవాలని, ఉద్యోగులెవరినీ తొలగించవద్దని, ప్లాంట్‌కు సొంతగనులు కేటాయించేలా కేంద్రంపై ఒత్తిడి తేవాలని కూటమి నాయకులను కోరారు. మోదీ కుట్రలు బయటపెట్టేందుకు గురువారం ప్రభుత్వ, ప్రైవేటు పరిశ్రమలు, బస్టాప్‌లు, బజార్ల వద్ద పెద్దఎత్తున కరపత్రాలు పంపిణీ చేస్తామని తెలిపారు. ఏప్రిల్ 1న జీవీఎంసీ వద్ద మహాధర్నా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. స్టీల్‌ప్లాంట్ కార్మికులకు సంపూర్ణ మద్దతు అందిస్తామని జగ్గునాయుడు ప్రకటించారు. ఈ సమావేశంలో నాయకులు జీజేఎస్ అచ్యుతరావు, ఆర్‌కేవీఎస్ కుమార్, ఎస్.జ్యోతీశ్వరరావు, బూసి వెంకటరావు, సురేష్, రమణ, లక్ష్మి, సుహాసిని, అప్పారావు, నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.


రౌండ్‌టేబుల్ సమావేశంలో కరపత్రాన్ని విడుదల చేస్తున్న నాయకులు

న్యాయవాదుల సంఘం ఎన్నికల్లో 40 మంది పోటీ

విశాఖపట్నం లీగల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా న్యాయవాదుల సంఘం ఎన్నికలకు నామినేషన్ల ప్రక్రియ ముగిసింది. బుధవారం పరిశీలన అనంతరం అభ్యర్థుల జాబితా ప్రకటించారు. అధ్యక్ష పదవికి ఎంకే.శ్రీనివాస్, నమ్మి సన్యాసిరావు, ఐఎం అహ్మద్, కార్యదర్శి పదవికి ఎల్పీ నాయుడు, రాపేడు సూర్యనారాయణ, ఏవీ సోమేశ్వరరావు పోటీ చేస్తున్నారని ఎన్నికల అధికారి బీఎం.రెడ్డి, ఉప ఎన్నికల అధికారి సీబీఎస్. లింగరాజు తెలిపారు. అన్ని పదవులకు మొత్తం 40 మంది బరిలో ఉన్నారు. ఈనెల 28న ఎన్నికలు జరుగుతాయని, అనంతరం ఓట్ల లెక్కింపు చేపట్టి, ఫలితాలు వెల్లడిస్తామన్నారు.

హత్య కేసులో నిందితుడికి 14 ఏళ్ల జైలు, జరిమానా

విశాఖ లీగల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): హత్య కేసులో నిందితుడికి 14 ఏళ్ల జైలు శిక్ష, రూ.2 వేల జరిమానా విధిస్తూ నగరంలోని 12వ అదనపు జిల్లా న్యాయమూర్తి పి.గోవర్ధన్ బుధవారం తీర్పు ఇచ్చారు. జరిమానా చెల్లించకపోతే అదనంగా మూడు నెలల సాధారణ శిక్ష అనుభవించాలని తీర్పులో స్పష్టం చేశారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ వి.దేవానందరావు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి.. నిందితుడు మోహన్ పూజారి (59) కర్ణాటక రాష్ట్రంలోని ఉడిపి జిల్లా అంబటిపూడి గ్రామస్థుడు. అక్కడి నుంచి ఉమ్మడి విశాఖ జిల్లా ముంచింగ్‌పుట్ మండలం జర్సు పంచాయతీ సంతవీధికి వచ్చి యాచన చేసుకునేవాడు. అతడికి గంజాయి సేవించే అలవాటు ఉండేది. జర్సు పంచాయతీ సంతవీధి వాసి అయిన వంతల రామారావు 2024 మార్చి 3న తన ఇంటి నుంచి సంత వీధి ప్రాంతానికి పాలపిండి అమ్మడానికి వెళ్లాడు. ఉదయం 11 గంటల సమయంలో యాచకుడు రామారావును గంజాయి అడగడంతో ఇద్దరూ ఘర్షణ పడ్డారు. సాయంత్రం మరోసారి ఇద్దరి మధ్య ఘర్షణ జరిగింది. దీంతో నిందితుడు పూజారి బలమైన కత్తితో రామారావును కడుపులో పొడవడంతో రక్తపు మడుగు మధ్య అక్కడికక్కడే మృతిచెందాడు. రామారావు తండ్రి బలరాం జి.మాడుగుల పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అప్పటి సీఐ ఎస్.రమేష్ కేసు దర్యాప్తు చేసి నిందితుడిపై భారతీయ శిక్షాస్మృతి 302 సెక్షన్ కింద కేసు నమోదు చేశారు. అభియోగ పత్రాన్ని దాఖలు చేయగా నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పు ఇచ్చారు.

లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తికి ఐదేళ్లజైలు

విశాఖపట్నం లీగల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): చిన్నారి పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తికి ఐదేళ్ల జైలు శిక్ష విధిస్తూ పోక్సో ప్రత్యేక కోర్టు జడ్జి బి.ఆనంది బుధవారం తీర్పుచెప్పారు. జైలు శిక్షతోపాటు రూ.2వేల జరిమానా చెల్లించాలని, లేదంటే మరో మూడు నెలల సాధారణ జైలు శిక్ష అనుభవించాలని ఆదేశించారు. పబ్లిక్ ప్రాసిక్యూటరు బత్తి రాజశేఖర్ తెలిపిన వివరాలివి... గాజువాక సుధామెడికల్ సమీపంలో ఉంటున్న గౌరీశంకర్(45) కాలకృత్యాలు తీర్చుకునేందుకు వచ్చిన చిన్నారిపై అసభ్యంగా ప్రవర్తించాడు. బాలిక కేకలు వేయడంతో తల్లిదండ్రులు వచ్చి గాజువాక పోలీసులకు ఫిర్యాదుచేశారు. పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదుచేసి కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి శిక్ష విధించారు.

జాతీయ విలువిద్య పోటీలకు విశాఖ జిల్లా క్రీడాకారులు

విశాఖపట్నం స్పోర్ట్స్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): జాతీయ మినీ, కిడ్స్ విలువిద్య (ఆర్చరీ) చాంపియన్‌షిప్ టోర్నీలో పాల్గొనే ఉమ్మడి విశాఖ జిల్లా క్రీడాకారుల జాబితాను బుధవారం ప్రకటించారు. గుంటూరులో జరిగే ఈ టోర్నీ ఇండియన్ రౌండ్, రికర్వ్, కాంపౌండ్ ఈవెంట్లలో వివిధ వయసుల వారి బృందాలలో 12 మంది చిన్నారులు ప్రాతినిధ్యం వహిస్తున్నారని జిల్లా విలువిద్య క్రీడా సంఘం కార్యదర్శి కె.నిషాంత్ తెలిపారు. ఇండియన్ రౌండ్ బాలుర విభాగంలో సోధేరామ్ చైతన్య, వంతల వసంత సాయితేజ, నల్లి తేజేశ్వరరావు, సిరిపురి వెంకట శరత్ వర్మ... బాలికల విభాగంలో సాయి మనస్వి, కె.చోద్య నందిత ప్రాతినిధ్యం వహిస్తారని పేర్కొన్నారు. అలాగే రికర్వ్ బాలికల విభాగంలో ఎస్.తన్మయ శ్రీఎస్.కన్విక్‌శ్రీ, బాలుర విభాగంలో ఎల్.శాత్విక్ సుధీప్... కాంపౌండ్ బాలికల కేటగిరీలో ఊడి యశస్వి, ఆద్య వేమూరి ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. జిల్లా విలువిద్య క్రీడా సంఘం అధ్యక్షుడు పి.సూర్యనారాయణరెడ్డి, ఉపాధ్యక్షుడు పి.సత్యనారాయణ, ఇతర ప్రతినిధులు చిన్నారులను అభినందించారు.

దివ్యాంగ క్రికెటర్లకు ఉపాధి అవకాశాలు

విశాఖపట్నం స్పోర్ట్స్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగ క్రికెటర్లతోపాటు అర్హత కలిగిన క్రికెటేతర దివ్యాంగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఏఎంటీజెడ్, ఐడియా, సాక్షం వంటి ప్రముఖ సంస్థలు ముందుకు వచ్చాయని కౌన్సిల్ కార్యదర్శి సురవరపు రామన్ ఒక ప్రకటనలో తెలిపారు. తొలి దశలో విశాఖ, అనకాపల్లికి చెందిన దివ్యాంగులకు ప్రాధాన్యత ఇస్తూ ఉద్యోగవకాశాలు ఇవ్వనున్నారని పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత గల దివ్యాంగ క్రికెటర్లు, క్రికెటేతర దివ్యాంగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, వివరాలకు ఫోన్:7780167625లో సంప్రదించాలని డీఏసీసీ కమిటీ ఛైర్మన్ యడ్లపల్లి సూర్యనారాయణ, సభ్యుడు ఇల్లూరి అజయ్‌కుమార్ రెడ్డి తెలిపారు.

క్లౌడ్ కిచెన్స్‌లో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీ

విశాఖపట్నం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): నగర పరిధిలోని పలు ప్రాంతాల్లో నిర్వహిస్తున్న క్లౌడ్ కిచెన్లపై బుధవారం ఆహార భద్రత, ప్రమాణాలశాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఎంవీపీ కాలనీ, మధురవాడ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న పదికిపైగా క్లౌడ్ కిచెన్స్‌ను జిల్లా అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ నందాజీ, ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు జీవీ అప్పారావు, ఆనందరావు పరిశీలించారు. అపరిశుభ్రంగా ఉండడాన్ని గుర్తించి ఆరు కిచెన్స్‌కు నోటీసులు జారీ చేశారు. ఆహార నమూనాలను సేకరించి పరీక్షలకు పంపించారు. తనిఖీలు నిర్వహించిన క్లౌడ్ కిచెన్స్‌లో హ్యాంగవుట్ బిర్యానీస్, మెగా భోజనం, అయిప్స్ కిచెన్, ఆంధ్ర బిర్యానీస్, రాజుల రుచులు, పక్కా హైదరాబాదీ, రాజూస్ కిచెన్ ఉన్నాయి. నిర్వాహకులు తప్పనిసరిగా ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్సులు తీసుకోవాలని, నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. లేదంటే కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అనుబంధ పరిశ్రమలు పెరిగితేనే ఉపాధి

ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ శివశంకరరావు

విశాఖపట్నం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ప్రధాన పరిశ్రమలకు అనుబంధంగా మరిన్ని సంస్థలు ఏర్పాటైనపుడే ఎగుమతులతో పాటు ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయని ఏపీ ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ టి.శివశంకరరావు అన్నారు. ఎంఎస్ఎంఈల ద్వారా ఎగుమతులు పెంచడానికి సీఐఐ, నీతి ఆయోగ్‌తో కలిసి రాష్ట్ర ప్రభుత్వం నోవాటెల్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. గోవాలో నౌకా నిర్మాణానికి అనుబంధంగా 22 షిప్ బిల్డింగ్ సెంటర్లున్నాయని, విశాఖపట్నంలో కూడా నౌకా నిర్మాణం జరుగుతున్నా ఆ విధమైన అనుబంధ సంస్థలు లేవన్నారు. అలాగే శ్రీకాకుళం జిల్లా టెక్కలి నుంచి బ్లూ గ్రానైట్, చీమకుర్తి నుంచి గెలాక్సీ గ్రానైట్ 80 శాతం చైనాకు ఎగుమతి అవుతోందన్నారు. అక్కడ వాటికి పాలిషింగ్ చేసి ఇతర దేశాలకు ఎగుమతి చేస్తున్నారన్నారు. ఆయా రంగాల్లో సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యం లేకపోవడం వల్ల ఇలాంటి సమస్యలు వస్తున్నాయన్నారు. ప్రభుత్వం ఎంఎస్ఎంఈలకు అద్భుతమైన పాలసీ తెచ్చిందని, దానిని క్షేత్రస్థాయికి తీసుకెళ్లి అన్ని వర్గాలకు అందేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో లక్ష వరకు ఎంఎస్ఎంఈ యూనిట్లు ఉన్నాయని, వాటిని 2030 నాటికి మూడు లక్షలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఈ సమావేశాన్ని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ జ్యోతి వెలిగించి ప్రారంభించగా కలెక్టర్ హరేంధిర ప్రసాద్, సీఐఐ ప్రతినిధులు పొన్ను స్వామి, డాక్టర్ మురళీకృష్ణ, నీతి ఆయోగ్ సలహాదారు సింగ్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న శివశంకరరావు

మెట్రో రైల్ సీఎంపీలకు కేంద్రం నిధులు మంజూరు

... 5వ పేజీ తరువాయి

సూచనలతో సీఎంపీ కోసం కన్సల్టెన్సీ సంస్థను టెండర్ల ద్వారా ఏపీ మెట్రో రైలు కార్పొరేషన్ ఎంపిక చేసిందని తెలిపారు. రెండు నగరాల్లో సీఎంపీ రూపకల్పన కోసం సిస్ట్ర ఎంవీఏ సంస్థను ఎంపిక చేశామన్నారు. విశాఖలో రూ.87.47 లక్షలు, విజయవాడలో రూ.81.68 లక్షలతో ప్లాన్ రూపొందించనున్నట్టు తెలిపారు. ఆయా పనుల కోసం ఏపీ మెట్రో రైల్ కార్పొరేషన్‌కు సెంట్రల్ అర్బన్ ట్రాన్స్‌పోర్ట్ విభాగం నిధులు మంజూరు చేసిందన్నారు.

గజం రూ.75,560

... 5వ పేజీ తరువాయి

గజాల వరకు పెట్టారు. ధర బాగా తగ్గించారు. ఆ ప్రాంతంలో ప్రభుత్వం రిజిస్ట్రేషన్ ధర గజం రూ.50 వేలు ఉండగా, రాజీవ్ స్వగృహ అధికారులు గజం రూ.60 వేలకే అప్‌సెట్ ధర నిర్ణయించారు. వాస్తవానికి బయట గజం లక్ష రూపాయల వరకు ఉంది. ఇదే అదనుగా భావించిన వైసీపీ పెద్దలు వారి అనుచరులను రంగంలో దింపి గజానికి రూ.500 ఎక్కువ వేసి అంటే రూ.60,500 చొప్పున 32 ప్లాట్లను సొంతం చేసుకున్నారు. ఇదంతా 2024 ఎన్నికల ప్రకటనకు ముందు జరిగింది. ఆ తరువాత ప్రభుత్వం మారడంతో తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి ఈ కుంభకోణంపై ప్రశ్నించారు. ఆ వేలంలో అమ్మిన భూములను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అయితే ప్రభుత్వం వాటిపై ఎటువంటి నిర్ణయం ప్రకటించలేదు. ప్రస్తుతం ఇంకో 39 ప్లాట్లు అందుబాటులో ఉండగా, వాటిని అప్‌సెట్ ధర రూ.75,560తో అమ్మాలని సూచించింది.

హత్యకు గురైంది ట్రాన్స్‌జెండర్

... 5వ పేజీ తరువాయి

బయ్యవరం వద్ద పడేశారనే వార్త ఈ ప్రాంతంలో దావానలంలా వ్యాపించింది. ఈ నేపథ్యంలో మునగపాక మండలం నాగులాపల్లిలో ట్రాన్స్‌జెండర్ ఒకరు అద్దెకు వుంటున్న ఇంటి వెలుపల రక్తపు మరకలు చూసిన స్థానికులు ఈ విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. మంగళవారం అర్ధరాత్రి క్లూస్ టీమ్ అక్కడకు వెళ్లి ఇంటిలో పరిశీలించారు. ఇంటిలో ఎవరెరు వుంటున్నారో పోలీసులు ఆరా తీశారు. బన్నీ అనే 30 ఏళ్ల యువకుడు, ట్రాన్స్‌జెండర్ కలిసి వుంటున్నట్టు గుర్తించారు. అర్ధరాత్రి దాటిన తరువాత అతడిని అదుపులోకి తీసుకున్నారు. ట్రాన్స్‌జెండర్ పేరు షైపాలి దిలీప్ శివశంకర్ అలియాస్ దీపు (40) అని అతను చెప్పినట్టు సమాచారం. అతను ఇచ్చిన సమాచారంతో కశింకోట సీఐ స్వామినాయుడు, పోలీసు సిబ్బంది బుధవారం ఉదయం అనకాపల్లి పట్టణ శివారులోని జగలమదుం కూడలి సమీపంలో జాతీయ రహదారికి వెళ్లే మార్గంలో ఒక బాక్సును స్వాధీనం చేసుకున్నారు. దానిని తెరిచిచూడగా తల, ఎడమ చేయి కనిపించాయి. వీటిని ప్యాక్ చేసి ఎన్టీఆర్ వైద్యాలయం మార్చురీకి పంపారు. అనంతరం నిందితుడిని వెంటబెట్టుకుని కశింకోట మండలం తాళ్లపాలెం మామిడివాక గెడ్డ వద్దకు వెళ్లారు. అక్కడ మిగిలిన శరీర భాగాలు (మొండెం) వున్న సంచిను అతను చూపించాడు. పంచనామా అనంతరం ఎన్టీఆర్ వైద్యాలయం మార్చురీకి తరలించారు. దీంతో బయ్యవరం వద్ద మంగళవారం లభించిన శరీర భాగాలు మహిళవిగా భావించిన పోలీసులు, బుధవారం మిగిలిన శరీర భాగాలు కూడా లభ్యమైన తరువాత హత్యకు గురైంది ట్రాన్స్‌జెండర్‌గా నిర్ధారించారు.

నాగులాపల్లి అద్దె ఇంటిలోనే హత్య?

ట్రాన్స్ జెండర్ దిలీప్ అలియాస్ దీపును సోమవారం అర్ధరాత్రి నాగులాపల్లిలోని అద్దె ఇంటిలోనే హత్య చేసి, శరీరాన్ని ముక్కలుగా నరికి, బెడ్‌షీట్‌లో, బాక్సులో, సంచిలో వేసుకుని మూడుచోట్ల పడేసినట్టు పోలీసుల విచారణలో బన్నీ చెప్పినట్టు తెలిసింది.

దీపుగా మారిన దిలీప్

హత్యకు గురైన ట్రాన్స్‌జెండర్ అసలు పేరు షైపాలి దిలీప్ శివశంకర్ (40). అనకాపల్లి గవరపాలెంలో ఉన్న ముత్రాసుకాలనీకి చెందిన దిలీప్..ట్రాన్స్‌జెండర్‌గా మారి 'దీపు'గా పేరుమార్చుకున్నాడు. అప్పటి నుంచి తల్లిదండ్రులకు దూరంగా వున్నాడు.

నాలుగేళ్ల నుంచి సహజీవనం

పశ్చిమ గోదావరి జిల్లా ఇరగవరం మండలం పొదలాడకు చెందిన బన్నీ కొన్నేళ్ల క్రితం ఉపాధి నిమిత్తం అనకాపల్లి వచ్చాడు. ఒక ఫుడ్ డెలివరీ కంపెనీలో బాయ్‌గా పనిచేస్తుండగా ట్రాన్స్‌జెండర్ దీపుతో పరిచయం ఏర్పడింది. సుమారు నాలుగేళ్ల నుంచి వీరు సహజీవనం చేస్తున్నట్టు తెలిసింది. ఏడాది క్రితం మునగపాక మండలం నాగులాపల్లిలో ఒక ఇల్లు అద్దెకు తీసుకుని నివాసం వుంటున్నారు. వీరిరువురూ తరచూ గొడవ పడుతూ ఉండేవారని స్థానికులు చెబుతున్నారు. ఈ కేసుకు సంబంధించి పూర్తి వివరాలను గురువారం మీడియాకు వెల్లడిస్తామని పోలీసు అధికారులు చెప్పారు. ఏం జరిగిందన్నది కొన్ని గంటల్లో తేలనుంది.

ఆరోగ్య కేంద్రాల్లో అంతంతమాత్రం సేవలు

... 5వ పేజీ తరువాయి

నెలకొంది. రెల్లివీధిలోని జాలారిపేట ప్రాంతంలో ఉన్న అర్బన్ హెల్త్ సెంటర్‌లోనూ ఇదే పరిస్థితి.

సెలవులతో ఇబ్బంది

అర్బన్ హెల్త్ సెంటర్‌లలో కొన్నిచోట్ల మినహా ఒక వైద్యుడు, ఇద్దరు స్టాఫ్ నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మసిస్టు, ఒక హెల్పర్ ఉంటారు. ఒక్క డాక్టరే ఉన్నచోట..ఆయన సెలవు పెడితే ఇబ్బంది ఎదురవుతోంది. బుధవారం రేసపువానిపాలెం, మద్దిలపాలెం అర్బన్ హెల్త్ సెంటర్స్‌లోని వైద్యులు సెలవులో ఉన్నారు. రేసపువానిపాలెం అర్బన్ హెల్త్ సెంటర్‌లో స్టాఫ్ నర్సే రోగులను పరీక్షిస్తున్నారు. మద్దిలపాలెం అర్బన్ హెల్త్ సెంటర్‌లోనూ అదే పరిస్థితి. ఈ సెంటర్‌లో ల్యాబ్ టెక్నీషియన్ కూడా సెలవులో ఉండడంతో రోగులకు అందించే సేవలపై తీవ్ర ప్రభావం పడింది.

మరికొన్ని ఇబ్బందులు..

కొన్ని అర్బన్ హెల్త్ సెంటర్స్‌లో మంచి నీటి సదుపాయం కల్పించేందుకు ప్రత్యేకంగా వాటర్ ట్యాంకులు ఏర్పాటుచేశారు. అయితే, కొన్నిచోట్ల పనిచేయడం లేదు. దీంతో హెల్త్ సెంటర్స్‌కు వచ్చే రోగులకు మంచినీటి ఇబ్బందులు తప్పడం లేదు. చినవాల్తేరు ఆరోగ్య కేంద్రంలో వాటర్ ప్యూరిఫైర్ యంత్రాలు మూలకు చేరి ఉన్నాయి. వేసవిలో అర్బన్ హెల్త్ సెంటర్స్‌లో ప్రత్యేకంగా ఓఆర్ఎస్ కార్నర్స్ ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. అయితే, అనేకచోట్ల ఓఆర్ఎస్ కార్నర్ వద్ద బాటిల్ నీరు, ప్యాకెట్లు పెట్టి వదిలేశారు.

అవగాహన ఏదీ.?

ఇదిలావుంటే అవగాహన లేక ప్రజలు కూడా స్థానికంగా ఉన్న అర్బన్ హెల్త్ సెంటర్స్‌కు వెళ్లడం లేదు. ఒక్కో అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలో దాదాపు 20 వేల మందికిపైగా ఉంటారు. కానీ, బుధవారం మధ్యాహ్నం 12 గంటల వరకూ చాలాచోట్ల కనీసం 20 మంది కూడా ఆరోగ్య కేంద్రాల సేవలను వినియోగించుకోలేదు. ఒకవైపు అర్బన్ హెల్త్ సెంటర్స్ వెలవెలబోతుంటే..మరోవైపు కేజీహెచ్, విమ్స్ మాత్రం రోగులతో కిటకిటలాడుతున్నాయి. పెద్దాస్పత్రులకు తాకిడి తగ్గాలంటే స్థానికంగా ఆరోగ్య కేంద్రాల్లో అందించే వైద్య సేవలపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించడంతోపాటు సిబ్బంది నిత్యం అందుబాటులో ఉండేలా ఉన్నతాధికారులు చూడాలి.

ఏప్రిల్ 30న అప్పన్న చందనోత్సవం

... 5వ పేజీ తరువాయి

ఆదేశించారు. దర్శనం కోసం రూ.1,500, రూ.1,000, రూ.300 టికెట్లు అమ్మకం ప్రణాళికాయుతంగా చేపట్టాలన్నారు. రూ.1,500 టికెట్ కొన్న భక్తులకు నీలాద్రిగుమ్మం వరకూ అనుమతిస్తామన్నారు. ఏప్రిల్ 30 తెల్లవారుజామున 3.30 నుంచి 4.30 గంటల వరకూ అనువంశిక ధర్మకర్త, సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తులకు అంతరాలయ దర్శనాలు ఉంటాయన్నారు. వీఐపీలకు అంతరాయల దర్శనాలపై ప్రభుత్వ అధికారులతో మాట్లాడిన తరువాత నిర్ణయం తీసుకుంటామన్నారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని కొండపైకి వచ్చే వాహనాలను గణనీయంగా తగ్గించాలని పోలీసులకు సూచించారు. పరిమిత సంఖ్యలో మాత్రమే వాహనాల పాస్‌లు ఇవ్వాలని, ప్రైవేటు వాహనాలను కొండపైకి అనుమతించవద్దన్నారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా కింద నుంచి కొండపైకి, దర్శనం తరువాత కొండ పై నుంచి కిందకు బస్సులు ఏర్పాటుచేయాలన్నారు. పోలీస్ కమిషనర్ శంఖబ్రతబాగ్చి మాట్లాడుతూ కొండపై అదనపు పార్కింగ్ ప్రదేశం ఏర్పాటుచేయాలని, శాశ్వత అవుట్ పోస్టు నెలకొల్పాలని సూచించగా, సంబంధిత అధికారులకు కలెక్టర్ ఆదేశాలు ఇచ్చారు. ఇంకా ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సీపీ చెప్పారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ అన్ని శాఖలతో దేవదాయ శాఖ అధికారులు సమన్వయం చేసుకోవాలన్నారు. సమావేశంలో డీఆర్వో భవానీశంకర్, భీమిలి ఆర్డీవో సంగీత్ మాథుర్, సింహాచలం ఇన్‌చార్జి ఈవో కె.సుబ్బారావు పాల్గొన్నారు.

మహా నిర్లక్ష్యం

... 5వ పేజీ తరువాయి

వేతనాలు, జీవీఎంసీ కార్యాలయాలకు విద్యుత్ బిల్లులు, అధికారుల వాహనాలు, ప్రజారోగ్య వాహనాలకు డీజిల్ కొనుగోలు వంటివి నిలిచిపోతాయి. వీటన్నింటి కోసం ప్రతినెలా సుమారు రూ.30 కోట్ల వరకు జీవీఎంసీ వెచ్చిస్తోంది. కొత్త ఆర్థిక సంవత్సరం ఆరంభం నాటికి బడ్జెట్ ఆమోదం పొందకపోతే జీవీఎంసీ కార్యకలాపాలు నిలిచిపోతాయని, అందువల్ల తక్షణం సమావేశం ఏర్పాటుచేయాలనే డిమాండ్ మొదలైంది. బడ్జెట్ సమావేశం ఏర్పాటుచేయాలని కోరుతూ జీవీఎంసీ మేయర్ గొలగాని హరివెంకటకుమారి ఇటీవల జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్, జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్‌కు లేఖ రాశారు. మరోవైపు సీపీఎం కార్పొరేటర్ బి.గంగారావు కూడా తక్షణం బడ్జెట్ సమావేశం ఏర్పాటుచేయాలని కోరుతూ మేయర్ గొలగాని హరివెంకటకుమారికి లేఖ అందజేశారు. అలాగే జనసేనకు చెందిన 22వ వార్డు కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ కూడా జీవీఎంసీ బడ్జెట్ సమావేశం ఏర్పాటులో అధికారులు తాత్సారం చేస్తున్నారంటూ రాష్ట్ర మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్‌కుమార్‌కు లేఖ రాశారు.

ఉక్కు ఉద్యోగులను వీడని గుబులు



- కేంద్ర ఆర్థిక శాఖ ప్రకటనతో ఆందోళన చెందుతున్న ఉద్యోగులు, కార్మికులు
- మళ్లీ ఉద్యమాన్ని ఉధృతం చేస్తామంటున్న కార్మిక సంఘాల నాయకులు

ఉక్కుటౌన్‌షిప్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంటుకు కేంద్రం భారీ ప్యాకేజీ ప్రకటించడంతో ఉపశమనం లభించిందని ఆనందిస్తున్న తరుణంలో ఉక్కు కార్మిక సంఘం నాయకుడు అడిగిన ప్రశ్నకు ప్రైవేటీకరణ విషయంలో ఎటువంటి మార్పులు లేవని కేంద్ర ఆర్థిక శాఖ లేఖ ద్వారా ప్రకటించడంతో ఉద్యోగుల్లో గుబులు మొదలైంది. కేంద్రం ప్రకటనతో ఎప్పుడు ఎలాంటి వార్త వినాల్సి వస్తుందోనని ఉద్యోగులు, కార్మికులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. స్టీల్‌ప్లాంటును ప్రైవేటీకరిస్తామని 2021 జనవరి 27న కేంద్రం ప్రకటించినప్పటి నుంచి ఉద్యోగులు, కార్మికులు ఆందోళన చెందుతూనే విధులు నిర్వర్తిస్తున్నారు. అయితే ఇటీవల కేంద్రం ఉక్కు కర్మాగారానికి భారీ ప్యాకేజీ ప్రకటించడంతో వారంతా కొంత ఉపశమనం పొంది ప్లాంటుకు మళ్లీ మంచిరోజులు వస్తాయని ఆశతో ఉన్నారు. మరికొద్ది రోజుల్లో ప్లాంట్ బ్లాస్ట్ ఫర్నేస్ విభాగం ప్రారంభంతో ఉత్పత్తి పెరుగుతుందని, తద్వారా ప్లాంటుకు పూర్వ వైభవం వస్తుందని ఆశించారు. ఈలోగా తాజాగా కార్మిక నాయకుడు అడిగిన ఓ ప్రశ్నకు సమాధానంగా ప్రైవేటీకరణ విషయంలో మార్పులు లేవని కేంద్ర ఆర్థిక శాఖ చెప్పడం ఉద్యోగులు, కార్మికులను కలచివేసింది. ప్రస్తుతం కర్మాగారంలో ఎక్కడ చూసినా ఇదే అంశంపై చర్చ జరుగుతుంది. ప్రైవేటీకరణలో భాగంగానే ఉద్యోగుల తగ్గింపు ప్రక్రియ చేపడుతున్నారని కార్మిక వర్గం ఆరోపిస్తుంది. దీంతో గత కొంతకాలంగా స్తబ్దుగా ఉన్న ఉక్కు ప్రైవేటీకరణ వ్యతిరేక ఉద్యమాన్ని మళ్లీ ఉధృతం చేస్తామని కార్మిక సంఘాల నాయకులు పేర్కొంటున్నారు.

కేంద్రం తీరులో మార్పు రావాలి

-డి.ఆదినారాయణ, ఉక్కు పోరాట కమిటీ చైర్మన్



స్టీల్‌ప్లాంట్ విషయంలో కేంద్రంలో మార్పు రావాలి. ప్యాకేజీ ముఖ్యం కాదు... ప్లాంట్ ప్రైవేటీకరణ చేస్తామని కేంద్రం చేసిన ప్రకటనను విరమించుకోవాలి. నోటి మాట ద్వారా ప్రజాప్రతినిధులు చెబుతున్నారు కానీ పేపర్ ద్వారా కేంద్రం తన పని తాను చేసుకుపోతుంది. ప్లాంటుకు మంచిరోజులు వస్తాయని ఎదురుచూస్తున్న తరుణంలో కేంద్రం ఇటాంటి ప్రకటన చేయడంతో ఉద్యోగులు, కార్మికుల్లో ఆత్మస్థైర్యం దెబ్బతింటుంది. ప్లాంట్ కోసం తాము ఎలాంటి త్యాగాలకైనా సిద్ధం.

ఏటీఎం కార్డులను మార్పు చేసి నగదు డ్రా చేస్తున్న దొంగ అరెస్టు

- రూ.లక్షా 1,43,000 స్వాధీనం
- నిందితుడిపై ఇప్పటికే 5 పోలీస్ స్టేషన్లలో కేసులు



వివరాలు తెలుపుతున్న జోన్-2 క్రైమ్ ఏసీపీ లక్ష్మణరావు. చిత్రంలో సీఐ శ్రీనివాసరావు, తదితరులు



నిందితుడు వీరయ్య చౌదరి

గాజువాక, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఏటీఎం కార్డులను మార్పు చేసి నగదు విత్‌డ్రా చేస్తున్న దొంగను గాజువాక క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. గాజువాక పోలీస్ స్టేషన్ కాంప్లెక్స్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జోన్-2 క్రైమ్ ఏసీపీ డి.లక్ష్మణరావు వివరాలను వెల్లడించారు. ఈ ఏడాది జనవరి 18న మింది ప్రాంతానికి చెందిన దాడి ఆనంద్ సన్యాసి తన భార్య కార్డుతో గాజువాకలోని లక్ష్మీకాంత్ థియేటర్ వద్ద గల ఏటీఎం కేంద్రంలో నగదు డ్రా చేసేందుకు యత్నించారు. ఆ సమయంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి అక్కడకు వచ్చి సహాయం చేస్తున్నట్టు నటించి సన్యాసి వద్దనున్న కార్డును తీసుకుని మరో కార్డును ఇచ్చాడు. అయితే మళ్లీ అదే నెల 20న నగదు డ్రా చేసేందుకు సన్యాసి ఏటీఎం వద్దకు వెళ్లగా ఆ కార్డు పనిచేయలేదు. దీంతో ఆయన చట్టివానిపాలెంలోని బ్యాంకుకు వెళ్లి ఆరా తీయగా ఆ ఏటీఎం కార్డు నుంచి రూ.75 వేలు డ్రా చేసినట్టు సిబ్బంది తెలిపారు. ఈ మేరకు సన్యాసి గాజువాక క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు సాంకేతిక ఆధారాలతో ఏటీఎం కార్డును మార్చేసిన మర్రిపాలేనికి చెందిన ముప్వ వీరయ్యచౌదరి (41)ని గాజువాక మోహిని థియేటర్ ఎదురుగా ఉన్న ఎస్‌బీఐ ఏటీఎం వద్ద అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు. నిందితుడు పాత నేరస్థుడేనని, ఆయన వద్ద నుంచి 1,43,000 నగదు, వాచ్‌ను స్వాధీనం చేసుకున్నట్టు ఏసీపీ లక్ష్మణరావు తెలిపారు. నిందితుడిపై గాజువాక, పెందుర్తి, గోపాలపట్నం, కంచరపాలెం, ఎయిర్‌పోర్టు పోలీస్ స్టేషన్‌లో కేసులు ఉన్నాయన్నారు. సమావేశంలో సీఐ కె.శ్రీనివాసరావు, ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.



తిరువీధి ఉత్సవంలో త్రిశక్తి అమ్మవార్లు

వైభవంగా త్రిశక్తి ఆలయ వార్షికోత్సవం

ఉక్కుటౌన్‌షిప్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ త్రిశక్తి ఆలయ వార్షికోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా బుధవారం అంకురారోపణ, ధ్వజారోహణ, అగ్నిప్రతిష్ఠాపన, అష్టోత్తర కలశారాధన, మూలమంత్ర విశేష హోమాలు చేశాక అమ్మవార్ల తిరువీధి ఉత్సవాన్ని నిర్వహించారు. గురువారంతో వేడుకలు ముగుస్తామని, ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు జరపనున్నట్టు ఆలయ ప్రధాన అర్చకులు ఫణిశర్మ తెలిపారు.

నేడు మరిడిమాంబ జాతర

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు పరిధి కొండయ్యవలస ఉక్కు నిర్వాసితుల గ్రామాల ప్రజల ఆరాధ్య దేవత మరిడిమాంబ జాతరను గురువారం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఇందులో భాగంగా ప్రధాన కూడళ్ల వద్ద భారీ హోర్డింగ్‌లను ఏర్పాటు చేయడంతో పాటు ఆలయం నుంచి ప్రధాన రహదారుల వరకు విద్యుద్దీపాలతో అలంక రించారు. భారీ ఎత్తున సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నారు.

నేడు ఆలయ వార్షికోత్సవం

గ్రేటర్ 85వ వార్డు పరిధి ఈ-మర్రిపాలెం బస్టాప్ కూడలిలో గల శ్రీరుణ విమోచన లక్ష్మీగణపతిస్వామివారి ఆలయ వార్షికోత్సవాన్ని గురువారం నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త దానబోయిన అప్పలనాయుడు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయంలో లక్ష్మీగణపతి హోమం, పంచామృతాభిషేకాలు చేస్తామన్నారు. మధ్యాహ్నం అన్న సమారాధన చేపడతామన్నారు.

శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాల కరపత్రాల ఆవిష్కరణ

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 87వ వార్డు వడ్లపూడి సమీపంలోని రాజుల పాలెంలో శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ప్రతినిధి బెల్లంకొండ అశోక్‌రాజు మాట్లాడుతూ ఏప్రిల్ ఆరు నుంచి 12వ తేదీ వరకు శ్రీవారి బ్రహోత్సవాలను ఘనంగా నిర్వహిస్తామన్నారు. కమిటీ ప్రతినిధులు యూవీ కాశీరాజు, పి.రామకృష్ణంరాజు, వరహాలబాబు, జి.గోపి, శివపార్వతి, వర్మ, సుబ్బరాజు, మధువర్మ తదితరులు పాల్గొన్నారు.



వేపగుంట-పినగాడి రహదారి

రోడ్డు విస్తరణపై అభ్యంతరాల వెల్లువ

పెందుర్తిరూరల్, మార్చి19 (ఆంధ్రజ్యోతి): వేపగుంట నుంచి పినగాడి కూడలి వరకు ప్రధాన రహదారిని 150 అడుగుల మేర విస్తరించడానికి అభ్యంతరాల స్వీకరించే పక్రియ బుధవారం సాయంత్రంతో ముగిసింది. వీఎంఆర్‌డీఏ అధికారులు ఇచ్చిన ఉత్తర్వుల మేరకు స్థానికులు పెద్ద సంఖ్యలో స్పందించారు. చీమలాపల్లి, లక్ష్మీపురం, పినగాడి గ్రామాల్లో రహదారికి ఆనుకొని నివాసాలు ఏర్పాటు చేసుకున్న వారు, వ్యాపార సముదాయాల యజమానులు అభ్యంతరాలను రాతపూర్వకంగా అధికారులకు అందజేశారు. విస్తరణ పరిధి తగ్గించాలని, స్థలాలు, నివాసా లు కోల్పోయిన వారికి నష్ట పరిహారం, ప్రత్యామ్నాయ స్థలాలు ఇవ్వాలని కోరారు.

వడదెబ్బతో పోర్టు ఉద్యోగి మృతి



గోవిందరావు (ఫైల్)

గోపాలపట్నం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): వడదెబ్బకు గురై పోర్టు ఉద్యోగి మృతి చెందాడు. ఈ సంఘటన కొత్తపాలెం అండ్‌పాత్‌వే వద్ద బుధవారం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. గ్రేటర్ పరిధి 92వ నార్త్ రైల్వే క్వార్టర్స్ రోడ్డులో నివాసముంటున్న పోర్టు ఉద్యోగి ఎన్నేటి గోవిందరావు(55)కు ఆరోగ్యం బాగా లేకపోవడంతో సెలవుపెట్టి ఇంటి దగ్గరే ఉంటున్నాడు. బుధవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో టీ తాగేందుకుకొత్తపాలెం అండర్ పాత్‌వే వద్దకు నడుచుకుంటూ వెళ్తూ వడ దెబ్బకు గురై రోడ్డుపై సొమ్మసిల్లి పడిపోయాడు. దీంతో తలకు తీవ్ర గాయమైంది. స్థానికులు 108 వాహనానికి సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి పరీక్షించగా అప్పటికే మృతిచెందినట్టు నిర్ధారించారు. గుర్తుతెలియని వాహనం ఢీ కొనడంతో గోవిందరావు మృతి చెందాడని కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి సమీపంలోని సీసీ ఫుటేజీలను పరిశీలించగా గోవిందరావు సొమ్మసిల్లి పడిపోయి, తలకు గాయమై మృతిచెందినట్టు గుర్తించారు.

జప్తు వాహనం ప్రారంభం

వేపగుంట, మార్చి 19(ఆంధ్రజ్యోతి): వేపగుంట జోనల్ కార్యాలయం పరిధిలో ఆస్తిపన్ను వసూలుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా పన్ను చెల్లించని వారి నుంచి కొళాయి కనెక్షన్లు జప్తు చేసేందుకు వాహనాన్ని ఏర్పాటు చేసినట్టు జెడ్సీ కె.హైమావతి తెలిపారు. ఈ వాహనాన్ని బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ పీవీవీఎస్ మూర్తి, ఆర్.ఐలు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **శబ్దం:** సంగం, శారద, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ- 2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక),
- **మజాకా:** శ్రీ వెంకటేశ్వర-1, రమాదేవి, శ్రీరామా, గోకుల్, కామేశ్వరి, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), లిఖిత (శ్రీహరిపురం),
- **డ్రాగన్:** జగదాంబ, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి),
- **తండేల్:** శ్రీవెంకటేశ్వర, శ్రీలీలామహల్, నరసింహ (గోపాలపట్నం), అరుణ (పెదగంట్యాడ)
- **సంక్రాంతికి వస్తున్నాం:** మెలోడీ, జగదాంబ, కాంతి, శ్రీనరసింహ (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), తాతా, రాములమ్మ (తగరపువలస)
- **డాకు మహారాజ్:** శరత్, మోహిని కాంప్లెక్స్, శ్రీకన్య హెవెన్ (గాజువాక), గణేష్, సప్తగిరి (తగరపువలస)
- **గేమ్ ఛేంజర్:** మెలోడీ, సంగం, కామేశ్వరి, కన్య కాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-2 (పెందుర్తి) రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 23, టమాటా 15, వంకాయలు (తెలుపు) 36, వంకాయలు (నలుపు) 38, బెండకాయలు 32, పచ్చిమిర్చి 30, కాకరకాయలు 38, బీరకాయలు 46, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 20, క్యాబేజీ 14, క్యారెట్ 24 దొండకాయలు 30, బంగాళదుంపలు 16, అరటికాయ (పె)8, అల్లం (పాతది)50, బరబాటి 32, ముల్లంగి 22, నిమ్మకాయలు (కిలో) 100, మునక్కాడలు (కిలో) 38, బద్దచిక్కుడు 52, దోసకాయలు 22, వెల్లుల్లి (పెద్దవి) 100, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 56, కీరదోస 20, కాప్సికమ్ 42, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 40 చిలగడదుంపలు 40, కంద 64, దేముడుచిక్కుడు 60, గోరుచిక్కుడు 38, కూరపెండలం 26, బ్రకోలి 45, నూల్‌కోల్ 30, పనసపొట్టు 200, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్ద కట్ట) 15, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 90, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 22, మామిడి అల్లం 64, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	415
విజయనగరం	419
శ్రీకాకుళం	419

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	87
లైవ్ ధర	107
విత్ స్కిన్	184
స్కిన్‌లెస్	194



సీఐఎస్ఎఫ్ సిబ్బందిని సత్కరిస్తున్న ఆర్మీ అసోసియేషన్ ప్రతినిధులు

సీఐఎస్ఎఫ్ సిబ్బందికి ఘన స్వాగతం

అగనంపూడి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): సీఐఎస్ఎఫ్ సిబ్బంది పశ్చిమ బెంగాల్ నుంచి కన్యాకుమారి వరకు చేపట్టిన సైక్లోథాన్ యాత్ర బుధవారం అగనంపూడికి చేరింది. స్థానిక పైడిమాంబ ఆర్మీ అసోసియేషన్ ఆధ్వర్యంలో సీఐఎస్ఎఫ్ సిబ్బందికి ఘనంగా స్వాగతం పలికారు. దేశం సురక్షతంగా ఉండాలని, విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, యువతులు అన్ని రంగాలలో రాణించాలని ఆకాంక్షిస్తూ ఈ యాత్ర చేపట్టినట్టు సీఐఎస్ఎఫ్ సిబ్బంది పేర్కొన్నారు. అనంతరం ఆర్మీ అసోసియేషన్ ప్రతినిధులు సీఐఎస్ఎఫ్ సిబ్బందిని ఘనంగా సత్కరించి భోజన ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్, టీడీపీ వార్డు అధ్యక్షుడు కర్రి దోశేంద్ర, అసోసియేషన్ ప్రతినిధులు మేడిశెట్టి ఉమామహేశ్వరరావు, విందుల సూర్యారావు, రాజు, తదితరులు పాల్గొన్నారు.

పేదల స్థలాలకు ఉచిత రిజిస్ట్రేషన్ చేయాలి

- శాసనసభలో పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు



మాట్లాడుతున్న గణబాబు

గోపాలపట్నం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): గతంలో తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్న సమయంలో జారీచేసిన 296, 388 జీవో ద్వారా పట్టాలు పొందిన పేదల స్థలాలకు రిజిస్ట్రేషన్‌లు జరగలేదని పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు అసెంబ్లీలో గళం విప్పారు. గత వైసీపీ ప్రభుత్వం ఈ జీవోల విషయంపై నిర్లక్ష్యం చేయడంతో ఇళ్ల పట్టాలు పొందిన లబ్ధిదారుల ఇళ్లకు రిజిస్ట్రేషన్‌లు జరగలేదని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత జారీ చేసిన జీవో నెంబరు 30 ద్వారా ఈ సమస్య పరిష్కారం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అదే విధంగా దశాబ్దాల క్రితం గెడ్డలు, వాగుల్లో ఇళ్ల నిర్మాణం చేసుకున్నవారికి పట్టాలు మంజూరు చేయలేదని, దీనికి ప్రత్యామ్నాయంపై పునరాలోచన చేసి లబ్ధిదారులకు పట్టాలు మంజూరు చేయాలని కోరారు. గతంలో తెలుగుదేశం ప్రభుత్వం హయాం లో పట్టాలు మంజూరు చేసిన లబ్ధిదారుల ఇళ్లకు రిజిస్ట్రేషన్‌లు జరిపే విషయంపై జిల్లా యంత్రాంగానికి తగు దిశానిర్దేశం చేయాలని గణబాబు కోరారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

అక్కిరెడ్డిపాలెం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): బీహెచ్‌పీవీ సబ్ స్టేషన్ షీలానగర్, వెంకటేశ్వర కాలనీ 11కేవీ ఫీడర్ల పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు, నిర్వహణ పనులు చేపడుతున్నందున ఈ 21వ తేదీ ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు ఈపీడీసీఎల్ జోన్-2 ఈఈ బీకే నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా షీలానగర్, బీహెచ్‌పీవీ క్వార్టర్స్, గవర జగ్గయ్యపాలెం, దుర్గా కాలనీ, కుమిలి లే అవుట్, వెంకటేశ్వర కాలనీ, కిమ్స్ ఆస్పత్రి ఏరియా, రిజిస్ట్రార్ కార్యాలయం, నక్షత్ర అపార్టుమెంట్ ఏరియా ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

ఉక్కు యాజమాన్యం ద్వంద్వ వైఖరిని విడనాడాలి

పెదగంట్యాడ, మార్చి 19(ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం ద్వంద్వ వైఖరి విధానాన్ని విడనాడాలని ఇంటక్ ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మిక సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు వంశీకృష్ణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాంట్రాక్ట్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించే అంశంపై జాయింట్ లేబర్ కమిషనర్ దగ్గర చర్చలు జరుగుతున్నాయని, ఈ సమయంలో కాంట్రాక్ట్ కార్మికులను తొలగించడం దారుణమన్నారు. బుధవారం కూడా కొందరు కార్మికులను తొలగించిందని, మరో రెండు రోజుల్లో నాలుగు వందల మందిని తొలగించేందుకు చర్యలు చేపట్టనున్నట్టు పేర్కొన్నారు.

పారిశ్రామిక ప్రాంతంలో నిలిచిన నీటి సరఫరా

మల్కాపురం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామిక ప్రాంతంలో బుధవా రం పలుచోట్ల తాగునీరు సరఫరా కాలేదు. విద్యుత్ సరఫరా లేకపోవడంతో నీటిని సరఫరా చేయలేకపోయామని ఆ విభాగం సిబ్బంది చెబుతుండగా, అసలు విద్యుత్‌కు అంతరాయమే కలగలేదని ఆ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. రెండు శాఖల అధికారుల మధ్య సమన్వయలోపం కారణంగా జనం నీటికి అవస్థలు పడ్డారు. మల్కాపురంలో అన్ని వీధులకు ఇండస్ట్రియల్ కాలనీలోని ట్యాంక్ ద్వారా నీటిని సరఫరా చేస్తారు. ట్యాంక్ నిండాలంటే విద్యుత్ అవసరం. అయితే ఇక్కడ ఉదయం నుంచీ విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ట్యాంక్ నిండలేదని, అందువల్ల సరఫరా చేయలేకపోయామని ఆ విభాగం అధికారులు పేర్కొంటున్నారు. కాగా మల్కాపురం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఎక్కడా నిర్వహణ పనులు చేపట్టలేదని, సరఫరాలో ఎలాంటి అంతరాయం లేదని విద్యుత్ శాఖాధికారులు చెబుతున్నారు. దీంతో వేలాది మంది తాగునీ టి కోసం ఇబ్బందులు పడ్డారు. ప్రైవేటు వాటర్‌ప్లాంట్‌లకు వెళ్లి నీటిని కొనుగోలు చేయాల్సి వచ్చిందని వాపోయారు.

శాంతిగిరి కాలనీలో సీపీఎం ప్రజా చైతన్యయాత్ర

మల్కాపురం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 59వ వార్డు శాంతిగిరి కాలనీలో బుధవారం సీపీఎం నేతలు ప్రజాచైతన్య యాత్రను నిర్వహించారు. ప్రజల నుంచి సేకరించిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషిచేస్తామన్నారు. బూడి శ్రీను, కె.రమణ, రాజేష్, రామకృష్ణ, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.



కూర్మన్నపాలెం-అగనంపూడి రోడ్డులో స్టాపర్లను ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

కూర్మన్నపాలెం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మానవ తప్పిదాలే ఘోర ప్రమాదాలకు దారితీస్తాయని అనడానికి ఇటీవల జరిగిన ప్రమాదాలను గమనించవచ్చని దువ్వాడ ట్రాఫిక్ సీఐ కె.వెంకటరావు అన్నారు. ఇటీవల స్టీల్ సిటీ ఆర్టీసీ డిపో వద్ద జరిగిన ప్రమాదంలో ఇద్దరు మృత్యువాత పడ్డారు. ఈ నేపథ్యంలో సీపీ ఆదేశాలతో రోడ్డు ప్రమాదాల నివారణకు సీఐ వెంకట్రావు బుధవారం కూర్మన్నపాలెం జంక్షన్ నుంచి అగనంపూడి వరకు స్పీడ్ లిమిట్ 40 కి.మీ. బోర్డులను, రేడియం స్టిక్కర్లు, ఇండికేషన్ బోర్డులు, జిగ్‌జాగ్ స్టాపర్లను ఏర్పాటు చేశారు. వాహనదారులు, ఆటో డ్రైవర్లు, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా రహదారి నిబంధనలను ఆయన కోరారు.

నేడు స్టీల్‌ప్లాంట్ కో-ఆపరేటివ్ స్టోర్స్ సర్వసభ్య సమావేశం

ఉక్కుటౌన్‌షిప్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ కో-ఆపరేటివ్ స్టోర్స్ 59వ సర్వసభ్య సమావేశం గురువారం స్టీల్ క్లబ్‌లో నిర్వహించనున్నట్టు పాలకవర్గ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం ఐదున్నరకు ప్రారంభమయ్యే సభలో పలు అంశాలపై చర్చించడం జరుగుతుందని, సభ్యులందరూ హాజరు కావాలని కోరారు.

నేడు ముత్యాలమ్మ మారువారం పండగ

వేపగుంట, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): వేపగుంట ముత్యాలమ్మ అమ్మవారి మారువారం పండగ గురువారం నిర్వహించనున్నట్లు అర్చకులు శేషాద్రిశర్మ తెలియపారు. కాగా అమ్మవారికి అభిషేకం చేసేందుకు వీలుగా రూ.75వేలు విలువ చేసే వెండిశంఖంను వేపగుంటకు చెందిన గంటల శ్రీను కుటుంబసభ్యులు అందజేశారు.

రైల్వే పరీక్ష రద్దుతో అభ్యర్థుల ఆగ్రహం



ఆర్పీఎఫ్ పోలీసు ఎదుట ఆగ్రహం వ్యక్తం చేస్తున్న అభ్యర్థులు

పెందుర్తి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): అసిస్టెంట్ లోకో పైలెట్ ఉద్యోగాలకు రైల్వే శాఖ బుధవారం నిర్వహించాల్సిన కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సీబీటీ-2) రద్దుకావడంతో చినముషిడివాడ ఐయాన్ డిజిటల్ కేంద్రం వద్ద అభ్యర్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ముందస్తు సమాచారం లేకుండా పరీక్ష రద్దుచేయడంపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. రెండు పూటలా నిర్వహించనున్న పరీక్షకు ఇతర రాష్ట్రాల నుంచి పెద్దసంఖ్యలో అభ్యరులు ఐయాన్ డిజిటల్ కేంద్రానికి తరలివచ్చారు. ఇంటిమేషన్ స్లిప్పులు సరిచూసుకుని కేంద్రానికి చేరుకున్న వారికి పరీక్ష జరగడం లేదని తెలియడంతో కంగుతిన్నారు. ప్రశ్నించిన వారిపై ఆర్పీఎఫ్ పోలీసులు దురుసుగా ప్రవర్తించారన్నారు. పెందుర్తి పోలీసులు అభ్యర్థులకు నచ్చజెప్పడంతో వివాదం సద్దుమణిగింది. సర్వర్ కనెక్ట్ కాకపోవడం, సాంకేతిక సమస్యతో పరీక్షను రద్దుచేసినట్టు రైల్వే అధికారులు తెలిపినట్లు నోటీసు బోర్డులో పేర్కొన్నారని సీఐ కేవీ సతీశ్‌కుమార్ వివరించారు.

షిర్డీ సాయిబాబా విగ్రహం మార్పు

మల్కాపురం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): శ్రీహరిపురం మహాత్మాగాంధీ షాపింగ్ కాంప్లెక్స్ ఆవరణలో ఉన్న షిర్డీ సాయిబాబా విగ్రహాన్ని బుధవారం అన్నదాన ప్రదేశం వద్దకు మార్చారు. ఆలయ కమిటీ ప్రతినిధి నాగేశ్వరరావు పర్యవేక్షణలో క్రేన్ సహాయంతో ప్రతిష్ఠించారు. ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు చేస్తున్నారు.

అభివృద్ధి పనులను ప్రారంభించిన కార్పొరేటర్లు

గోపాలపట్నం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 88 వ వార్డులోని పలు కాలనీల్లో రూ.15 లక్షలతో ఏర్పాటు చేసిన హైమాస్ట్ విద్యుత్ దీపాలను వార్డు కార్పొరేటర్ మొల్లిముత్యాలనాయుడు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డులో దశలవారీగా పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పించేదిశగా చర్యలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో గవర సత్తిబాబు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

శ్రమశక్తినగర్‌లో బస్ షెల్టర్..

పెందుర్తి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 97వ వార్డు శ్రమశక్తినగర్ ఫస్ట్ లేఅవుట్‌లో బస్‌షెల్టర్‌ను బుధవారం కార్పొరేటర్ సేనాపతి వసంత ప్రారంభించారు. శ్రమశక్తినగర్ వెల్ఫేర్ ఫండ్ నుంచి షెల్టర్ నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ కాలనీ సంఘం సేవలు ప్రశంసించారు. కార్యక్రమంలో వాసము వెంకటేశ్వరరావు, సీహెచ్ రమణమూర్తి, వి.శంకరప్రసాద్, జనార్దనరావు, గజపతి, జగన్నాథస్వామి, శ్రీహరి, ధర్మరాజు, శ్రీకాంత్, శంకరరావు, మధు పాల్గొన్నారు.